





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



వక్ఫ్ చట్టం
దాని పర్యవసానాలు

హింస కంటే శాంతి చర్చలే మేలు

ఛిద్రమవుతున్న
మధ్యతరగతి ప్రజలు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 132 | శనివారం | 12-04-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## 14న భూ భారతి పోర్టల్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న 'తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్ 2025' పోర్టల్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో భూ భారతిని పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్లను సిసిఎల్ఎ నవీన్ మిట్టల్ ఆదేశించారు. భూ భారతి ప్రారంభోత్సవానికి కావాల్సిన ఏర్పాట్లను, వేదికపైన పోర్టల్ ఆవిష్కరణకు కావాల్సిన ఏర్పాటు చేయాలని, అలాగే బందోబస్తు ఏర్పాట్లు చేయాలని నవీన్ మిట్టల్ శుక్రవారం సూచించారు.

# ట్రిపుల్ ఆర్ పక్కన డ్రైపోర్ట్

- సరైన ప్రాంతంలో ఏర్పాటు
- ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపకల్పన
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- హైదరాబాద్ – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి డిపిఆర్ తయారీపై దృష్టి
- హైదరాబాద్ నగరానికి ఛత్తీస్‌గఢ్ రాజధానితో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు
- జాతీయ రహదారుల నిర్మాణం ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై సమీక్ష



ప్రజాపక్షం /హైదరాబాద్

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సిఎం అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై ఐసిసిసిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఎపి అధికారుల సమావేశంలో హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డిపిఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని సిఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డిపిఆర్ కన్సల్‌టెన్సీ నివేదికను త్వరగా పూర్తిచేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్ఎఐ) పంపించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో తరువాయి 2లో

## దేవాలయాల్లో అక్రమాలకు చెక్

- ఇక నుంచి అంతా పారదర్శకమే
- విధివిధానాలు ఖరారు చేయండి
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- నకిలీ టిక్కెట్ల దందా, ఇతర అక్రమాలపై ఆరా



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాపక్షం ఎఫెక్ట్

బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలోని దేవాలయాల్లో చోటు చేసున్న నకిలీ టికెట్ల దందా..ఇతర అక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. గత పదేళ్లలో దేవాలయాల్లో జరిగిన అవినీతిపై '' దేవుడి సొమ్ము దోచుకున్నారు' అనే శీర్షికతో శుక్రవారం 'ప్రజాపక్షం' బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే మంత్రి దృష్టికి వచ్చిన ఆయా దేవాలయాల్లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై నివేదికలు తెప్పించుకున్నారు. ఇక నుంచి దేవాలయాల్లో అవినీతి అక్రమాలకు తావులేకుండా, నిధులు దుర్వినియోగం కాకుండా పారదర్శకంగా తరువాయి 2లో

## మూసీ పునరుజ్జీవ పనులు వేగవంతం

- బాపూఘాట్‌లో గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్‌బండ్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి
- జూన్‌లో నిర్మాణ పనులకు టెండర్ పిలవాలని ఆదేశం



ప్రజాపక్షం / హైదరాబాద్

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్‌లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ అలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సిఎం పరిశీలించారు. మీర్ అలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డిపిఆర్‌ను సిద్ధం చేసుకోవాలని తరువాయి 2లో



మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా అంబర్‌పేట్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




ఔటర్ పరిధిలో హద్దుల నిర్ణయంపై ఎన్‌ఆర్ఎస్‌సితో ఒప్పందం 03

- ఇక భూ వివరాలు ఎంతో సులభం



ఫీచర్ సిటీ వరకూ మెట్రోరైల్ విస్తరణ 03

అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయండి

సమీక్షలో మెట్రో రెండోదశ విస్తరణ ప్రతిపాదనల పురోగతిపై ఆరా


## బిఆర్ఎస్ సభకు నో పర్మిషన్

- అనుమతి కోసం కోర్టుకెక్కిన గులాబీ పార్టీ
- విచారణ చేపట్టిన హైకోర్టు
- 17వరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం
- తదుపరి విచారణ 21కి వాయిదా




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

బిఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు వరంగల్ పోలీసులు అనుమతి నిరాకరించారు. బిఆర్ఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు కావస్తున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారీ సభను నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలను ఈ సభకు తరలించాలని బిఆర్ఎస్ నాయకులు తరువాయి 2లో

## రూ.10వేల కోట్ల బడా ఆర్థిక మోసం

- హెచ్‌సియు భూముల్లో జరిగినట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపణ
- పర్యావరణ విధ్వంసమూ జరిగిందని విమర్శ
- భూ కుంభకోణంలో సూత్రదారి, పాత్రదారి సిఎం అని వ్యాఖ్య ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

హెచ్‌సియు భూముల్లో పర్యావరణ విధ్వంసంతో పాటు రూ10 వేల కోట్ల బడా ఆర్థిక మోసం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు.ఈ భూ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా సిఎం రేవంత్ రెడ్డినేనని, ఇందులో ఒక బిజెపి ఎంపి పాత్ర కూడా ఉన్నదని,త్వరలోనే ఆయన పేరు భయటపెడుతానని తెలిపారు. ఈ కుంభకోణంపైన ప్రధాని,కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి,ఆర్‌బిఐ గవర్నర్, తరువాయి 2లో

## భూములమ్మిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదే

- హైదరాబాద్ చుట్టుపక్కల ప్రభుత్వ భూములు అస్మదీయులకు కట్టబెట్టారు
- అతితక్కువ సమయంలో అత్యంత ఎక్కువగా ప్రజా సొమ్మును కొల్లగొట్టారు
- హెచ్‌సియు భూములపై పూటకో డ్రామా ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్ : టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

జిహెచ్ఎంసి పరిధిలో పది వేల ఎకరాలకు పైగా భూములు అమ్మిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదేనని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ చుట్టు పక్కల అత్యంత విలువైన ప్రభుత్వ భూములను బిఆర్ఎస్ అస్మదీయులకు కట్టబెట్టింది వాస్తవమా కాదా అని కెటిఆర్‌ను ఆయన ప్రశ్నించారు. పదేళ్లలో యథేచ్ఛగా భూములు దోపిడీ చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. హెచ్‌సియు భూములకు సంబంధించి కెటిఆర్ ఐఎంజి సంస్థ బిల్లిరావుతో 30 శాతం ముడుపులు మాట్లాడుకుని కుదుర్చుకున్న ఒప్పందం బెడిసి కొట్టడంతో తరువాయి 2లో

## లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖరరెడ్డి

మానవహక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎ.రాజశేఖర్‌ను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఉపలోకాయుక్తగా బిఎస్ జగ్జీవన్‌కుమార్, మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్‌లను కూడా ప్రభుత్వం నియమించింది. ఇక మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్‌ను నియమించింది. కాగా వీరి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలకు గత శనివారమే గవర్నర్ ఆమోదం తెలిపారు.

## ప్రతి రైతుకూ నష్టపరిహారం

- అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతను ఆదుకుంటాం
- రాష్ట్ర వ్యాప్తంగా 24వేల ఎకరాల్లో పంటనష్టం
- మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం వెల్లడి
- సిద్దిపేట జిల్లా ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న పంటపొలాల పరిశీలన



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

ఆకాల వర్షాలతో నష్టపోయినప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు వెల్లడించారు. శుక్రవారం జిల్లాలోని చిన్నకోడూరు మండలం ఇబ్రహింనగర్‌లో ఆకాల వర్షాలు,వడగండ్ల వానతో నష్టపోయిన పంటపొలాలను రాష్ట్ర మంత్రుల బృందం తరువాయి 2లో

## బీహార్, జార్ఖండ్‌లో పిడుగుల వర్షం

- మొత్తంగా 65 మంది మృత్యువాత
- బీహార్‌లో వడగళ్ల బీభత్సానికి ఇళ్లు ధ్వంసం



**పాట్నా/హజారిబాగ్ :** బీహార్, జార్ఖండ్‌లో పిడుగుల, వడగళ్ల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రాష్ట్రల్లో పిడుగులు పడి మొత్తంగా 65 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా బీహార్‌లో మరో 36 మంది మృతి చెందినట్లు నివేదికలు రాగా ఈ రాష్ట్రంలో మొత్తం మృతుల సంఖ్య 61కి చేరినట్లు శుక్రవారం అధికారులు చెప్పారు. కాగా, గురువారం రాత్రి పిడుగులు, వడగళ్ల వర్షం పడింది. దీంతో 36 మంది వడగళ్లు, వర్షం సంబంధిత ఘటనలో మృతి చెందగా, 22 మంది పిడిగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. గురువారం సాయంత్రం నాటికి 25 మంది మృతి చెందినట్లు నివేదికలు రాగా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పూర్తి సమాచారం మేరకు శుక్రవారం నాటికి ఆ సంఖ్య 61కి చేరినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్క నలంద జిల్లాలోనే అత్యధికంగా 23 మంది మృతి చెందారు. ఈ మేరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం ఒక ప్రకటనను జారీ చేసింది. నలంద తరువాత భోజ్‌పూర్ ఆరుగురు, శివాన్, తరువాయి 12లో

## టెట్ పరీక్షలు జూన్ 15 నుంచి

- 30వ తేదీ వరకు నిర్వహణ
- ఈనెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజి టెట్ 2025) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. టెట్ షెడ్యూల్‌కు సంబంధించిన తరువాయి 2లో

## జాబ్ మేళాలతో నిరుద్యోగం అంతం

- మంత్రి కొండా సురేఖ
- వరంగల్ జాబ్‌మేళాకు భారీగా పోటెత్తిన అభ్యర్థులు
- 5,631 మందికి నియామక పత్రాలు అందించిన మంత్రి




ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాకు ఊహించదానికంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో ఎంపికఅయిన అభ్యర్థులకు నియామక పత్రాలను అటవీ,పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. అనంతరం మంత్రి కొండా సరేఖ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పారద్రోలడానికి ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో గాను ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల కళ్ళల్లో ఆనంద భాష్పాలతో కనిపించాయని, ఈ యొక్క జాబ్ మేళా కార్యక్రమంలో నిరుద్యోగ యువత కు ఎలాంటి ఇబ్బంది తరువాయి 12లో

## అమెరికాపై చైనా ఎదురుదాడి

సుంకాలను 125 శాతానికి పెంపు



**బీజింగ్:** చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై అమెరికా సుంకాలను 145 శాతం పెంచడం ప్రకంపనలు సృష్టిస్తున్నది. చైనా ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకొని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం విమర్శలకు గురవుతున్నది. కాగా, చైనా కూడా ఈ నిర్ణయంపై దీటుగా స్పందించింది. అమెరికా వస్తువులపై టారిఫ్‌ను 41 శాతం పెంచింది. దీనితో ఈ టారిఫ్ 125 శాతానికి చేరింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై ఇప్పటి వరకూ 84 శాతం సుంకం ఉండేది. అమెరికా ఏకపక్ష నిర్ణయాలతో సుంకాలను భారీగా పెంచడాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో చైనా సవాలు చేసింది. ఇప్పటి వరకూ టారిఫ్ పెంచిన దేశాలేవీ ప్రతిస్పందనగా అమెరికాపై అలాంటి నిర్ణయమే తీసుకోలేదు. సరైన సమాధానం ఇచ్చిన తొలి దేశం తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పుతిన్ – విట్‌కాఫ్ భేటీ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ ఉక్రెయిన్ అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ధృవీకరించారు. చాలా కష్టతరమైన పని కొనసాగుతున్నదని, సహజంగానే ట్రంప్ ప్రత్యేక ప్రతినిధిగా విట్‌కాఫ్ తమ అధ్యక్షుడు పుతిన్ కోసం ఏదైనా సమాచారం తీసుకొని వస్తారని పెస్కోవ్ అన్నట్లు టాస్ వార్తా సంస్థ తెలిపింది. పుతిన్ ఆయన మాటలు వింటారని, వారి చర్చల్లో అనేక అంశాలు ఉంటాయని, అందులో ఉక్రెయిన్ పరిష్కారం కూడా ఉంటుందన్నారు. కాగా , రష్యా ఆర్థిక చర్చల ప్రతినిధి కిరిల్ డిమిత్రియెవ్, విట్‌కాఫ్‌లు సెయింట్ పీటర్స్‌బర్గ్‌తో కలిసి ఒక హోటల్‌కు వెళ్తున్న దృశ్యాలు రష్యా మీడియాలో వచ్చాయి. గత కొద్ది కాలంగా ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ వ్యవహారంపై ప్రతిష్టంభన నెలకొనడంతో తాజా పరిణామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# వచ్చే వారం జిన్‌పింగ్ విదేశీ పర్యటన

## అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధమే నేపథ్యం!



**బీజింగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వచ్చే వారం విదేశీ పర్యటన చేయనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను విపరీతంగా పెంచడం ద్వారా వాణిజ్య యుద్ధం మొదలు పెట్టిన నేపథ్యంలో, జిన్‌పింగ్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈనెల 14 నుంచి 18 వరకు ఆయన వియత్నాం, మలేసియా, కంబోడియా దేశాల్లో పర్యటిస్తారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. చైనా ఎగుమతులపై అమెరికా 145 శాతం సుంకాలను విధించడం ద్వారా బీజింగ్‌తో వాణిజ్య యుద్ధాన్ని తీవ్రతరం చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు మొదలైన తర్వాత తన మొదటి విదేశీ పర్యటనలో మూడు ఆగ్నేయాసియా దేశాలను చైనా అధ్యక్షుడు సందర్శించనున్నారు. ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఏషియాన్) కూటమిలో ఈ మూడు దేశాలకు సభ్యత్వం ఉంది. ఈ సమూహంతో చైనా గత సంవత్సరం 962.28 బిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలు జరిపింది. చైనా మొత్తం ఎగుమతుల విలువ 575 బిలియన్ డాలర్లు. చైనా, దాని ఆసియా పొరుగు దేశాల మధ్య పోటీతత్వ వాణిజ్య స్వభావం ఉందని, ఇవన్నీ ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థలు కావడంతో కీలకంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా అత్యధిక మార్కెట్‌ను కలిగి ఉన్నందున, భవిష్యత్తులో తగ్గబోయే ఎగుమతులను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటి నుంచే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఇలావుంటే, చైనాపైనే అమెరికా ప్రధానంగా గురిపెట్టినట్టు స్పష్టమవుతున్నది. ప్రస్తుతం పెంచిన సుంకాలను ఇతర దేశాలకు వర్తింప చేయడంలో ఆచితూచి వ్యవహరిస్తున్న ట్రంప్, చైనా విషయంలో మాత్రం దూకుడుగా ముందుకెళుతున్నారు. చైనాపై విధించిన సుంకాలు అమల్లోకి రావడమే ఇందుకు నిదర్శనం.

**ట్రంప్ సుంకాలపై ప్రతీకారం తీర్చుకున్న ఏకైక దేశం చైనా:**

వియత్నాం, మలేషియా, కంబోడియా దేశాలు అమెరికా సుంకాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే ద్వైపాక్షిక వాణిజ్య సుంకాలను రూపొందించడానికి సమయం కోరాయి. ట్రంప్ సుంకాలు చైనాపై ఎక్కువగా ఉండటంతో, ఈ వారం ప్రారంభంలో జిన్‌పింగ్ పొరుగు దేశాలతో ఉన్న విభేదాలను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేగాక, సప్లయి చైన్‌ను పెంచడం ద్వారా పొరుగు దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి బాటలు వేస్తున్నారు. ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా సుంకాలను భారీగా పెంచిన తర్వాత జిన్‌పింగ్ తన మొదటి బహిరంగ ప్రసంగంలో, పొరుగు దేశాల భాగస్వామ్యంతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ దిశగా కొత్త నిర్ణయాలు, సరికొత్త వ్యూహాలు అవసరమని వ్యాఖ్యానించారు. అమెరికా వైఖరిని నిరసించాలని పొరుగు దేశాలతోపాటు, ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పొరుగు దేశాలకు సంబంధించిన వ్యవహారాలపై జరిగిన ఉన్నత స్థాయి కేంద్ర సమావేశంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళ, బుధవారాల్లో జరిగిన రెండు రోజుల సమావేశంలో పాలక కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమెరికాతో సంబంధాలు మరింతగా దెబ్బతిన్నందున చైనా తన పొరుగు దేశాల విధానాలను క్రమంగా పునఃరూపకల్పన చేస్తోంది. ఆ క్రమంలోనే, ఇటీవల భారతదేశంతో సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకుంది. జపాన్, దక్షిణ కొరియా వంటి ఇతర పొరుగు దేశాలతో తన సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించింది. తూర్పు లడఖ్ సైనిక ప్రతిష్టంభన కారణంగా నాలుగు సంవత్సరాలుగా స్తంభించిపోయిన భారత్–చైనా సంబంధాలు, గత అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని జిన్‌పింగ్ కలిసిన తర్వాత మెరుగుపడే సంకేతాలను కనిపించాయి. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా, జపాన్ దేశాలతో చైనా ఇటీవల వాణిజ్య చర్చలు నిర్వహించింది. ఐదు సంవత్సరాలలో ఈ మూడు దేశాల మధ్య ఆర్థిక చర్చలు జరగడం ఇదే మొదటిసారి.

### బీజింగ్‌తో స్పెయిన్ చర్చలు

స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ శుక్రవారం చైనా రాజధాని బీజింగ్ చేరుకున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను కలుసుకున్నారు. అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై జరిగిన సమావేశంలోపాల్గొన్నారు. సాంచెజ్ రాక సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ, అమెరికా వ్యవహారాన్ని దుయ్యబట్టారు. ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏకంకావాలని యూరోపియన్ యూనియన్ (ఇయు)కు పిలుపునిచ్చారు. స్వేచ్ఛా వాణిజ్యానికి ఇయుతో కలిసి చైనా అడుగులు వేస్తున్నదని, అయితే, అమెరికా ఒక్కసారిగా టారిఫ్‌లు పెంచడం వల్ల ప్రపంచ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలను ఆర్థికంగా దెబ్బతీయడమే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉద్దేశంగా కనిపిస్తున్నదని, అయితే, ఈ ప్రయత్నాలను సాగనివ్వబోమని అన్నారు. అమెరికా తీరును అన్ని దేశాలూ ఖండించాలని ఆయన కోరారు.

# గాజాలో నీటి కటకట

## ఖాళీ చేసి వెళ్లిన వారిపై కూడా వైమానిక దాడులు

గాజాపై ఇజ్రాయెల్ చర్యలు ప్రభావం భవిష్యత్తులో పాలస్తీనా బృందాల సహనశక్తిపై ప్రభావం చూపుతుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ రవీనా శందాసాని శుక్రవారం నాడు మాట్లాడుతూ 'గాజాలో మరణాలు, విధ్వంసం, స్థానచలనం, కనీస అవసరాల నిరాకరణతో పాటు, వారి స్వస్థలాల నుంచి వెళ్ళిపోవాలని పదే పదే సూచించడాన్ని ప్రస్తావించారు. గాజా పౌరులపై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడుల్లో అత్యధిక శాతం బాధితులు పిల్లలు, మహిళలేనని అన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 9 వరకు ఇజాయెల్ నివాస భవనాలు, టెంట్లపై 224 దాడులు నిర్వహించిందని పాత్రికేయులకు ఆమె తెలిపారు. సుమారు 36 దాడులకు సంబంధించి ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కార్యాలయంల సమాచారాన్ని సేకరించగా, బాధితులు మహిళలు, పిల్లలు మాత్రమే ఉన్నారని చెప్పారు. డెయిర్ –ఎల్–బలాహ్‌లో భవనంపై ఏప్రిల్ 6న జరిగిన దాడిలో ఒక పాప, నలుగురు మహిళలు, నాలుగేళ్ళ అబ్బాయి చనిపోయారని వివరించారు. పాలస్తీనావాసులను ఖాళీ చేసి వెళ్ళిపోవాలని సూచించిన ప్రాంతాలకు వెళ్ళిన వారిపై కూడా అక్కడ ఇజ్రాయెల్ దాడులు నిర్వహిస్తోందని ఆమె అన్నారు. గాజాలో జరుగుతున్న దాడుల కారణం అక్కడ ఏ ప్రదేశం సురక్షితం కాదన్నారు. ఉదాహరణకు ఖాన్ యూనిస్‌లో పౌరులను మావాసి ప్రాంతానికి వెళ్లమన్నారని, అక్కడ కూడా టెంట్లపై మార్చి 18 నుంచి చేసిన దాడులు చేశారని తెలిపారు. గత వారం రోజులుగా గాజా వాసులకు పరిశుద్ధ నీరు కూడా లభించడం లేదని, ఇజ్రాయెల్ దాడులు పెంచినప్పటి నుంచి నీటి సరఫరాను నిలిపివేశారని, గాజా నగరంలో దాహంతో ప్రజలు అల్లాడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత క్లిష్ట పరిస్థితులు ఏర్పడతాయని మునిసిపాలిటీ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 61,700 మంది హతమైనట్లు పాలస్తీనా అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## మార్కెట్ పతనంతో రిపబ్లికన్ నేతకు భారీ లబ్ధి



టారిఫ్ సంక్షోభం నడుమ ప్రధాన స్టాక్‌ల కొనుగోలు పరంపరలో రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మేర్జోరీ గ్రీన్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. డెల్, అమెజాన్, లులులెమన్ వంటి పెద్ద సంస్థలకు చెందిన షేర్‌లు 40 శాతానికి పడిపోయినప్పుడు ఆమె వాటిని భారీగా కొనుగోలు చేసినట్లు సిబిఎస్ న్యూస్ బైటపెట్టింది.టారిఫ్‌ల పె ంపు నిర్ణయానికి ట్రంప్ విరామం ప్రకటించిన వెంటనే మార్కెట్ కోలుకొన్న వెంటనే మార్జరీ గ్రీన్ భారీగా లబ్ధి పొందినట్లు ఆరోపణలు తలెత్తాయి. తన పెట్టుబడులన్నీ పారదర్శకంగా ఉన్నాయని ఆమె సమర్థించుకున్నారు.

## బిఆర్‌ఎస్ పార్టీదే (మొదటి పేజీ తరువాయి)

కెటిఆర్ నానా యాగి చేస్తున్నారన్నారు. హెచ్‌సియు భూములు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఆ భూములు ప్రస్తుతం ప్రభుత్వానికే చెందుతాయన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ ఆస్తుల విధ్వంసంపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయంలో తెలంగాణ వ్యాప్తంగా ఎన్ని ఎకరాలు డీఫారెస్ట్ చేశారని ప్రశ్నించారు. అత్యంత తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ప్రజా సొమ్మును కొల్లగొట్టిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బిఆర్‌ఎస్ అని విమర్శించారు. హెచ్‌సియు భూములపై పూటకో డ్రామా ఆడుతూ కెటిఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డ్రామారావు పేరును కెటిఆర్ సార్థకం చేసుకుంటున్నారని మహేష్‌కుమార్ అన్నారు.

**టిజిఐఐసి– కంపెనీతో రూ.10 వేల కోట్ల ఒప్పందం**

టిజిఐఐసితో కంపెనీ చేసుకున్న భూముల ఒప్పందం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన రూ.10 వేల కోట్లను రైతుల శ్రేయస్సు కోసం ఉపయోగించామని మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. అధికారికంగా ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీకి రూ.170 కోట్లు బదిలీ జరిగిందన్నారు. హెచ్‌సియు భూములను అప్పటి ఎన్‌డిఎ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, సిఎం చంద్రబాబు నాయుడు కలిసి ఐఎంజి భారత్ కంపెనీకి అప్పగిస్తే కోర్టులో కొట్లాడి వైఎస్‌ఆర్ రద్దు చేయించారని గుర్తు చేశారు. హెచ్‌సియు భూములపై కుట్రపూరితంగానే ఎఐ టెక్నాలజీతో నెమళ్ళు, జింకలు రోదిస్తున్నాయంటూ అవాస్తవాలు ప్రచారం చేశారని మహేష్‌కుమార్ ఆగ్రహ వ్యక్తం చేశారు. అసత్యాలు అవాస్తవాలు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయన్నారు. కెటిఆర్ అరెస్టును అడ్డుకుంటుంది ఎవరో అందరికీ తెలుసునన్నారు. కెటిఆర్ జైలుకు పోవడం ఖాయమన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో అరెస్టు అవుతానని కెటిఆర్‌కు తెలుసునన్నారు. హెచ్‌సియుకు చెందిన 134 ఎకరాలను కెసిఆర్ టిఎన్‌జిఒలకు ఇచ్చినప్పుడు కెటిఆర్‌కు యూనివర్సిటీల భూమి అని తెలియదా?, బిఆర్‌ఎస్ పాలనలో రియల్ ఎస్టేట్ కంపెనీల యాడ్స్ కంటే సర్కారీ భూముల అమ్మకాల ప్రకటనలే పేపర్లలో పెద్ద ఎత్తున కనిపించిన సంగతి మర్చిపోయారా, 48 గంటల్లో బిజెపి ఎంపి పేరు బయట పెడుతానని చెప్పిన కెటిఆర్ ఎందుకు వెనకడుగు వేశారని అని కెటిఆర్‌ను మహేష్‌కుమార్ ప్రశ్నించారు.

## నష్టపరిహారం (మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రుల బృందం పంట నష్టపోయిన రైతులను వివరాలను అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆనంతరం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఆకాల వర్షాలతో నష్టపోయిన పంట నష్టపోవటం దురదృష్టకరమన్నారు. గత మూడు రోజులుగా కురిసిన ఆకాల వర్షం,రాళ్ల వాన మూలంగా రైతన్నకు తీవ్రనష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి, కెబినేట్ నిర్ణయం తీసుకుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ పంట నష్ట వివరాలను పరిశీలించి వివరాలను అందచేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోనే ఎక్కువ పంట నష్టం జరిగిందని, తర్వాత సిరిసిల్లాలో జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24వేల ఎకరాల్లో నష్టం జరిగిందన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో 9300 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ప్రాథమికంగా అంచనా వేయటం జరిగిందన్నారు.వాటిలో 6400 ఎకరాల్లో వరి,1200 ఎకరాల్లో మామిడి, 1600 ఎకరాల్లో కూరగాయల పంట నష్టం జరిగిందనివ వ్యవసాయ ఉద్యానవన అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నారని, నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నర్సింహరెడ్డి, నెమలి సుభాష్, మీసం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కన డ్రైపోర్ట్ (మొదటి పేజీ తరువాయి)

ఎదురవుతున్న ఇబ్బందులపై సిఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఎఐ అంగీకరించడంలేదని అధికారులు సిఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూసేకరణ పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వివిధ జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సిఎం అన్నారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ముఖ్య ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

# అన్నాడిఎంకెతో బిజెపి పొత్తు..

## అమిత్‌షా ప్రకటన



**చెన్నై:** వచ్చే ఏడాది జరుగునున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు కీలక ప్రకటన చేశారు. తమిళనాడులో అన్నాడిఎంకె – బిజెపి కలిసి పోటీ చేయాలని ఇరుపార్టీల నేతలు నిర్ణయించినట్టు ఆన ప్రకటించారు. ఈ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్ర స్థాయిలో అన్నాడిఎంకె నేత ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వంలో పోటీ చేయనున్నట్టు చెప్పారు. అన్నాడిఎంకెతో ఎలాంటా షరతులు, డిమాండ్లు లేకుండానే పొత్తులు కుదుర్చుకున్నట్టు అమిత్‌షా చెప్పారు. అన్నాడిఎంకె అంతర్గత వ్యవహారాల్లో తాము జో క్యం చేసుకోమని, పొత్తుల వల్ల అటు ఎన్డీయేకు, అన్నాడిఎంకె కూడా లబ్ధి చేకూరనుందని తెలిపారు. నియోజకవర్గాల పునర్విజన, నీట్ అంశాలపై అడిగినప్పుడు, అన్నాడిఎంకెతో ఈ అంశాలపై చర్చిస్తామని, అవసరమైతే కనీస ఉమ్మడి ప్రోగ్రాం ఉంటుందని చె ప్పారు. డిఎంకె అవినీతి, శాంతిభద్రతల పరిస్థితి, దళిత మహిళలపై అకృత్యాలు వం టి అంశాలపై వచ్చే ఎన్నికల్లో ప్రజలు తీర్పునివ్వనున్నారని అమిత్‌షా అన్నారు. డిఎంకె హయాంలో రూ.39,000 కోట్ల లిక్కర్ స్కామ్, ఇసుక మైనింగ్ స్కామ్, ఎల్కాట్ స్కామ్, ట్రాన్‌పోర్ట్ స్కామ్, మనీ లాండరింగ్ స్కామ్‌లు చోటుచేసుకున్నాయని, తమిళనాడు ప్రజలకు డిఎంకె, ఉదయనిధి స్టాలిన్, స్టాలిన్ సమాధానమివ్వాలన్నారు. తమిళనాడు అసెం బ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం తథ్యమని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. చెన్నైలో జరిగి ఈ మీడియా సమావేశంలో బిజెపి నేత కె.అన్నామలై, అన్నాడిఎంకె నేత ఎడప్పాడి పళనిస్వామి పాల్గొన్నారు.

## నో పర్మిషన్

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.ఇప్పటికే ముఖ్య నాయకులు బహిరంగ సభ నిర్వహించే సభాస్థలాన్ని పరిశీలించారు. ఈనెల 27న సభ ఉండడంతో ముఖ్యనాయకులంతా జన సేకరణలో ఉండగా.. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ గులాబీ నేతలు సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు పోలీసుల నుంచి అనుమతి రాకపోవడంతో బీఆర్‌ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో సభ అనుమతిపై శుక్రవారం విచారణ చేపట్టింది. దీంతో సభకు అనుమతిపై పరిశీలిస్తున్నామని కోర్టుకు ప్రభుత్వ నాయవాది తెలిపారు. వారం రోజుల్లో వరంగల్ సభ అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సభ కోసం బీఆర్‌ఎస్ పెట్టుకున్న పర్మిషన్‌ను అనుమతించకపోవడం, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లే హైకోర్టులో పిటిషన్ వేసినట్లు బీఆర్‌ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 17వ తేదీ లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 21 కి వాయిదా వేసింది. అలాగే వరంగల్ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది

## ఆర్థిక మోసం

(మొదటి పేజీ తరువాయి)

సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్,సెబి,సెంట్రల్ విజిలెన్స్ కమిషన్,సిబిఐ లాంటి సంస్థలకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయబోతున్నామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం లాంటి త్రిడి మంత్రాను అమలుచేస్తోందని మండిపడ్డారు. టిజిఐఐసికి ఆ భూములపై యాజమాన్య హక్కు లేదని, అయినప్పటికీ తనది కాని భూమిని బ్రోకర్ కంపెనీ ద్వారా బ్యాంక్‌లో తాకట్టు పెట్టారని, ఈ మోసానికి టిజిఐఐసితో పాటు పరిశ్రమల శాఖ కార్యదర్శిని జైలులో పెట్టవచ్చన్నారు. ఎటువంటి వెరిఫికేషన్ చేయకుండానే, భూయాజమాన్య హక్కులను తెలుసుకోకుండానే ఐసిఐసిఐ బ్యాంకు రూ10వేల కోట్ల రుణాన్ని ఇచ్చిందని ఆరోపించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం కంచ గచ్చిబౌలి ప్రాంతంలో గజం విలువ రూ 26,900లు మాత్రమే నని, ఈ లెక్కల ప్రకారం 400 ఎకరాలకు రూ. 5,239. 84 లక్షలు అవుతుందని, కానీ రెవిన్యూ శాఖ మాత్రం ఈ భూమి విలువను రూ 30 వేల కోట్లు అని చెప్పుకున్నదని వివరించారు. ప్రభుత్వం, బ్రోకర్ సంస్థ ,ఐసిఐసిఐ బ్యాంకు కుమ్మక్కై ఆ భూమికి లేని విలువను ఉన్నట్టుగా చూపించి, రూ. 10వేల కోట్ల రుణాన్ని తీసుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆర్థిక మోసంతో ఐసిఐసిఐ బ్యాంకు విశ్వసనీయత దెబ్బతింటుందని, ఆ బ్యాంకు కుప్పకూలే అవకాశం ఉన్నదన్నారు. ఒక ఎకరా రూ 75 కోట్లు అని జూన్‌లో జిఒను జారీ చేశారని, ఐదు నెలల తర్వాత మళ్లీ ఇంకో సంస్థతో నవంబర్ 23న కొత్త వాల్యుయేషన్ తీసుకొచ్చి, ఎకర భూమి రూ. 52 కోట్లు మాత్రమేనని నివేదిక ఇచ్చినట్టు కెటిఆర్ వివరించారు. సెల్ డిడ్ కూడా లేని భూమికి ఐసిఐసిఐ బ్యాంకు ఎలా రుణం ఇచ్చిందని, ఇది మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో సిఎం రేవంత్ రెడ్డికి అండగా నిలబడిన బిజెపి ఎంపికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా త్వరలోనే ఆయాచిత లబ్ధి జరగబోతుందని కెటిఆర్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారం ప్రధాని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కి తెలియకుండానే జరిగిందని తాము భావిస్తున్నామని కెటిఆర్ అన్నారు. ఈ కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వంతో బిజెపి కుమ్మక్కయిందని భావించాల్సి ఉంటుందన్నారు. అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వం తీసుకున్న రూ.10వేల కోట్ల బాండ్లను ఆర్‌బిఐ వెంటనే రద్దు చేయాలని కెటిఆర్ కోరారు.

## అక్రమాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ఉండే విధంగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ కమిషనర్, ముఖ్యకార్యదర్శితో పాటు ఇతర అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఒకే విధంగా దర్శనం టికెట్లు, పార్కింగ్ టికెట్లు, ప్రసాదాల టికెట్లు ఉండే విధంగా చూడాలని సూచించారు. ఎవరు పడితే వారు నకిలీ టికెట్లు ముద్రించకుండా కొత్త విధానాలు రూపొందించాలని అధికారులను కోరారు. అయా జిల్లాల్లో ఉన్న ప్రముఖ దేవాలయాలకు దర్శనం టికెట్లు, పార్కింగ్ టికెట్, ప్రసాదాలు, హుండి, దేవాలయంలోని చిన్నచిన్న దుకాణాల నుంచి లీజు ఫీజు, కొబ్బరికాయల టెండర్లు ఇలా తదితర మార్గాల ద్వారా నిధులు వస్తుంటాయి. ఇలా వస్తున్న నిధులను చాకచక్యంగా కాజేసేందుకు అక్కడి అధికారులు, ప్రైయివేటు వ్యక్తులతో కుమ్మకై దోచుకుంటున్నారు. వీటికి చెక్‌పెట్టేందుకు కొండాసురేఖ ప్రత్నామాయ మార్గాలను సూచించాలని అధికారులను కోరారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో అమలులో ఉన్న దర్శనాలు, ప్రసాదాలు, పార్కింగ్ ఫీజులకు సంబంధించి టికెట్లు విధానంపై అధ్యాయనం చేసి నివేధిక ఇవ్వాలని కూడా సూచించారు. ఇక నుంచి దేవాలయాల్లో అక్రమాలకు తావులేకుండా అన్ని విధానాలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.ఇటీవల కొమురవెల్లి, బల్కంపేట, బాసర లాంటి ఆలయాల్లో ఇలాంటి బాగోతాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా నకిలీ టికెట్లు, వాడిన టికెట్లను మళ్లీ వాడడం లాంటి అక్రమాలు జరుగుతు న్నాయని గుర్తించిన దేవాదాయ శాఖ.. ఇకపై అన్ని రకాల టికెట్లను ఆన్లైన్లో విక్రయించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. సాధారణ, విఐపి దర్శనాలు, అభిషేకాలు, ఆర్జిత సేవలు, లడ్డూ, పులిహోరా లాంటి ప్రసాదాల విక్రయాలు, వేములవాడ లాంటి ఆలయాల్లో కోడె మొక్కులు తదితర సేవలన్నింటికీ టికెట్లను మాన్యువల్ గా ఇస్తుండడంతో అక్రమాలు జరుగుతున్నాయి.

**ఈ నెల 15న సమీక్ష సమావేశం..**

దేవాలయాల్లో జరుగుతున్న అక్రమాలను నివారించేందుకు ఈ నెల 15న ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు మంత్రి కొండా సురేఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం.ఈ సమావేశంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు విధివిధానలను రూపొందిస్తారని తెలిసింది.

**పక్కదారి పడుతున్న విఐపి టికెట్లు...**

ఆలయాలకు ప్రముఖులు వచ్చినపుడు వారికి ప్రత్యేకంగా టికెట్లను కేటాయిస్తారు. రద్దీని బట్టి రోజుకు 100 నుంచి 400 మంది విఐపిలకు దర్శనం కల్పిస్తారు. అయితే, ఈ టికెట్లకు ఎలాంటి రుసుము ఉండదు. కానీ, కొన్ని ప్రముఖ ఆలయాల్లో ఇఒలతోపాటు ఉద్యోగులు, సిబ్బంది టికెట్లను భక్తులకు విఐపి టికెట్లను వి క్రయిస్తున్నట్లు తెలిసింది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు భక్తులు క్యూలైన్లో నిల్చొని ఉండలేరు. కాబట్టి వారిని టార్గెట్ చేసి టికెట్లు విక్రయిస్తుంటారని సమాచారం.

## పనులు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌తో పాటు మూసీ రివర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం పండే డిజైన్లను ఎంచుకోవాలని సిఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌పై వివిధ చోట్ల ఐలాండ్‌లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. సింగపూర్ లోని 'గార్డెన్స్ బై ది బే'ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండే విధంగా ఈ మూడు ఐలాండ్‌లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డిపిఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పిపిపి మోడల్‌లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మీర్ అలం ట్యాంక్‌పై నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకుని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సిఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మీర్ అలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూపార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవెలప్‌మెంట్ ప్లాన్‌ను దృష్టిలో పెట్టుకుని జూపార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్ గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని సిఎం చెప్పారు.

## జూన్ 15 నుంచి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి వివరాలు ఈ నెల 15న https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయి. అదే రోజు నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. జనరల్‌లో 60 శాతంపైన, బిసిలకు 50 శాతంపైన, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు 40 శాతం దాటిన వారు ఉత్తీర్ణత సాధించినట్టు నిర్ధారించారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు (పేపర్ 1), 6వ తరగతినుంచి 8వ తరగతి వరకు (పేపర్2) పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా పేపర్ 1కు రూ.750, పేపర్ 2కు ఒక వెయ్యి రూపాయల పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. జులై 22వ తేదీన పరీక్ష ఫలితాలు వెల్లడికానున్నాయి. గుర్తింపు పొందిన ఎన్‌సిటిఇ, ఆర్‌సిఐ సంస్థలలో టీచర్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించిన, లాంగ్వేజ్ పండిత్ కోర్సు చేసిన వారు కూడా టెట్ పరీక్షకు అర్హులుగా పాఠశాల విద్యా శాఖ వెల్లడించింది. టెట్‌కు 20 శాతం వెయిటేజ్‌ను కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత జూన్, డిసెంబర్ మాసంలో రెండు సార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ జారీ చేసి, జనవరిలో పరీక్షలు నిర్వహించారు.

**టెట్ పరీక్ష షెడ్యూల్**

| | |
|---|---|
| నోటిఫికేషన్ | : ఏప్రిల్ 11 |
| నోటిఫికేషన్ డౌన్‌లోడ్స్ | : ఏప్రిల్ 15 నుంచి |
| ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు | : ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు |
| ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ | : ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు. |
| హెల్ప్ డెస్క్ సర్వీసెస్ (అన్ని పనిదినాలు) | : ఏప్రిల్ 15 నుంచి జులై 22వ తేదీ వరకు |
| హాల్‌టికెట్ల డౌన్‌లోడ్స్ | : జూన్ 9న |
| పరీక్షలు | : జూన్ 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు . |
| పరీక్ష సమయం | : (ఉదయం 9గంటల నుంచి ఉదయం 11:30గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు ) |
| పరీక్ష ఫలితాల వెల్లడి | : జులై 22వ తేదీ |



# జనరల్
STATE & REGIONAL NEWS

## అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన పూలే

### కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే అని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. బిసి రిజర్వేషన్ల సాధనకు పూలే ఆశయం ఆదర్శమన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో బిసి జన సమితి అధ్యక్షుడు జస్వంత్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. కోదండరామ్ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోదండరామ్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమన్నారు. టిజెఎస్ నాయకులు గోపగాని శంకర్‌రావు, పల్లె వినయ్‌కుమార్,నిజ్జేనరమేష్ ముదిరాజ్,ఎం.నరసయ్య, బట్టల రామచందర్, చంద్రగిరి సత్యనారాయణ,పుష్పలీల పాల్గొన్నారు.

# నెక్లెస్ రోడ్డులో జ్యోతిబాపూలే విగ్రహం

### జ్యోతిభా పూలే విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. సిఎంతో పాటు స్థలపరిశీలనకు హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, బిసి సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు స్థలం సర్వే చేసి పూర్తిస్థాయి ప్రణాళికలతో నివేదికను అందించాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

జ్యోతిబాపూలేకు పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఘనంగా నివాళ్లు అర్పించారు. జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ అంబర్‌పేటలోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు వి. హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రోహిన్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి అబ్బాస్, సీనియర్ నాయకుడు డి.జి నరసింహా రావు తదితరులు జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

**సామాజిక న్యాయానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే : డిప్యూటీ సిఎం**
సామాజిక న్యాయానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి డిప్యూటీ సిఎం పూలమాలాలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలోని అనేకమంది వెనుకబడిన వర్గాలు, ప్రధానంగా మహిళలకు సామాజికన్యాయం జరగాలని జ్యోతిబాపూలే పెద్ద ఎత్తున పోరాటం చేసి ఈ దేశంలో ఆ వర్గాలకు దశా దిశా నిర్దేశం చేశారని డిప్యూటీ సిఎం తెలిపారు. పూలే చూపిన మార్గంలో ప్రయాణిస్తూ వారి ఆశయాలు నెరవేర్చడం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రజా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సిడిఎస్ నిర్వాహకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సీనియర్ జర్నలిస్టు రామచంద్ర మూర్తి పూలేకు నివాళ్లు అర్పించారు.

**బిసి కమిషన్ కార్యాలయంలో పూలేకు ఘన నివాళి :** జ్యోతిబాపూలే జీవిత చరిత్ర నేటి తరానికి ఆదర్శప్రాయమని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కొనియాడారు. బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, అధికారులు మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు.

**సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త జ్యోతి-బాపూలే- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**
సమానత్వం కోస పోరాడిన భారతీయ సామాజిక తత్వవేత్త జ్యోతిబాపూలే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కొనియాడారు. పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. హైదరాబాదు సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్, ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాదు నగర కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు, నాయకులు కార్యకర్తలు పూలేకు నివాళులర్పించారు.



# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

### మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి ఆదేశం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని, అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సిఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి.ఎన్‌విఎస్.రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు సిఎంకు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గంకోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజిబిఎస్‌చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్‌పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బి నగర్‌హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో డిపిఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట వరకు పొడిగించాలని, అందుకు అవసరమయ్యే అంచనాలతో డిపిఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సిఎం సూచించారు. హెచ్‌ఎండిఏతో పాటు ఎఫ్‌ఎస్‌డిఎను (ఫ్యూచర్ సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీ) ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని సిఎం చెప్పారు.

## జగిత్యాలలో ఎసిబి దాడులు

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ రఘు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కలెక్టరెట్‌లోని ట్రెజరరీ ఆఫీసులో శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ట్రెజరీ ఆఫీసులో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రఘు 7వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి ఆఫీసర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఓ వ్యక్తికి ప్రభుత్వం నుంచి విడుదల చేసిన డబ్బులకు ప్రతిఫలంగా లంచం ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్ రఘు డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు నిత్యం వేధింపులకు గురి చేయడంతో ఏసీబీని ఆశ్రయించగా వారి సూచనల మేరకు రఘుకు డబ్బులు ఇస్తుండగా అధికారులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.

## సమాచార హక్కును కుదించే ప్రయత్నం: ఐజెయు

**హైదరాబాద్ :** సమాచార హక్కును పరిరక్షించే పేరుతో ప్రజల సమాచార హక్కును కుదించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) తీవ్ర ఆందోళన వ్యకం చేసింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి , సెక్రెటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్ము శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ (డిపిడిపి) చట్టం కింద సమాచార హక్కు (ఆర్‌టిఐ) చట్టానికి తీసుకువచ్చిన సవరణలు, ఆర్‌టిఐ చట్టాన్ని బలహీనపరుస్తాయని, తద్వారా ప్రజల సాధికారతను తగ్గిస్తాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ఆమోదం పొందిన డిపిడిపి చట్టం, నియమాలు నోటిఫై అయిన తర్వాత అమల్లోకి వస్తుంది. ఈ చట్టంలోని ఒక నిబంధన ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె) ను మార్చనుంది. ఆ నిబంధన ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడానికి అనుమతిస్తుంది. తాజాగా తీసుకువచ్చిన మార్పులతో నిబంధన దానిని కూడా అనుమతించదు. ఈ నిబంధనను ప్రభుత్వం తొలగించాలని కోరారు.

# గొప్ప సంస్కర్త జ్యోతిబాపూలే




### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** భారత దేశంలో సామాజిక సంస్కరణలు, విద్యా, వైద్యం, స్త్రీ సమానత్వం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన గొప్ప సంస్కర్త, గొప్ప ఉద్యమకారుడు మహాత్మ గాంధీ జ్యోతిబాపులే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహత్మగాంధీ జ్యోతిబాపూలే 19వ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారాలో తోటిమాలి కుటుంబంలో జన్మించారని, చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన ఆయన విద్యాభ్యాసంలోనే అనేక అడ్డంకులు ఎదుర్కొన్నారన్నారు. అదే విధంగా చిన్న వయస్సులోనే కుల వ్యవస్థలోని అసమానతలను గమనించారని, ఎప్పటికప్పుడు సమాజంలో జరుగుతున్న కలాధిపత్యంపైన నిరంతరం ప్రశ్నించేవారని, 1873లో సత్యశోధకు సమాజాన్ని ఏర్పాటు చేసి సత్యం సమానత్వం ఆధారంగా సామాజిక సంస్కరణలు చేపట్టారని, కుల వివక్ష మతచారాలు. అస్పృశ్యకతను వ్యతిరేకించేవారన్నారు. కుల వ్యవస్థపై పోరాటం చేస్తునే దళిత హక్కుల కోసం , అంటరానితనం వారి కోసం నిరంతరం ఉద్యమించేవారన్నారు. పూలే అడుగు జాడల్లో నేటి యువత నడుచకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ పూలే నవభారత నిర్మాణానికి నాంది పలికిన సామాజిక దార్శనికుడన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, నాయకులు బన్సిలాల్, పిట్ల మల్లేశం, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్, నాయకులు వేల్పుల ప్రసన్నకుమార్, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ బ్యాంక్‌లో సమస్యలను పరిష్కరించాలి

### హైదరాబాద్‌లో ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల ప్రదర్శన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇండియన్ బ్యాంక్‌లో సమస్యలను పరిష్కకరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు శుక్రవారం హైదరాబాద్ లిబర్టీ ప్లాజాలోని ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్స్ (ఎఫ్ఐబిఇయు) పిలుపు మేరకు హైదరాబాద్‌లోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఇండియన్ బ్యాంక్ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంక్‌లో ఉన్న సాధారణ ఖాళీలలో క్లరికల్ స్టాఫ్, సబ్ స్టాఫ్, స్వీపర్లు, డ్రైవర్లను తగినంతగా నియమించాలని, అలహాబాద్ బ్యాంక్‌ను ఇండియన్ బ్యాంక్‌లో విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌ఫర్ పాలసీని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేట్టాలని, బ్యాంకులో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు, బోనస్ చెల్లించాలని, బ్యాంకులో ఉన్న శాశ్వత ఖాళీలలో తాత్కాలిక ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగులను ఉద్దేశించి ఎఫ్ఐబిఇయు సెక్రటరీ జనరల్ ఇ.అరుణాచలం మాట్లాడుతూ 1997–2000 మధ్య కాలంలో బ్యాంక్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇండియన్ బ్యాంక్‌లో నియామకాలపై నిషేధం విధించారని, సిబ్బంది, అధికారుల సహకారంతో బ్యాంక్ వేగవంతమైన పురోగతిని సాధించిందని, గత రెండు దశాబ్దాలుగా అపారమైన లాభాలను కూడా ఆర్జించిందన్నారు. అయినప్పటికీ సబ్ స్టాఫ్, స్వీపర్ల నియామకం పూర్తిగా జరగలేదని, బ్యాంకు కొంత వరకు క్లరికల్ సిబ్బందిని నియమిస్తున్నప్పటికీ, శాఖలలో వృద్ధి, వ్యాపారం, పని ఒత్తిడితో పోలిస్తే ఇది సరిపోదన్నారు. ఇప్పటికీ అనేక శాఖలు తక్కువ సిబ్బందితో కొనసాగుతున్నాయన్నారు. సేవలు ఆలస్యం కావడం పట్ల కస్టమర్లు కౌంటర్ సిబ్బందిని దుర్భాషలాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలహాబాద్ బ్యాంక్‌ను ఇండియన్ బ్యాంక్‌లో విలీనం చేసి ఐదేళ్లు గడిచినా ఉద్యోగులకు అవార్డు కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌ఫర్ పాలసీపై సంతకం చేయడంలో యాజమాన్యం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. బ్యాంక్‌లో కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని కోరారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఇటీవల జరిగిన ఎఐబిఇఎ సమావేశంలో చర్చించామని, ఆ సమస్యలను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించిందని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎపి,టిఎస్) జనరల్ సెక్రటరీ పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ సమస్యలపై 54 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అన్ని శాఖల నుండి ఇండియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించామన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 19న అన్ని జోనల్, ఎఫ్‌జిఎం కార్యాలయాల ముందు ధర్నాను, 25వ తేదీన ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్ అధ్యక్షత వహించగా, యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ జి.నల్లప్ప రెడ్డి, మహిళా కౌన్సిల్ కన్వీనర్ జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## 'బిఎఎస్'కు నిధులను విడుదల చేయండి

### సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రారంభించిన 150 బెస్ట్ అవలేబల్ స్కూల్స్‌కు (బిఎఎస్) రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బిఎఎస్ పాఠశాలల్లో చదువుతున్న 25 వేల మంది పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు శుక్రవారం లేఖ రాశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ. 130 కోట్ల నిధులను కేటాయించామని, ఇందులో మొదటి విడత రూ.50కోట్ల నిధులు విడుదలయ్యాయని, రెండో విడత నిధులను విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో, నిధులు విడుదల చేయలేకపోయామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా రూ.80 కోట్లను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించిందని, 2024–25 విద్య సంవత్సరానికి సంబంధించిన నిధులను కూడా విడుదల చేయలేదని హరీశ్ రావు పేర్కొన్నారు.

## గ్రీస్ కార్మికుల సమ్మెకు సంఘీభావం

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రీస్ దేశ కార్మికుల వీరోచిత పోరాటం విజయవంతమైన సందర్భంగా కార్మికులకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అభినందనలు తెలిపారు. గ్రీస్ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగులు, ఎదుర్కొంటున్నట్టుగానే గ్రీస్ దేశంలో కూడా అలాంటి సమస్యలతో బాధపడుతూ గ్రీస్ దేశ కార్మికులు వీరోచితమైన సమ్మె చేయటం ఫలితంగా గ్రీస్ దేశంలో నౌకలు, విమానాలు, రైళ్ల స్తంభించాయని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు 24 గంటల నిరవధిక సమ్మెకు పిలుపునివ్వటం, సమ్మె విజయవంతం కావటాన్ని ఎఐటియుసి అభినందిస్తుందన్నారు. అధిక ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, గౌరవ ప్రదంగా జీవించేందుకు సముచితమైన వేతనాలను పెంచాలని, గ్రీస్ కార్మికులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారన్నారు. 24 గంటల సమ్మె చేశారంటే రోడ్లు, వాయుమార్గం, జల, రవాణాను కార్మికులంతా స్తంభింపచేయటాన్ని ఆయన అభినంధించారు. గ్రీసు కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

# 'స్కాలర్ షిప్ టెస్ట్ రద్దు చేయండి'




### శ్రీనిధి యూనివర్సిటీపై చర్యలు తీసుకోండి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుప్రీంకోర్టు, ఎఐసిటిఇ నిబంధనలకు విరుద్ధంగా రూ.20కోట్ల స్కాలర్ షిప్ టెస్ట్ అంటూ 'ఎస్‌యుసిఇటి 2025' పరీక్ష నిర్వహించనున్న శ్రీనిధి యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఆ పరీక్షను వెంటనే నిలిపివేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్)రాష్ట్ర సమితి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం, యంనంపేట్‌లోని శ్రీనిధి విశ్వవిద్యాలయం ఈ నెల 13న ఉదయం 10:30 నుండి 12:30 వరకు అదే క్యాంపస్‌లో రూ 20 కోట్ల స్కాలర్ షిప్ టెస్టు అంటూ పలు గ్రూపులకు పరీక్షలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ టెస్ట్ నిర్వహణ సుప్రీం కోర్టు తీర్పు 2005కు విరుద్ధమన్నారు.ఈ పరీక్షను రాసేందుకు ప్రతి విద్యార్థి నుండి వెయ్యి రూపాయలు పరీక్ష రుసుమును వసూలు చేశారన్నారు.టాలెంట్, స్కాలర్ షిప్ టెస్టుల పేరుతో జరిగే మోసాన్ని అందరూ ప్రశ్నించాలని చెప్పారు.ఈ నెల13వ తేదీన జరిగే టెస్టును ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

**శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం**
కాళేశ్వరం, మహాదేవ్‌పూర్ (ఎం), జయశంకర్ (జిల్లా)
ఇ–ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
ఆర్సీ. నం. 84/2025 : 11.04.2025
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాళేశ్వరం(వి), మహదేవ్‌పూర్ (ఎం), శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, సరస్వతి పుష్కరాలు 2025 కోసం 5 పనుల అభివృద్ధికి ఇ–ప్రొక్యూర్మెంట్ ద్వారా రూ.152.00 లక్షలకు టెండర్లు ఆహ్వానించబడ్డాయి. మరిన్ని వివరాల కోసం క్రింది https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి: బిడ్ డౌన్లోడ్ తేదీ: 12.04.2025. బిడ్ డౌన్లోడ్ ముగింపు తేదీ (సమర్పణ): 16.04.2025.
Sd/– కార్యనిర్వాహక అధికారి
9502825595
DIPR R.O. No: 316-PP/CL/ADVT/1/2025-26 Date:11.04.2025

**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)**
**నాగర్‌కర్నూల్ జిల్లా**
**ఫారం–7**
**(Declaration) రూఢీ ప్రకటన**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

గెజిట్ నెం. 16/2025 — తేది: 13.03.2025
ఫైల్ నెం. G2/1479/2024

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలములోని సుద్దకల్ గ్రామ పరిధినందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ.3.31 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ –64 (MJR-2) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.3.31 గుంటలు భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ –64 (MJR-2) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామం:సుద్దకల్ — మండలం: కల్వకుర్తి — జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ SD నెం. | పట్టా/ ఇనాం etc., | భూ వర్గీకరణ మెట్ట/ అరుతడి/ తరి | భూ సేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు పైవైన హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | ద | తూ | ప | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 89 | పట్టా | మెట్ట | 0.23 | రావుల నవీన్ కుమార్‌రెడ్డి తండ్రి సుధాకర్ రెడ్డి (0.03) రావుల రోహిత్ రెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి (0.03) రావుల రఘుమారెడ్డి తండ్రి లింగయ్య (0.02) పుట్ట నాగేంద్రమ్మ భర్త నర్సింహులు (0.05) ఎర్రవోలు రాంచంద్రయ్య తండ్రి బాలయ్య (0.10) గుండాల బాలయ్య తండ్రి జంగయ్య రావుల శేఖర్ రెడ్డి తండ్రి వెంకట్రెడ్డి గుండాల ఐచ్చయ్య తండ్రి జంగయ్య రావుల పద్మ భర్త సుధాకర్ రెడ్డి పుట్ట యాదయ్య తండ్రి రాములు బుర్రి రాంరెడ్డి తండ్రి జంగయ్య రావుల రఘుమారెడ్డి తండ్రి లింగయ్య గుండాల జంగమ్మ భర్త ఐక్కయ్య రావుల వేణుగోపాల్ రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి | 83 | 93 | 90 | 88 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 90 | పట్టా | మెట్ట | 1.17 | రఘులోలు శ్రీకాంత్ రెడ్డి తండ్రి రఘుమారెడ్డి (0.11) రావుల నవీన్ కుమార్ రెడ్డి తండ్రి సుధాకర్ రెడ్డి (0.08) రావుల వేణుగోపాల్ రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి (0.08) గుండాల మల్లయ్య తండ్రి జంగయ్య (0.07) ఉమాపురం బొందమ్మ భర్త జంగయ్య (0.11) ఎర్రవోలు బాలస్వామి తండ్రి జంగయ్య (0.12) ఉమాపురం లక్ష్మమ్మ భర్త వెంకటయ్య మహమ్మద్ అబేద్ తండ్రి అహ్మద్ గోరెంట్ల పవన్ తండ్రి కృష్ణయ్య రావుల రోహిత్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి | VB | 93 | 91 | 89 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 93 | పట్టా | మెట్ట | 1.31 | కుమ్మరి అంజనమ్మ భర్త వెంకటయ్య (0.10) చాకలి బాల్ లక్ష్మయ్య తండ్రి మదేలు (0.17) చాకలి లక్ష్మమ్మ భర్త బాలస్వామి (1.04) కుమ్మరి వెంకటయ్య తండ్రి నారాయణ సుర్య వెంకట్ రాములు తండ్రి బాలయ్య గుండాల రాములు తండ్రి బాలయ్య బాదాం గణేష్ తండ్రి విష్ణుమూర్తి చాకలి లింగయ్య తండ్రి లక్ష్మయ్య బుద్దారం మణెమ్మ భర్త కృష్ణయ్య | 90 | 103 | 92 | 95 | లేవు | లేవు | [illegible] | 0.17 |
| | మొత్తము 3.31 గుం. | | | | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/– స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే.), యూనిట్–I, MGLISP,నాగర్‌కర్నూల్
సం/– అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/– జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO.22/LA/PP/Advt/Pub/2025-26

ప్రజాపక్షం
శనివారం, ఏప్రిల్ 12

# కాంగ్రెస్ దీక్షాకంకణం

అహ్మదాబాద్‌లో రెండ్రోజులపాటు జరిగిన ఎఐసిసి సమావేశం ద్విముఖ కర్తవ్యాలను నిర్ణయించుకుంది. బిజెపి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మహా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయటం, 'న్యాయ–పథం' ద్వారా ''ఆశాభావం, ఆకాంక్షాపూరితం, సకారాత్మకతతో కూడిన భవిష్యత్''ను నిర్మించటం. రెండు, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టవంతం చేయటం. 2024 డిసెంబర్‌లో బెళగావిలో నిర్వహించిన సిడబ్ల్యుసి సమావేశం వర్తమాన సంవత్సరాన్ని (2025) సంస్థాగత సాధికారీకరణ సంవత్సరంగా ప్రకటించినందున సంస్థాగత నిర్మాణంపై ఈ సంవత్సరంలోనే చర్యలు తీసుకోవలసి ఉంది. కాంగ్రెస్‌కు ఒకప్పుడు వెన్నెముకగా ఉన్న షెడ్యూల్డు కులాలు, తెగలు, బలహీనవర్గాలు, ముస్లిం మైనారిటీలను, ముఖ్యంగా యువతను, మహిళలను సంస్థాగత బాధ్యతల్లోకి తీసుకువచ్చి నూతన నాయకత్వాన్ని తయారుచేయటం ధ్యేయంగా పార్టీ నేత రాహుల్‌గాంధీ ముందుకు సాగుతున్నారు. బిహార్‌లో ఈ ప్రయోగం చేశారు. జిల్లా స్థాయి నాయకత్వాల్లో 75 శాతాన్ని ఈ బడుగు బలహీనవర్గాలనుంచే నియమించారు. ఇటువంటి మార్పు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? పార్టీ అడుగంటినాకనా? దాదాపు అన్ని రాజకీయ పార్టీల్లో నాయకత్వం మారినా, కాంగ్రెస్ మాత్రం అత్యధిక రాష్ట్రాల్లో పాతతరం పట్టులోనే, అగ్రకులాలపట్టులోనే ఉంది. పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉన్నా వారు పదవులు వదలరు. వదిలించే ధైర్యం పార్టీ అధిష్టానవర్గానికి లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఎన్నికల పరాజయాలకు బాధ్యత వహించేందుకు నాయకులెవ్వరూ ముందుకు రాకపోవటంతో ఆగ్రహంతో, నిస్సహాయతతో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్షపదవి చేబట్టిన రెండేళ్లలోనే 2019 జులైలో రాజీనామా చేశారు. అయినా మకుటంలేని మహారాజులా దేశమంతా తిరుగుతూ, బిజెపి/ఆర్‌ఎస్ఎస్ భావజాలం, మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఒంటరి పోరాటం చేస్తున్నది ఆయనే. 'పప్పు' అని అవహేళన చేసిన బిజెపి అల్పబుద్ధులు ఇవాళ దెబ్బ కాచుకునే స్థితిలో ఉన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షనాయకునిగా ప్రభుత్వాన్ని నిలదీస్తూ తన రాజకీయ పరిణతిని చాటుకుంటున్నాడు. కాంగ్రెస్‌ను ఉద్ధరించగలిగింది పార్టీ సంస్థాగత నిర్మాణమే– ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాల్లో బిజెపితో ముఖాముఖీ పోటీలో నెగ్గుకు రాలేకపోవటం కాంగ్రెస్ పెద్ద బలహీనత. ఉత్తరాదిన పార్టీని పటిష్టం చేసే ఉద్దేశంతోనే రాహుల్ గాంధి రాయ్‌బరేలీనుంచి లోక్‌సభకు ఎన్నికై వాయినాడ్ వదులుకున్నారు. సోదరి ప్రియాంకాగాంధి ప్రస్తుతం వాయినాడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలోకి బడుగుబలహీన వర్గాలు, దళిత యువతను తీసుకురావటంపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

అహ్మదాబాద్‌లో సబర్మతీ తీరాన పలు దశాబ్దాల విరామం తర్వాత ఎఐసిసి నిర్వహించటమే విశేషం. ఎందుకంటే నాలుగు దశాబ్దాల నుండి బిజెపి గుజరాత్‌లో ఏలుబడి సాగిస్తూ ఆ రాష్ట్రాన్ని హిందుత్వ ప్రయోగశాలగామార్చింది. పైగా జాతిపిత మహాత్మాగాంధీ హంతకుల వారసులు దేశంలో విద్వేషం, హింసోన్మాదం వ్యాప్తిచేస్తూనే గాంధీ భజనచేస్తూ దేశ ప్రజల్ని మోసగిస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ఏ పాత్రలేని ఆర్‌ఎస్ఎస్–జనసంఘ్‌లు బిజెపి అవతారంలో ఆ ఉద్యమ వారసత్వం కోసం మోసపూరితంగా తపిస్తూ, జాతీయోద్యమ అగ్రనాయకుల్లో ఒకరైన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్‌ను తమ సొంతంగా ప్రచారం చేసుకుంటున్నారు. భారత రాజ్యాంగాన్ని దశాబ్దాలపాటు గుర్తించని, దానికి సొట్టలు పెట్టటానికి ఇప్పటికీ ప్రయత్నిస్తున్న ఆర్‌ఎస్ఎస్/బిజెపిలు రాజ్యాంగ నిర్మాత అయిన బి.ఆర్.అంబేద్కర్‌ను దళిత ఓట్లకోసం ఆరాధిస్తున్నారు. అయినా హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ఈర్ష్య వెళ్లగక్కారు. కాబట్టి జాతీయోద్యమం, దాని నాయకుల వారసత్వం కాంగ్రెస్‌దని స్పష్టం చేయటానికి అహ్మదాబాద్‌లో ఎఐసిసి జరిపారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా మహాత్మాగాంధీ ఎన్నికైన శతవార్షిక వత్సరం, సర్దార్ పటేల్ 150వ జన్మదినం పురస్కరించుకుని ఈ సభలు జరిపారు. మహాత్మాగాంధి, పటేల్ వారసత్వాన్ని తిరిగి పొందటానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ ''న్యాయ–పథ్'' తీర్మానాన్ని వివరిస్తూ, సర్దార్ పటేల్ చెప్పిన మాటలను గుర్తు చేసింది: ''ప్రజలు ఐక్యంగా నిలబడినపుడు, అత్యంత పీడక ప్రభుత్వం కూడా వారిని తట్టుకోలేదు''. దాంతోపాటు, 1948, డిసెంబర్ 18న ఎఐసిసి జైపూర్ మహాసభలో, ''భారతదేశాన్ని నిజమైన లౌకికరాజ్యంగా రూపొందించేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నిబద్ధమై ఉన్నాయి''అన్న పటేల్ ఉగ్గడింపును ప్రస్తావించింది. ఈ ఉట్టంకింపులు ఎవరిని ఉద్దేశించాయో వివరణ అవసరం లేదు.

జాతీయవాదం పేరుతో బిజెపి హిందూ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తున్నదని, కాంగ్రెస్ జాతీయవాదం తద్భిన్నంగా ప్రజలందర్నీ కలిసికట్టుగా ఉంచటాన్ని, భారత ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని అట్టడుగు తరగతుల హక్కుల రక్షణను కోరుకుంటున్నదని తీర్మానం పేర్కొన్నది. కులం, మతం, భాష, ఆహార్యం, ఆహారపు అలవాట్ల ప్రాతిపదికపై ప్రజల్ని విభజించే, దేశ లౌకిక, ఫెడరల్ స్వరూపాన్ని దెబ్బతీసే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రాజకీయరంగంలో, భావజాలరంగంలో నిరంతరం పోరాటం చేయాలని కాంగ్రెస్ తీర్మానం పార్టీ శ్రేణులను ఆదేశించింది.

అయితే తీర్మానాలకు తగిన కార్యాచరణను ప్రజలు ఆశిస్తారు. ఆ శక్తి, ఆసక్తి కాంగ్రెస్ పార్టీకి ఉందా? బిజెపితో ఢీ అంటే ఢీ అని సంఘర్షణను కొనసాగించగలదా? అందుకు తగినట్లు సంస్థాగత నిర్మాణాన్ని స్వల్పకాలంలో తీర్చిదిద్దుకోగలదా? అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న.

# వక్ఫ్ చట్టం : దాని పర్యవసానాలు



సయ్యద్ అజీజ్ పాషా
రాజ్యసభ మాజీ సభ్యులు
సిపిఐ జాతీయ కార్యదర్శి

తుదకు మోదీ ప్రభుత్వం తన దుష్ట ఆలోచనలకు అనుగుణంగా, టిడిపి, జెడి(యు), ఇతర మిత్రపక్షాల సహాయంతో పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు– 2024ను ఆమోదించింది. దానిపై భారత రాష్ట్రపతి వెంటనే సంతకం చేయడం ఊహించని విషయమేమి కాదు. ఈ చట్టం ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టానికి ముందు 1913, 1923, 1954, 1995 చట్టాలు ఉన్నాయి. ఈ చట్టం పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన నిర్వహణను కలిగి ఉందని తప్పుగా పేర్కొంది. ఇది పూర్తిగా తప్పు. తద్విరుద్ధంగా విలువైన దాతృత్వ, మానవతా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు. వక్ఫ్ శ్మశానవాటికలు, మసీదులు, పాఠశాలలు, మదరసాలు, ఆసుపత్రులు, ఇతర స్వచ్ఛంద సంస్థలను నిర్వహిస్తుంది. అన్ని మత సంస్థలకు ఆస్తులు, దాతృత్వ ఆస్తులు ఉన్నాయి. కానీ వక్ఫ్ ఆస్తులను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? కరుడుగట్టిన హిందుత్వ ఆలోచనలు ఉన్నవారు ముస్లింలను, వారి మతపరమైన ఆస్తులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా సమాజాన్ని విభజించి, హిందూ సమాజంపై తమ పట్టును బలోపేతం చేసుకోవచ్చని, తద్వారా తమకు సానుకూల ఫలితాలను పొందవచ్చని విశ్వసిస్తున్నారు. కానీ మెజారిటీ వర్గంలోని గణనీయమైన సంఖ్య వారి సంకుచిత మతపరమైన విధానాన్ని సమర్థించదు.

వారి అంచనాలు తప్పుతాయనేందుకు 2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే గొప్ప నిదర్శనం. ఎందుకంటే వారు 2019లో 37.3 శాతం ఓట్లు పొందగా, 2024 పార్లమెంటరీ ఎన్నికల్లో కేవలం 36.6 శాతం మాత్రమే సాధించారు. 400 పార్ (400లకుపైగా సీట్లు) అనే వారి స్వప్నం సాకారం లేదు. అందుకే ఎక్కువ మందిని ఆకర్షించాలనే ఆశతో వక్ఫ్ పేరుతో కొత్త అంశాన్ని తీసుకురావడం ద్వారా ఓట్ల ఏకీకరణ చేయాలని అనుకుంటున్నారు. కొత్త వక్ఫ్ చట్టం దేశంలోని అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేయబడింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా కూడా దాని చెల్లుబాటును, అందులోని రాజ్యాంగ విరుద్ధమైన నిబంధనలను సవాలు చేస్తూ పిటిషన్‌ను దాఖలు చేశారు. అంతేకాకుండా ప్రజలు తిరస్కరిస్తున్న వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 21న దేశవ్యాప్తంగా నిరసనలకు పార్టీ పిలుపునిచ్చింది.



బిజెపి సుదీర్ఘ కాల విరామం తర్వాత హఠాత్తుగా వక్ఫ్ అంశాన్ని చేపట్టడానికి, కొత్త చట్టం అమలు చేయడానికి గల కారణం ముంబైలోని వక్ఫ్ భూమిని అక్రమంగా ఆక్రమించిన అంబానీలను రక్షించడం కోసమే. వారు హైకోర్టులో ఓడిపోయే అవకాశం ఉంది. కాబట్టి వక్ఫ్ చట్టం –1995లోని ప్రాథమిక అంశాలను మార్చడానికి ప్రధాన ప్రేరణ అంబానీల కేసులో వారికి అనుచిత ప్రయోజనం చేకూర్చటమే. అంబానీకి సహాయం చేయడానికి మోదీ ప్రభుత్వం అమితాసక్తిగా ఉంది.

అయినప్పటికీ, ఈ చట్టంలో రాజ్యాంగంలోని 14, 15, 21, 25, 26, 300ఎ అధికరణలను ఉల్లంఘిస్తూ అనేక వ్యతిరేక నిబంధనలు ఉన్నాయి. వక్ఫ్ భూముల పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన నిర్వహణ అనే పేరుతో పార్లమెంటు లోపల, వెలుపల కిరణ్ రిజిజు పదే పదే పేర్కొన్నట్లుగా, కాకుండా వక్ఫ్ ఆస్తులను నాశనం చేయడమే దీని ఏకైక లక్ష్యం. ఇది అసంబద్ధం, తప్పు కూడా. మనం కొత్త చట్టాన్ని నిశితంగా పరిశీలిస్తే, అది అనేక గర్హనీయమైన చర్యలను ప్రవేశపెట్టింది. వాడకందారు ద్వారా వక్ఫ్ రద్దు, నిపుణులు ఆధ్వర్యంలో విశ్లేషించి, తుది తీర్పునిచ్చే వక్ఫ్ ట్రిబ్యునల్ రద్దు వంటివి కొన్ని. కంపెనీల చట్టం 2013, విద్యుత్ చట్టం 2003తో పోల్చి చూస్తే, అప్పీలేట్ ట్రిబ్యునళ్ళలో న్యాయ సభ్యులతో పాటు సాంకేతిక నిపుణులు కూడా ఉండాలి. ఇప్పుడు కొత్త చట్టం జిల్లా కలెక్టర్/మెజిస్ట్రేట్‌కు కేసును నిర్ణయించే అధికారాన్ని ఇవ్వడం అసంతృప్తిని కలిగిస్తుంది. వక్ఫ్ కౌన్సిళ్ళలో ఇద్దరు ముస్లిమేతరులను చేర్చడం, పురావస్తు శాఖ పరిధిలోకి వచ్చే వక్ఫ్ స్మారక చిహ్నాలను రద్దు చేసేందుకు డి,ఇ సెక్షన్‌లను తీసుకురావడం పూర్తిగా పక్షపాతపూరితం, అన్యాయం. వక్ఫ్‌లోని ఎక్కువ భాగాన్ని లాగేసుకోవడానికే చట్టం వక్ఫ్‌ను తొలగించింది.

చాలాకాలంగా వినియోగంలో ఉన్నందున వక్ఫ్ ఆస్తులుగా చేర్చబడిన అనేక శ్మశానవాటికలు, మసీదులు, దర్గాలు నిరాధారంగా రద్దు చేయబడ్డాయి. ప్రభుత్వం ఈ చట్టాన్ని వక్ఫ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన నిర్వహణను తీసుకురావడానికి ఉద్దేశించినట్లుగా చూపుతోంది. ఇది పూర్తిగా అబద్ధం, నిరాధారం. ఈ చట్టం వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నందున, రాజ్యాంగంలోని అనేక చట్టాలను ఉల్లంఘిస్తున్నందున, లౌకికవాద వర్గాలన్నీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి.

# హింస కంటే శాంతి చర్చలే మేలు



దామెర రాజేందర్

ఇప్పుడు హింస గురించి మాట్లాడుకోవాల్సిన సందర్భమిది. హింసను కట్టడి చేసే పేరుతో ప్రతిహింస జరుగుతున్న పరిస్థితుల్లో హింస, ప్రతిహింసల గురించి మాట్లాడుకోవాల్సిన సందర్భమిది. పిట్టల్లా రాలిపోతున్న మనుషుల శరీరాల గురించి మాట్లాడుకోవాలి. అటు మావోయిస్టులైన, ఇటు పోలీసు బలగాలైనా మనుషులే... వారివీ ప్రాణాలే కాబట్టి ఇక్కడ యుద్ధనీతి గురించి కూడా మాట్లాడుకోవాల్సిన సందర్భమిది. మల్లయుద్ధాల కాలంలో కూడా బానిస యజమానులు వారి బానిసలను బలశాలులను చేసి మల్లయుద్ధాన్ని పెట్టేవారు. అయితే ఇక్కడ యుద్ధ నీతి గురించి ఎందుకు మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందం టే మావోయిస్టులు దారితప్పిన పంథానే కావచ్చు, తమ మార్గం అనుసరణీయం కాకపోవచ్చు, కానీ వారు చేసే యుద్ధం ఇక మేం చేయలేం. తలపడలేం అని అంగీకరించినప్పుడు యుద్ధ నీతి పాటించాల్సిన అవసరం మాత్రం రాజ్యం (పాలకులకు) పై ఉంది. ఆపరేషన్ 'కగార్' పేరుతో జరుగుతున్న మావోయిస్టుల ఏరివేత చాలా స్పీడ్ గా సాగుతోంది. మావోయిస్టులు మనుషులే కాదన్నట్లుగా ఒకరకంగా శత్రుదేశం అన్నట్లుగా మధ్య భారతంలో సైనిక బలగాలతో ఆపరేషన్ కగార్ చేపట్టారు. ఈ ఆపరేషన్ కగార్ తో భద్రతా బలగాలు 2024లో 194 మంది మావోయిస్టులను అంతమొందించగా, 801 మందిని అరెస్టు చేశారు. 742 మంది లొంగిపోయారు. ఇక 2025లో ఈ రెండు మూడు నెలల్లో సుమారు 103 మంది మావో యిస్టులు చత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలో వివిధ ఎన్ కౌంటర్లో హతులయ్యారు. ప్రధాన మంత్రి ఛత్తీస్ గఢ్ పర్యటనకు కేవలం కొద్ది గంటలకు ముందు బీజాపూర్ లో 50 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇక తాజాగా భారీ స్థాయిలో 86మంది ఛత్తీస్గఢ్ నుంచి మావోయిస్టు సభ్యులు లొంగిపోవడం గమనార్హమే. ఇక పదుల సంఖ్యలో వరుస లొంగుబాట్ల ప్రకటనలు చూస్తూనే ఉన్నాం. ఇవి భవిష్యత్తులోనూ ఇంకా పెరిగే అవకాశం లేకపోలేదు. మావోయిస్టులు కీలకమైన నేతలను కూడా కోల్పోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధపడి ఇటీవల ఓ లేఖను విడుదల చేశారు.

కారణాలు ఏవైనా కావచ్చు కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరుతో విడుదలైన లేఖలో పేర్కొన్నారు. తక్షణ కాల్పుల విరమణతో పాటు శాంతి చర్చలకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. మధ్య భారతంలో సాగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని కోరింది. బేషరతుగా కాల్పుల విరమణ చేసి శాంతి చర్చలు జరిగేలా శాంతిచర్చల కమిటీ, మేధావులు, పౌర సమాజం చొరవ చూపి అలాంటి వాతావరణం కల్పిస్తే తాము సిద్ధంగా ఉన్నట్లు ఆ లేఖ సారాంశంగా ఉంది.



చర్చల పట్ల తమ వైఖరిని ఆ లేఖలో పేర్కొన్నారు. భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ 'కగార్' ను ప్రారంభించడం, ఈ ఆపరేషన్ ఫలితంగా పెద్ద ఎత్తున హత్యలు, సామూహిక అరెస్టులు, ప్రమాదాలు, మనవ హక్కుల ఉల్లంఘన జరిగిందని, 400 మందికి పైగా మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు గిరిజన పౌరులు మరణించినట్లుగా ఆ లేఖ సారాంశంగా మావోయిస్టు పార్టీ పేర్కొంది. మహిళా మావోయిస్టులు విస్తృతమైన లైంగిక హింసను ఎదుర్కొన్నట్లు, అనేక మంది పౌరులను అరెస్టు చేసి చట్ట విరుద్ధంగా నిర్బంధించి హింసించారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాంతి చర్చలకు ముందు మావోయిస్టు ప్రభావిత గిరిజన ప్రాంతాల నుండి భద్రతా దళాలను వెంటనే ఉపహరించుకోవాలని కోరారు. సైనిక మోహరింపులకు ముగింపు పలకాలన్నారు. పౌర ప్రాంతాల్లో సైనిక బల ప్రయోగం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అయితే ఆ లేఖలో వివిధ అంశాలను ప్రస్తావించడం ఒక అంశమైతే అంతిమంగా హింసను ఆపాలని శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ ఒక మెట్టు దిగడం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనిని స్వీకరించాలాలి. ఆహ్వానించాలి. ఎందుకంటే హింస కంటే శాంతి చర్చలే మేలు కాబట్టి. అంతే కాదు చంపడం వల్లనో, లొంగుబాట్ల వల్లనో ఒక వాదం లేదా ఒక సిద్ధాంత భావజాలం పూర్తిగా అంతం కాదనేది కాదనలేని సత్యం.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా గెరిల్లా పోరాటాల పరిణామాలు అవగాహనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడ మావోయిస్టు పార్టీ మారుతున్న పరిణామాలకనుగుణంగా వ్యూహా లు, ఎత్తుగడలను మార్చుకుని, తమ సిద్ధాంతం ఇప్పుడు ఈ దేశంలో అంతగా అప్లై చేయడానికి పరిస్థితులు అనువుగా లేవనే వాస్తవాన్ని గ్రహించి గెరిల్లా యుద్ధానికి బదులు రాజకీయ పోరాటానికి సంసిద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మావోయిస్టులు నమ్ముతున్న విప్లవ నమూనాను పట్టుకొని మావోయిస్టులు తమంతట తాము భారతదేశ కార్మిక వర్గాల నుంచి, అభ్యుదయ మేధావుల నుంచి, చివరకు వారి హింసాత్మక పద్ధతులను తిరస్కరించే సానుభూతిపరులైన కార్యకర్తలనుంచీ దూరమయ్యారనే వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదు.

అందుకోసమే ప్రధాన స్రవంతి కమ్యూనిస్టు ఉద్యమంలో కలవాల్సిన అవసరాన్ని మావోయిస్టులు గుర్తించాలి. మావోయిస్టులకు తమ మార్గం మార్చుకోవడం లొంగుబాటు ఏమాత్రం కాదు అనేది కూడా గ్రహించాలి.

ప్రజల సమీకరణ, ఎన్నికల్లో పాల్గొనడం, తమ విధానాలను, సమాజాన్ని కాంక్షించే ఆలోచనల ప్రచారంలోనే రాజకీయ పంథా మనుగడలో ఉంటుందని మావోయిస్టులు గుర్తించాలి. అంతే తప్ప రాజ్య హింసను, ప్రజలలో నిరాశ నిస్పృహలను, లేదా మావోయిస్టుల పేరును ఆసరా చేసుకొని సామాన్య పౌరులను, మేధావులను, జర్నలిస్టులను, న్యాయవాదులను, ప్రజాసంఘాల ప్రతినిధులను, ఏమాత్రం అభ్యుదయంగా ఆలోచించే వారిని అర్బన్ నక్సలైట్ల పేరుతో కట్టడి చేసేందుకు అవకాశం కల్పించడానికి కారణం కాకూడదు. ఇది కూడా ప్రజాస్వామ్యంలో మానసిక హింసగానే చూడక తప్పదు. ఇలాంటి ప్రత్యక్ష, పరోక్ష మానసిక హింస జరుగుతున్న నేపథ్యంలో భారతదేశంలో, కనీసం ప్రస్తుత పరిస్థితులలో గెరిల్లా యుద్ధం కాకుండా రాజకీయ పోరాటమే వామపక్షాలకు అనువైన మార్గమని ఇప్పటికే చరిత్ర చెప్తున్న వాస్తవం. ఈ తరుణంలో శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధపడటం ఆహ్వానించదగినదే. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించి ఒక మెట్టు దిగడానికి సిద్ధంగా ఉన్న మావోయిస్టుల పట్ల పాలకులు కూడా యుద్ధ నీతిని పాటించాల్సిన అవసరం ఉంది. హింసకు బదులు శాంతి చర్చలకు పాలకులే అనుకూల పరిస్థితులు కల్పించాలి.

rajenderdamera@gmail.com

# మాతృత్వం మహిళలకు గొప్పవరం

ఆడ జన్మకు సార్థకత అమ్మతనం. కళ్లముందు నడిచే దైవం అమ్మ. అమ్మ కావడం స్త్రీకి తక్కిన అపురూప వరం. అత్యంత శక్తివంతమైన మాతృత్వం ఓ పరమ పవిత్ర కార్యం. ప్రాణాపాయం ఉంటుందని తెలిసి కూడా అమ్మతనమనే పేరును తెచ్చుకోవడానికి తాను గర్భిణిగా నవమాసాలు బిడ్డను మోసి, ప్రసవ వేదనను సంతోషంగా భరించి, కేరు కేరను ఏడ్చే నవజాత శిశువు స్వరాన్ని వింటూ నొప్పులను మరిచి మురిసి పోతుంది అమ్మ అయిన అతివ.

**2025 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తం:**

గర్భిణిగా, ప్రసవంలో, ప్రసవానంతరం కూడా తల్లికి సురక్షిత ఆరోగ్యాన్ని అందించడం మన కనీస బాధ్యత అని గమనించిన వైట్ రిబ్బన్ అలియెన్స్ సంస్థ చొరవతో ప్రతి ఏట 11 ఏప్రిల్ రోజున భారత దేశవ్యాప్తంగా జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం (నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డే) నిర్వహించడం 2003 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రేమ, త్యాగం, అవధులు లేని ధైర్యం అనే విలువలను ఇంధనాలుగా మలిచి మహిళ మాతృత్వాన్ని అనుభవిస్తుంది. మహాత్మగాంధీ సతీమణి కస్తూర్బ గాంధీ జన్మదినం 11 ఏప్రిల్‌ను పురస్కరించుకొని జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం పాటించుట జరుగుతున్నది. 2025 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తంగా మాతృ సంబంధ ఆరోగ్య సురక్ష సమానత్వం : ఏ తల్లిని వదల వద్దు అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రపంచ దేశాల్లో భారతీయ మహిళలు లేదా తల్లులు ప్రమాదకర వాతావరణాల్లో జీవితాలను గడుపుతున్నారని, ప్రపంచ గర్భిణి మహిళల మరణాల్లో 15 శాతం వరకు భారత్‌లోనే జరుగుతున్నట్లు తేలడం విచారకరం. సాలీనా 44,000 మంది మహిళలు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం సరైన వైద్య సేవలు అందని కారణంగా మరణిస్తున్నట్లు తెలుస్తున్నది. మన దేశ గర్భిణులు, ప్రసవ సమయంలో లేదా ప్రసవం తర్వాత తల్లులు 12 శాతం వరకు మరణిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్త తల్లుల మరణాలు 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరగడం గమనార్హం. 1990 నుంచి 2015 వరకు 44 శాతం తల్లుల మరణాలు తగ్గడం, 2016 నుంచి 2030 వరకు ఒక లక్ష తల్లుల్లో 70 కన్న తక్కువ మరణాలు నమోదు అయ్యే విధంగా పలు కటుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. గ్రామీణ, పేద వర్గాలకు చెందిన మహిళలు అధికంగా ప్రమాదకర వాతావరణాల్లో బతుకులు ఈడ్చడం జరుగుతున్నది.

**మాతాశిశు సంక్షేమం ప్రభుత్వాల కనీస బాధ్యత :**

గర్భిణులు, ప్రసవ సమయం, ప్రసవానంతరం తల్లి, బిడ్డ సురక్షకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఈ విధులకు సుశిక్షితులైన వైద్య సిబ్బందిని నియమించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. మాతాశిశు సంక్షేమమే రేపటి ఆరోగ్యవంతమైన పౌర సమాజ స్థాపనకు పునాదులుగా తీసుకోవాలి. అమ్మతనం అమృత భావం. శిశువుకు తెలిసిన తొలి దైవం కన్న తల్లి మాత్రమే. ఇంట్లో కొలువైన ప్రేమ మూర్తి అమ్మ మాత్రమే. మాతృత్వం కోసం పరితపించే మహిళ నుంచి ప్రసవానంతర తల్లి వరకు అన్ని దశల్లో మాతృశిశు ఆరోగ్యాన్ని బలపరచడం మన కనీస బాధ్యత.

అమ్మతనం పట్ల అవగాహన, తల్లులు లేదా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రసవ సమయ సవాళ్లను అధిగమించడం, సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చర్యలు తీసుకోవడం లాంటి అంశాలే కేంద్రంగా జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం కొనసాగాలి. అమ్మ లేని తనువు లేదు. అమ్మ ప్రేమకు తత్సమాన బంధం లేదు. అమ్మ ద్వేషించే బిడ్డ ఉండడు. తల్లిపాలు రుచి చూడని తనువు లేదు. అమ్మను ప్రసవ సమయంలో కోల్పోయిన బిడ్డలంత దురదృష్టవంతులు లేరు. అమ్మ మనసు వెన్నంత మృదువు. అమ్మ ప్రేమ కలుషితం కాని అనుభవం. మాతృత్వానికి తలవంచి, అమ్మకు పాదాభివందనం చేసి, నేటి భార్యను రేపటి తల్లిగా భావించి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మాతాశిశు సంక్షేమానికి గొడుగు పడదాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

# ఛిద్రమవుతున్న మధ్య తరగతి ప్రజలు



డా.జి.వెన్నెల గద్దర్,
8374057569

లోకం ఎట్లుంది సిద్దా అంటే ఎవడి లోకం వాడిదన్నట్లు, ఒకవైపు అమెరికా ఓపెన్ ఏఐ, గ్రోక్ ఎక్స్ పేరుతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చాట్ బోట్ తయారు చేస్తే దాని తలదన్నే విధంగా చైనా డీప్ సీక్ ఆర్ పేరుతో మరో ఆవిష్కరణ చేసి కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామిగా చేరింది. 'పెట్టుబడి' బెంగ పట్టుకుని, తన అస్థిత్వాన్ని కోల్పోకుండా చేసే యత్నంలో అమెరికా రోడ్డెక్కింది. ట్రంప్ పెంచిన సుంకం కంపుతో ప్రపంచమంతా గబ్బు పట్టింది. ఈ వాణిజ్య యుద్ధంలో సకల దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలు. కార్పొరేట్ శక్తులు బక్కచిక్కిన వైనం, ప్రపంచంలో సామాన్య ప్రజానీకం కొనుగోలు శక్తిని పెంచకుండా కార్పొరేట్ పెట్టుబడి మనుగడ అసాధ్యం. ఏప్రిల్ 7న భారత స్టాక్ మార్కెట్ గణనీయమైన నష్టాలను చవిచూసింది, భారత షేర్ మార్కెట్ పతనం అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పరస్పర సుంకాల వల్ల ఏర్పడిన ప్రపంచ వాణిజ్య యుద్ధం ప్రభావం నుంచి పెరుగుతున్న భయాల మధ్య ప్రధాన ప్రపంచ మార్కెట్లో కనిపించే ధోరణులకు ప్రతిబింబం. చైనా నుంచి వచ్చే వస్తువులపై సుంకాలు మరీమరీ పెంచి చివరికి 124 శాతం మోతతో ట్రంప్ ధోరణితో విస్తుపోయిన చైనా అమెరికా వస్తువులపై 84 శాతం సుంకం పెంచింది. అమెరికా అహంకారంతో వ్యవహరిస్తూ ఇతర దేశాలపై పిచ్చి కుక్కలా ప్రవర్తిస్తుంది. గత నెలలో అక్రమ వలసదారులకు కాళ్ళు చేతులు కట్టిపడేసి యుద్ధ విమానాల్లో తరలించి ట్రంప్ తన వికృత స్వభావాన్ని చాటుకున్నాడు. గ్రీన్ కార్డు ఉంటే శాశ్వత నివాసానికి యోగ్యత ఉండదని తేల్చిచెప్పారు. గోల్ కార్డు ప్రవేశపెట్టాడు, అక్రమ వలసదారులు ఉంటే ప్రతిరోజూ 86 వేలు కట్టాలని హుకుం జారీ చేశారు. రాష్ డ్రైవింగ్ చేస్తే వీసా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు, అక్రమ వలసదారులు ఉంటే వారి ఆస్తులు అటాచ్ చేస్తున్నారు. యుఎస్ లోని సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ చదువుతున్న ఎంఎస్, బిఎస్ విద్యార్థులు తమ చదువులు ముగిసిన తర్వాత దేశం విడిచి వెళ్లాలి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వర్క్ ఆథరైజేషన్‌ను తొలగించడానికి కాంగ్రెస్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. ఇంతకుముందు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ గ్రాడ్యుయేషన్ తర్వాత మూడు సంవత్సరాల వరకు యుఎస్‌లో ఉండి ఉద్యోగం వెతుక్కోవడానికి వీలు ఉంది. దీనివల్ల అమెరికాలో విద్య అభ్యసిస్తున్న మూడున్నర లక్షల విద్యార్థుల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలో ఉంది.

అమెరికా సుంకానికి ఆంధ్ర రొయ్యలు ఢమాల్ అయ్యాయి. గత ఇరవై సంవత్సరాలుగా ఆంధ్ర రొయ్యలు 95 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. స్థానికంగా వినియోగం అంతంత మాత్రమే. తగినన్ని స్టోరేజ్ యూనిట్లు లేక నిల్వ సౌకర్యం లేక చివరికి క్రాప్ హాలిడే ప్రకటించునేంతవరకు వెళ్లారు. భారత్‌లో సందట్లో సడేమియా అంటూ పెట్రోల్, డీజిల్ పై రెండు రూపాయలు, గ్యాస్ సిలిండర్ పై యాభై రూపాయలు బాదుడు ప్రకటించింది కేంద్రం. దీన్ని దృష్టి మరల్చేందుకు స్థానిక శిష్యగణం శ్రీరామ్ శోభాయాత్ర, హనుమాన్ శోభాయాత్ర పేరుతో వాహనాలకు సైలెన్సర్ తీసి కాలుష్యాన్ని వెదజల్లుతూ, డీజేలతో శబ్ద కాలుష్యాన్ని పెంచు తూ తరిస్తున్నారు. గతంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో శ్రీరాముడు ఫొటోతో ఎద్దుల బండి పై ఊరేగించి వడపప్పు పానకం ఇచ్చేవారు. ఉట్లమాను ఏర్పాటు చేసి అందరూ సందడిగా వేడుక చేసుకునే వారు. అది పోయి డిమాండ్ లేని నాయకులు తలకు కషాయం పాగా కట్టుకొని హిందూ ఐక్యత ర్యాలీ పేరుతో ఫ్లెక్సీలు కట్టి, అర్థంపర్థం లేని నినాదాలు చేస్తూ గట్టిగా అరుస్తూ చర్చి, మసీదు దగ్గర ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారు. వీళ్ళ చేష్టలతో పరమత సహనం సామాజిక సమగ్రత మంట కలిశాయి.

చాలా పెద్ద స్కూళ్లలో ఎక్కువ డబ్బు కట్టి చేర్పిస్తే విద్య తొందరగా వంట పడుతుంది అనుకుంటే వొట్టి భ్రమే. పిల్లల అలవాట్ల స్థిరీకరణ ఐదేళ్ల వరకు ఉండదు. రెండు మూడు సంవత్సరాలు నిండని పిల్లలు, వాళ్ళు చేసే అల్లరి భరించలేక వారిని క్రెచ్, ప్లే స్కూల్, కిండర్ గార్డెన్‌లో వేయడం జరుగుతుంది. అది వాళ్ళల్లో ఉన్న సృజనాత్మకత దెబ్బతీసినట్లే. చదువు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేగా ఉండాలి. విద్య అంతిమ లక్ష్యం ఉపాధి కాకూడదు. కొడంగల్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసించిన తెలంగాణ ముఖ్యమంత్రి విద్య కమిషన్ ఏర్పాటు చేసి విద్యారంగంలో నిష్ణాతులైన వారిని నియమించి స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేసి, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 550 కోట్లు కేటాయించి తెలంగాణాలో విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు. బెట్టింగ్ భూతాన్ని పీచమణచడానికి ఇప్పటికే అగ్రతారలపై కేసులు బనాయించారు, పేట్రేగిపోతున్న హింస, అనైతికత అశ్లీలతకు డ్రగ్ మాదకద్రవ్యాల సంస్కృతికి కఠిన చర్యలు తెలంగాణ ప్రభుత్వం చేపడుతుంది.

విశ్వవిద్యాలయాలకు అద్భుతాలు సృష్టించే శక్తి ఉంది, విద్యారంగంలో అత్యంత కీలకం తరగతి బోధనేనని ఉపకులపతులు గ్రహించాలి. విద్యార్థులపై తరగతి బోధన విధానం తీవ్ర ప్రభావం చూపుతుంది, అధ్యాపకులు సైతం విద్యార్థులను ప్రభావితం చేసే విధంగా బోధన విధానాలు, సామర్థ్యాలు ఉన్నతీకరించుకోవాలి. నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వవిద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37శాతం, 43శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. నూతన విద్యా విధానంతో సమాన విద్యావకాశాలు దెబ్బతిన్నాయి. పిల్లల్లో అంతరాలు పెరిగిపోయాయి. నాణ్యమైన విద్యను అందించడంలో విద్యా ప్రణాళిక కీలకమైన భాగం. లక్ష్యాలు నిర్దేశించడం, వనరులను నిర్ణయించడం, కాలక్రమాన్ని రూపొందించడం, ప్రణాళికను అమలు చేయడం ద్వారా, విద్యార్థులు సాధ్యమైనంత ఉత్తమమైన విద్యను పొందుతారు. ఆ ప్రణాళిక రూపొందించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. గత పది సంవత్సరాలుగా కార్పొరేట్ విద్య తో విద్య వ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఏడో తరగతి పాఠాలు ఆరో తరగతిలో బోధించడం, పదో తరగతి పాఠాలు తొమ్మిదో తరగతిలోనే బోధించడం. కేవలం విద్యార్థులను పందెం కోళ్ళల్లా పెంచుతున్నా రు. చదువంటే కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ అనే ధోరణి పెరిగిపోయి సామాజిక శాస్త్రా లు పాతరేశారు. నీట్, జెఇఇ, ఎంసెట్, ఐఐటి, ట్రిపుల్ ఐటీ కోచింగ్ ఇవ్వని స్కూల్ స్కూలే కాదు అన్న రీతిన తల్లి దండ్రులు ఉన్నారు. ఎప్పుడుపడితే అప్పుడు సెలవు లేకుండా బోధించే కళాశాలల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. కార్పొరేట్ విద్యను ఉక్కుపాదంతో అణచకపోతే రాబోయే అనర్థాలకు సమాజం మూల్యం చెల్లించుకోక తప్పదు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉద్యోగం వద్దు...నగదు ఇవ్వండి: ఫొగట్



**చండీగఢ్:** ప్రముఖ భారత రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫొగట్‌కి హర్యా నా ప్రభుత్వం రెండు ప్రతిపాదనలు చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె ప్రద ర్శనకు గౌరవ సూచికగా గ్రూప్‌ఎ ప్రభుత్వ ఉద్యోగం కానీ, నగదు బహు మతి కానీ, నివాస స్థలం వంటివి ఇస్తామని తెలిపింది. అయితే వినేశ్ ఫొగట్ ప్రభుత్వ ఉద్యోగం వద్దని, నాలుగు కోట్ల రూపాయల నగదు బహుమతి కావాలని తెలిపారు. ఈ రివార్డులను హర్యానా షెహ్రీ వికాస్ ప్రాధికార్ కింద వినేశ్‌కి అందించనున్నారు. హర్యానా క్రీడా విధానం ప్రకారం టాప్ అథ్లె ట్లకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి పదవి ఇవ్వనుంది. కాగా, రాష్ట్ర క్రీడా విధానం ప్రకారం ఒలింపిక్ రజత పతక విజేతకు సమానమైన 30 ఏళ్ల ప్రయోజనాలను వినేశ్ ఫొగట్‌కి అందించాలని హర్యానా మంత్రివర్గం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సిఎం ప్రకటనతో వినేశ్ ఫొగట్ నగదు బహుమతి అందుకోవాలన్న తన నిర్ణయాన్ని క్రీడా విభాగానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వినేశ్ ఫొగట్ పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు.2024 హర్యానా ఎన్నికల్లో ఆమె జులానా నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.



## బిహార్ సర్కార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన ర్యాలీ

**పాట్నా:** బీహార్‌లో ఎన్డీఏ సర్కారుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ... 'పలాయన్ రోకో, నౌకరీ దో' పాదయాత్ర నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వారి పాదయాత్ర బీహార్ రాజధాని పట్నాలోని సీఎం నివాసానికి చేరుకోగానే కొందరు నిరసనకారులు ఆ నివాసంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉన్న పోలీసులు... కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు తోసుకున్నారు. పోలీసులు నిరసనకారులపై వాటర్ కానన్‌లు ప్రయోగించారు. అయినా నిరసనకారులు బారికేడ్లను తోసుకుని వెళ్లగా పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఉపాధి పథకం మరో జుమ్లానా?

### ప్రధాని మోదీపై విరుచుకుపడిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏడాది క్రితం ప్రకటించిన ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇది మరో జుమ్లానా అని నిలదీశారు. మోడీని ఉద్దేశించి రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఆయన ప్రతి రోజూ కొత్త నినాదాలు చేస్తున్నప్పటికీ యువత ఇప్పటికీ నిజమైన అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. భారతదేశానికి ఎంతో అవసరమైన కోట్లాది ఉద్యోగాలను సృష్టించడానికి నిర్దిష్ట ప్రణాళిక ఏమిటని, లేక మరో జుమ్లానా? అని ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై బిజెపికి చెందిన అమిత్ మాల్వియా స్పందిస్తూ రాహుల్ గాంధీ బృందం వాస్తవాలను అతనికి వివరించడంలో పూర్తిగా విఫలమైందని, 'భారతదేశ యువతను వెలుగులోకి తీసుకురావడానికి తన ట్రేడ్ మార్క్ అజ్ఞానాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కాగా, 2024 ఎన్నికల తర్వాత, ప్రధాని మోదీ 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం' పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించారని, యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఈ పథకాన్ని ప్రకటించి దాదాపు ఒక సంవత్సరం కావస్తోంది, ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదు, దానికి కేటాయించిన రూ. 10,000 కోట్లను తిరిగి తీసుకుందన్నారు. నిరుద్యోగం గురించి ప్రధాని ఎంత తీవ్రంగా ఉన్నారో ఈ పథకమే నిదర్శనమని రాహుల్ ఎద్దేవా చేశారు. అయితే 2004–14లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వంలో కేవలం 2.9 కోట్ల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, 2014–24లో మోడీ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 17.19 కోట్లు అని మాల్వియ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధి విధానాన్ని రాహుల్ విమర్శిస్తూ విమర్శిస్తూ ఫెయిర్‌ప్లే వ్యాపారాల కంటే స్నేహితులను ప్రోత్సహించడం, పెద్ద కార్పొరేట్‌లపై మాత్రమే దృష్టి సారించడం, ఉత్పత్తి కంటే సమావేశాలకు ప్రాధాన్యత ఇవ్వడం, భారతదేశ స్వదేశీ నైపుణ్యాలను విస్మరించడం ద్వారా ఉద్యోగాలను సృష్టించడం లేదని మండిపడ్డారు. కోట్లాది ఉద్యోగాలను సృష్టించడానికి ఎంఎస్ఎంఇలలో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడం, పోటీ వృద్ధి చెందగల ఫెయిర్ మార్కెట్లు, స్థానిక ఉత్పత్తి నెట్‌వర్క్‌లకు మద్దతు, సరైన నైపుణ్యాలు కలిగిన యువతమే మార్గం అని ఆయన అన్నారు. ఈ ఆలోచనలతో ప్రధాని ఏకీభవించరన్నారు. అయితే తాను ప్రధానిని నేరుగా ప్రశ్నిస్తున్నానన్నారు. 'ప్రధానమంత్రి జీ, మీరు గొప్ప ప్రదర్శనతో ఇఎల్ఐని ప్రకటించారు కానీ, ఈ రూ. 10,000 కోట్ల పథకం ఎక్కడ అదృశ్యమైంది? మీరు మీ వాగ్దానాలతో పాటు మా నిరుద్యోగ యువతను వదిలిపెట్టారా? మీరు ప్రతిరోజూ కొత్త నినాదాలు ఇస్తున్నప్పటికీ మన యువత ఇప్పటికీ నిజమైన అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. భారతదేశానికి ఎంతో అవసరమైన కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి మీ కాంక్రీట్ ప్రణాళిక ఏమిటి, లేదా ఇది మరో జుమ్లానా?' అని ఆయన అన్నారు. అదానీ, అతని 'బిలియనీర్ స్నేహితులను సంపన్నం చేయడం నుండి అణగారిన వర్గాల యువతకు ఉపాధికి సమాన ప్రాప్తిని కల్పించడంపై ప్రధానమంత్రి తన దృష్టిని ఎప్పుడు మారుస్తారని గాంధీ ప్రశ్నించారు.

## ప్రజల ప్రాథమిక హక్కుల గురించి ఆలోచించాలి


### ◆ ఇడికి సుప్రీం కోర్టు స్పష్టీకరణ ◆ ఎన్ఎఎన్ స్కామ్ కేసు ఢిల్లీకి బదిలీ చేయాలన్న ఇడి పిటిషన్‌పై కోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు ప్రాథమిక హక్కులుంటే.. ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్ఎఎన్) స్కామ్ దర్యాప్తును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని ఇడి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అనేది వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో కోర్టులను ఆశ్రయించి వాటిని పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ద్వారా పరిష్కారాలు పొందే హక్కును కల్పిస్తుందని గుర్తు చేసింది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత సోలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ.. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. అదే సమయంలో మాట్లాడుతూ ఇడికి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి అని వ్యాఖ్యానించారు. దీనికి బెంచ్ స్పందిస్తూ ఇడికి ప్రాథమిక హక్కులు ఉంటే.. అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి అని చురకలు అంటించి.. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది. ఈ కేసులో నిందితుడైన మాజీ ఐఎఎస్ అధికారికి గతేడాది మంజూరైన ముందస్తు బెయిల్ దుర్వినియోగమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. దీనికి తోడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని ఏజెన్సీలు ఓ హైకోర్టు జడ్జితో టచ్‌లో ఉంటున్నాయని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ కేసులోని కొందరు నిందితులకు న్యాయపరంగా ఉపశమనం కల్పిస్తున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ కేసులో అత్యున్నత స్థాయి వ్యక్తులకు కేటాయించిన ముందస్తు బెయిళ్లను కూడా రద్దు చేయాలని ఈడీ కోరుతోంది. దీంతోపాటు కేసును ఢిల్లీకి బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యక్రమాలను పర్యవేక్షించే నాగరిక్ అపుర్తి నిగమ్ కార్యాలయాలపై 2015లో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ దాడులు చేసి.. రూ.3.6 కోట్ల నగదు స్వాధీనం చేసుకొంది. బియ్యం నమూనాలు చాలా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించింది. అవి అసలు మనుషులు తినేలా లేవని తేల్చింది. నాడు ఈ సంస్థకు అనిల్ తుతేజా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.

### మహిళలపై మంత్రి వెకిలి వ్యాఖ్యలు

## మంత్రి పదవి నుంచి తొలగింపు



**చెన్నై :** తమిళనాడు అటవీశాఖ మంత్రి పొన్ముడి.. హిందూ మహిళలనుద్దేశించి దారుణమైన వ్యాఖ్యలు చేశారు. హిందూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను ఆయన్ను సిఎం స్టాలిన్ మంత్రి పదవి నుంచి తొలగించారు. ఒక బహిరంగ కార్యక్రమంలో మహిళలు, శైవులు, వైష్ణవుల గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో తమిళనాడు మంత్రి కె పొన్ముడిని శుక్రవారం అధికార ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) పార్టీ.. పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుండి కూడా తొలగించింది. పొన్ముడి చేసిన వ్యాఖ్యలపై తమిళనాట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినీ తారల దగ్గర్నుంచి అధికార పార్టీ సభ్యులు కూడా ఆయన వైఖరిపై మండిపడుతున్నారు. డిఎంకె ఎంపి కనిమొళి కూడా పొన్ముడి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. పొన్ముడి ఇటీవలి ప్రసంగం ఆమోదయోగ్యం కాదు. దానికి కారణం ఏదైనా, ఇటువంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు ఖండించదగినవి, అని కనిమొళి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఒక బహిరంగ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్ముడి హిందూ మహిళలు నుదుట ధరించే తిలకాలను ప్రైవేట్ పార్ట్స్‌తో పోల్చాడు. దీంతో తమిళనాట అందరూ పార్టీలకతీతంగా విరుచుకుపడుతున్నారు. ఈ ఘటన హిందూ విశ్వాసాలపై దాడిగా బిజెపి అభివర్ణించింది. డిఎంకె ప్రభుత్వంలోని అత్యంత సీనియర్ మంత్రులలో పొన్ముడి ఒకరు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద 2023లో పొన్ముడిని, ఆయన కుమారుడు, కళ్లకురిచ్చి పార్లమెంటు సభ్యుడు గౌతమ్ సిగ్మని ఇంకా వారి కుటుంబ సభ్యులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. ఈ కేసులో ఇడి రూ.14 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసింది. మార్చి 2024లో, సుప్రీంకోర్టు పొన్ముడిని దోషిగా నిర్ధారించి, నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించి, స్టాలిన్ మంత్రివర్గంలోకి తిరిగి చేర్చుకోవడానికి అనుమతించింది. మద్రాస్ హైకోర్టు 2023లో ఆయనను దోషిగా నిర్ధారించింది, దీని ఫలితంగా ఆయన వెంటనే శాసనసభ్యుడిగా అనర్హత వేటు పడడంతో అప్పట్లో మంత్రి పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఇలాంటి మాటలతో మంత్రి పదవి పోగొట్టుకున్నారు పొన్ముడి.

## టెక్నాలజీ, టారిఫ్‌లదే హవా

### కేంద్రమంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ:** ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు 'టి'లు కీలక భూమిక పోషిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. టెక్నాలజీ, టారిఫ్‌లను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. 'కొద్దికాలంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు ఇక్కడ 'టి' పదం గురించి చర్చించడానికి మనం సమావేశమయ్యాం. రెండు 'టి'లకు మధ్య ఉన్న సంబంధాన్ని మీరు ఆలోచించాలని నేను కోరుకుంటున్నాను. ఈ భౌగోళిక, సాంకేతిక నేపథ్యంలో మనం ప్రపంచాన్ని ఎలా చూడాలి? నేనైతే దీనినొక అవకాశంగా చూస్తాను. ఈ మార్పు, టి అక్షరం గురించి మాట్లాడేటప్పుడు అమెరికా నుంచే ప్రారంభిస్తాం. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని అమెరికా ప్రాథమికంగా మార్చేసింది. దాంతో ప్రపంచంపై దాని పరిణామాలు ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణం కాదు. దాంతోపాటు ఆ దేశ సాంకేతిక పురోగతి అత్యంత కీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుంది అన్నది స్పష్టం. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌కు, టెక్‌కు మధ్య సంబంధం ఉంది. 2016 నుంచి 2020 (అప్పుడు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నారు) మధ్య అది ఇంత స్పష్టంగా కనిపించలేదు' అని మంత్రి మాట్లాడారు. చైనా స్థిరమైన ఎదుగుదలను ఆయన ప్రస్తావించారు. ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులను వివరించారు.

## ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం

**శ్రీనగర్ :** చీనాబ్‌లోయలోని కిష్త్వార్ జిల్లాలో గుర్తుతెలియని ఉగ్రవాది మరణించినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మూడవ రోజుకి చేరుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఒక ఉగ్రవాది మరణించారని, ప్రతికూల భూభాగం, వాతావరణం ఉన్నప్పటికీ భద్రతాదళాలు ఆపరేషన్ చేపడుతున్నారని లోయ ఇంచార్జ్, ఆర్మీ వైట్ కార్ప్స్ ప్రతినిధి తెలిపారు. ఏప్రిల్ 9న కిష్త్వార్‌లోని ఛత్రు ఎగువ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో పోలీసులతో కలిసి సంయుక్తంగా గాలిస్తుండగా, కాల్పులు ప్రారంభమయ్యాయని అన్నారు. జమ్మూలోని ఉధంపూర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగిందని సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది జమ్మూలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని అన్నారు. మార్చిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు పోలీసులు, ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అన్నారు.

# ఒఎంఆర్ షీట్లను విడుదల చేయండి

### బెంగాల్‌లో ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులు డిమాండ్

### కరుణమోయి నుంచి ఎస్ఎస్‌సి కార్యాలయం ఆచార్య సదన్ వరకు ర్యాలీ



**కోల్‌కతా :** కోల్‌కతా వీధుల్లో శుక్రవారం సామూహిక ఆందోళనల దృశ్యాలు తిరిగి పునరావృతమయ్యాయి. ఆర్‌జి కార్ ఆసుపత్రిలో జరిగిన దారుణమైన అత్యాచార, హత్యపై నిరసనలు నాడు ప్రతిధ్వనించగా, ఈసారి సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది వీధుల్లోకి వచ్చి తమ గళాన్ని వినిపించారు. సాల్ట్ లేక్ మార్గంలో ప్రదర్శనకారులు ర్యాలీ చేస్తూ 'మాకు న్యాయం కావాలి' అంటూ నినదించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఉద్యోగాలు ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. వారిలో తీవ్ర నిరాసక్తత కనిపించింది. 2016 ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరైన నిజమైన అభ్యర్థులను గుర్తించడానికి 22 లక్షల ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (ఒఎంఆర్) షీట్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, కరుణమోయి నుండి పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) కార్యాలయం ఆచార్య సదన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా విఫలమైందని, కళంకితమైందని తేల్చిన తర్వాత మొత్తం ప్యానెల్‌ను రద్దు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, పునః నియామకం కోరుతూ ప్లకార్డులు చేతపట్టి, నిరసనకారులతో కలిసి వివిధ పౌర సంఘాల సంస్థల సభ్యులు సంఘీభావం ప్రకటించారు. అర్హులైన ఉపాధ్యాయులను వేరు చేయడానికి ఎస్ఎస్‌సి ఒఎంఆర్ షీట్ల కాపీలను విడుదల చేయాలని ఒక ప్రదర్శనకారుడు డిమాండ్ చేశారు. అయితే గతంలోనే కమిషన్ ఒఎంఆర్ షీట్లు,డిజిటల్ కాపీలు తమ వద్ద లేవని కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టుకు చెప్పింది. అవి ధ్వంసమయ్యాయని పేర్కొంది. ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయుల ప్రతినిధులు, రాష్ట్ర విద్యా మంత్రి బ్రాత్య బసు మధ్య జరగనున్న కీలకమైన సమావేశం ఫలితం కోసం నిరసనకారులు రోడ్డుపై గుమిగూడి ఆసక్తిగా ఎదురు చూశారు. ఈ ప్రతిష్టంభనకు పరస్పరం అంగీకరించే పరిష్కారం కనుగొనే వరకు తాము వీధులను వదిలి వెళ్ళమని భీష్మించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన అభ్యర్థులను తిరిగి అదే బ్రాకెట్‌లో చేర్చి, మోసపూరిత మార్గాల ద్వారా ఉద్యోగం పొందిన కళంకిత అభ్యర్థులతో శిక్షించకపోతే ఈ ఆందోళన ఇక్కడి నుండి ఊపందుకుంటుందని హెచ్చరించారు. ఆందోళన అదుపు తప్పకుండా ఆపడానికి ఎస్ఎస్‌సి కార్యాలయం వద్ద పోలీసులు, ఆర్ఎఎఫ్ సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. ఈ వారం ప్రారంభంలో ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ బెంగాల్ ప్రభుత్వం త్వరలో సుప్రీంకోర్టు ముందు వివరణ పిటిషన్‌ను వేస్తుందని ప్రకటించారు. మరోవైపు దక్షిణ కోల్‌కతాలోని కస్బాలోని జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులపై పోలీసు చర్య కారణంగా శుక్రవారం నిరసనలు మరింత ఊపందుకున్నాయి. యూనిఫాంలో ఉన్న వ్యక్తులు ఆందోళనకారులపై లాఠీ ఛార్జ్ చేయడం, వారిపై దాడి, కాళ్లతో తన్నడం వంటి దృష్యాలు కూడా వైరల్ అయ్యాయి. కస్బాలో నిరసనకారులను కాలుతో తన్నిన పోలీసు అధికారికి ఇప్పుడు వారిపై నమోదైన కేసులను దర్యాప్తు చేసే బాధ్యత అప్పగించారని ఉపాధ్యాయులు మండిపడ్డారు. ఇటువంటి దర్యాప్తు నుండి మనం ఏమి ఆశించగలం? ఏ నాగరిక సమాజంలోనూ నిందితుడు బాధితులను దర్యాప్తు చేయడు అని ఒక నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

### కుటుంబ ప్రయోజనాలే

## ప్రతిపక్షాలకు ముఖ్యం



**వారణాసి:** ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకు సాగుతోం దని అన్నారు. ఎన్‌డిఎ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభి వృద్ధే ధ్యేయంగా పని చేస్తు న్నారని పేర్కొన్నారు. పూలే దంప తులను ఆదర్శంగా తీసుకొని తాము మహి ళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ – పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి.. కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్ కా సాథ్..సబ్ కా వికాస్' (అందరితో కలిసి..అందరి కోసం) నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.

## కమీషన్ అడిగితే.. లోకాయుక్తకు ఫిర్యాదు చేయండి

### కర్నాటక డిప్యూటీ సిఎం శివకుమార్




**బెంగళూరు :** బిల్లులు చెల్లించేందుకు ఎవరైనా కమీషన్ డిమాండ్ చేస్తే లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కాంట్రాక్టర్లకు సూచించారు. గత బిజెపి ప్రభుత్వ హయాంలో కంటే ఇప్పుడు కమీషన్లు పెద్ద ఇబ్బందిగా మారాయని కర్నాటక కాంట్రాక్టర్ల సంఘం (కెఎస్‌సిఎ) ఆరోపించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. డిప్యూటీ సీఎం శివకుమార్, మరో ఇద్దరు సీనియర్ మంత్రుల కార్యాలయాల్లో అవినీతి మితిమీరిపోయిందని కాంట్రాక్టర్ల సంఘం గురువారం సంచలన ఆరోపణలు ఆరోపించింది. మంత్రుల కార్యాలయాల్లో బ్రోకర్లు కిక్కిరిసిపోయి ఉంటారని.. మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్ఎస్ బోస్‌రాజు తనయుడు రవి బోస్‌రాజు లావాదేవీలన్నీ తానే జరుపుతారని, ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి బంధువు ఒకరు శాఖాపరమైన వ్యవహారాల్లో తలదూరుస్తారని ఆరోపించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఆవరణలో డికె విలేకరులతో మాట్లాడుతూ ఆరోపణలను శివకుమార్ ఖండించారు. తనతో పాటు మంత్రులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ల నుంచి ఎవరైనా కమీషన్ అడిగి ఉంటే లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలన్నారు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎందుకు మంత్రిని అడగాలని ప్రశ్నించారు. వారికి (కాంటాక్టర్లకు) శాఖ బడ్జెట్ తెలియదా? గ్రాంట్ లేనప్పుడు వారు కాంట్రాక్టును ఎలా తీసుకున్నారు? అంటూ ప్రశ్నించారు. బిజెపి హయాంలో తన శాఖ మాత్రమే రూ.లక్ష కోట్లకుపైగా విలువైన కాంట్రాక్టులను ఇచ్చిందని.. ఈ కాంట్రాక్టులకు బిల్లులు చెల్లించమని ఎమ్మెల్యేలు అడుగుతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు తాను కాంట్రాక్టర్లను హెచ్చరించానని ఆయన అన్నారు. నిధులు లేకుండా ఏ పని చేయవద్దని హెచ్చరించినా మాన వినలేదని.. ఇప్పుడు రాజకీయ నేతల వద్దకు వస్తున్నారన్నారు.

## విద్యుత్ బిల్లులు చెల్లించని కంగన



సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రణావత్ రెండు నెలల విద్యుత్ బకాయిలు చెల్లించలేదని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (హెచ్‌పీఎస్ఈబీ) స్పష్టం చేసింది. రెండు నెలల విద్యుత్ బకాయిల మొత్తం రూ.90,384 ఉందని తెలిపింది. మేడమ్ బిల్లులు చెల్లించకపోగా... రాష్ట్ర ప్రభుత్వాన్ని దూషించారని రాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి విక్రమాదిత్య సింగ్ మండిపడ్డారు. మనాలిలోని తన ఖాళీ నివాసానికి నెలకు లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వచ్చిందని ఇటీవల మండిలో నిర్వహించిన బహిరంగ సభలో కంగన ఆరోపించిన సంగతి తెలిసిందే. మేడమ్ విద్యుత్ బిల్లులు కట్టరని, బహిరంగవేదికలపై ప్రభుత్వాన్ని దూషిస్తారని మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు చెందిన బిల్లులు రూ.90,384 అని, వాటిలో గతంలో రూ.32,287 కూడా ఉన్నాయని హెచ్‌పీఎస్ఈబీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మనాలిలోని సిమ్సా గ్రామంలో కంగనా రణావత్ నివాసంలో ఆమె పేరు మీద 100000838073 నెంబర్ కింద విద్యుత్ కనెక్షన్ ఉందని తెలిపింది. విద్యుత్ కనెక్టెడ్‌లోడ్ 94.82 కేడబ్ల్యూ అని, సాధారణ నివాస సగటు విద్యుత్ లోడ్ కన్నా 1500 శాతం ఎక్కువని పేర్కొంది. అక్టోబర్, డిసెంబర్ వరకు కంగన బిల్లులు సకాలంలో చెల్లించలేదని ఆ ప్రకటనలో తెలిపింది.

## ఎన్ఐఏ దర్యాప్తునకు ముంబై పోలీసుల సహకారం:ఫడ్నవిస్



**ముంబై:** ముంబై ఉగ్రదాడి కుట్రలో ఒకడైన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్ తీసుకురావడం, ఎన్ఐఏ నేతృత్వంలో దర్యాప్తు జరుపుతుండటంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం స్పందించారు. దర్యాప్తు విషయంలో ఎన్ఐఏకు ముంబై పోలీసులు సహకరిస్తారని రాష్ట్ర హోం మంత్రిగా కూడా ఉన్న ఫడ్నవిస్ చెప్పారు. రాణాను ఢిల్లీ నుంచి ముంబై తీసుకువస్తారా అని అడగగా... దానిపై ఎన్ఐఏ నిర్ణయిం తీసుకుంటుందని సీఎం జవాబిచ్చారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఎన్ఐఏ కలిసి రాణాను ఎక్కడికి తీసుకువెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఎన్ఏఐకు అన్ని విధాలా సహకరించేందుకు ముంబై పోలీసులు సిద్ధంగా ఉన్నారని, అవసరమనుకుంటే ముంబై పోలీసులు ఎన్ఐఏను సంప్రదిస్తారని చెప్పారు. రాణాను విజయవంతంగా భారత్‌కు తీసుకువచ్చి దేశ న్యాయవ్యవస్థ ముందు నిలబెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఫడ్నవిస్ ప్రశంసించారు. నవంబర్ 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడుల్లో తమ కుటుంబాలను కోల్పోయిన ముంబై ప్రజల తరపున ప్రధానికి కతజ్ఞతలు తెలిపారు. ఉగ్రదాడుల తర్వాత ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు తొలుత విచారణ చేపట్టారు. తొలి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఆ తర్వాత ఎన్ఐఏ రంగలోకి దిగి... దర్యాప్తును తమ అధీనంలోకి తీసుకుంది.

## వారణాసిలో అత్యాచారంపై మోదీ ఆరా

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

**వారణాసి :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ శుక్రవారం వారణాసిలో పర్యటించారు. ఉదయం అక్కడ ల్యాండ కాగానే ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కాగా వారణాసి పర్యటనలో భాగంగా జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాశీ నాది..నేను కాశీకి చెందినవాడిని అని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. వారణాసి మోదీ సొంత నియోజకవర్గం. 2014 నుంచి ఇప్పటివరకు మూడుసార్లు అక్కడి నుంచి విజయం సాధించారు.

## నేడు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 7వ మహాసభ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అనుబంధ సంఘం నల్లగొండ జిల్లా ఏడవ మహాసభలు నెల 12వ తేదీ శనివారం నల్లగొండలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతున్నాయని ఈ మహాసభకు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం ఏఐటియుసి నిరంతరం రాజిలేనీ సమర శీల పోరాటాలు నడుపుతుందని అన్నారు సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో తీవ్రజాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై ఈ మహా సభలో చ ర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన తెలి పారు. మహాసభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికం టి సత్యం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు వేడుకను ఘనంగా నిర్వహించారు. జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలలోనూ పాఠశాల ప్రిన్సిపాల్ దామోదర్ రెడ్డి దివాకర్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. జ్యోతిరావు పూలే ఆశాలను యువతి యువకులు కచ్చితంగా అమలు చేయాలని ఆయన ఆదర్శంగా తీసుకుని సమాజంలో జరుగుతున్న అక్రమాలు అరికట్టాలని వారు కోరారు. ప్రతి ఒక్కరు పూలే ను ఆదర్శంగా తీసుకుని నడుచుకోవాలని వారు కోరారు. స్థానిక ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ గురుకులాల్లోని విద్యార్థులు ఉన్నత స్థాయిలో చదువుకుని దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు. జ్యోతిరావు పూలే సమాజంలోనూ పెనుమార్పు తీసుకొచ్చి గొప్ప సంస్కర్తగా పేర్లు తెచ్చుకున్నారని ఆయన ఆశాలను ప్రతి ఒక్కరు అమలు ఏవిధంగా చూడాలని కోరారు.



## అనాధ పిల్లలకు ప్రభుత్వం అండ

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** అనాథ, పాక్షిక అనాధ పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని దానికి అనుకూలంగా బాలసదన్ భవనం నిర్మించుకుంటున్నామని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరి బై పాస్ రోడ్ సింగన్నగూడెం ఎస్టి పోస్ట్ మెట్రిక్ హాస్టల్ చౌరస్తా సముదాయం పక్కన దాదాపు 1 కోటి 34 లక్షల అంచనాతో బాలసదనం భవనాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు మాట్లాడుతూ భవన నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని, నిర్మాణ పనులు 6 నెలల వ్యవధిలో పూర్తిచేసి 6 నుండి 18 సంవత్సరాల లోపు వయసు అనాధ, పాక్షిక పిల్లలకు ఉపయోగపడేలా భవనం అందంగా తీర్చిదిద్దాలని, త్వరతగతిన పనులు పూర్తి చేసి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ రాజలింగం, ఏసిడిపిఓ రమ, బీఆర్బీ కోఆర్డినేటర్ అనంతలక్ష్మి , జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఎఐకెఎస్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** రైతులకు అండదండలుగా నిలిచిన ఏకైక సంఘం ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకెఎస్)అని ఏఐకెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఏఐకెఎస్ 90 వ వ్యవస్థాపక దినోత్సవంను హుజూర్‌నగర్‌లో ఘనంగా జరుపుకున్నారు. హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయం ముందు ఆల్ ఇండియా కిసాన్ సభ జెండాను కొప్పోజు సూర్యనారాయణ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐకెఎస్ ను 90 సంవత్సరాల క్రితం ఎన్.జి రంగా, స్వామి సహజానంద్‌ల ఆధ్వర్యంలో స్థాపించబడిందని తెలియజేశారు. గ్రామ, మండల, జిల్లా ,రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసుకొని రైతుల పక్షాన,రైతుల సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న సంఘం ఏఐకెఎస్ అన్నారు. అఖిల భారత 30 వ మహాసభలను ఈనెల 15,16,17వ తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో జరుపబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,జక్కుల రమేష్,మామిడి నర్సయ్య,జక్కుల శ్రీనివాస్,జక్కుల రమణ,రణబోతు వెంకటరెడ్డి,గూడెపు మంగయ్య తదితరులు పాల్నొన్నారు.

## సాగర్ కుడి ఎడమ కాలువల నీటి విడుదల నిలిపివేత



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ కుడి ఎడమ కాలువలకు సాగునీటి విడుదలను డ్యాం అధికారులు శుక్రవారం పూర్తిగా నిలిపివేశారు. ఎడమ కాలువకు సాగునీటి అవసరాలు తీరడంతో నీటిని నిలిపివేసినట్టు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. మరోవైపు ఎడమ కాలువకు నీటి విడుదల ఆపివేసిన తర్వాత కూడా కుడి కాలువకు నీటి విడుదల కొనసాగింపు పై కృష్ణ రివర్ మేనేజంట్ బోర్డు నుంచి ఒత్తిడి రావడంతో నీటి విడుదలను ఆపివేశారు. తమకు ఇప్పటివరకు కేఎంఆర్ బి నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవటం వల్లనే నీటి విడుదల కొనసాగించినట్లు వారు బుకాయిం చారు.ఇక గత ఏడాది నవంబర్ చివరి వారం నుంచి యాసంగి పంటకు కుడి ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. అయితే సాగునీటి అవసరాలు తీరడంతో శుక్రవారం రెండు కాలువలకు నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు ఆపివేశారు.

## కన్న కూతురుని హత్య చేసిన తల్లికి ఉరిశిక్ష

**ప్రజాపక్షం/మోతె:** కన్న కూతురుని హత్య చేసిన తల్లికి న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. దీనికి సంబంధించిన వివరాలను మండల ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుర్కచర్ల ఆవాసమైన మేకపాటితండాకు చెందిన బాణోతు భారతి అలియాస్ లాస్య అలియాస్ బుజ్జి తన మానసిక పరిస్థితి బాగ లేక ఏ మాత్రికుడివద్దకు వెళ్లగా సర్పదోషం ఉందని చెప్పాడు. దీంతో తన భర్త కృష్ణకు ఫోన్ చేసి తన పాపను హత్య చేస్తున్నట్లు చెప్పి గొంతుకోసి 15 ఏప్రిల్ 2021న హత్య చేసింది. ఆ నాడు తన భర్త కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎం శ్యాంశ్రీ ఆమెకు రూ.5వేల జరిమానా విధించడంతో పాటు ముద్దాయిని ఉరి తీయాలని తీర్పునిచ్చింది. అనంతరం విచారణలో చిన్నారిని హత్య గుప్త నిధుల కోసమని తెలింది.

## రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** రైతులు పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రంకు తీసుకొచ్చిన వెంటనే ఎగుమతి చేసి రైస్ మిల్లులకు పంపించాలని జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాసచారి కొనుగోలు కేంద్ర నిర్వహకులకు ,అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నెమ్మాని, తొండ్లాయి గ్రామాలలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈమేరకు రైతులు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని ఉన్నదిఉన్నట్లే కొనాలని, మిల్లర్లు కొర్వీలు పెట్టకుండా చూడాలని రైతులు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. రైతుల వాదనకు స్పందిస్తూ ఆయన మీ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళుతానని, అదే విధంగా కేంద్రానికి తీసుకొచ్చే ధాన్యంను ప్రభుత్వం సూచించన మార్గదర్శకాలను అనుసరించి కొనుగోలు చేస్తామని, ఇట్టి విషయంపై రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి గౌతమ్, వెలుగు ఎపియం శ్రీదేవి రైతులు తదితరులు పాల్గోన్నారు.

# కుల వివక్షత, అంటరానితనం రూపుమాపేందుకు కృషి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిబాపూలే అని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం కొనియాడారు. మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని పురస్కరించుకొని జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం శాసనమండలి సభ్యులు సత్యం మాట్లాడుతూ సమానత్వం లేని కాలంలో సత్యశోధక సమాజాన్ని ఏర్పాటు చేసి సమానత్వానికి కృషి చేశారన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా, సంఘసంస్కర్తగా సేవలందించారని తెలిపారు. స్వాతంత్రం సాధించి 79 సంవత్సరాలైనప్పటికీ ఇంకా సమాజంలో కుల వివక్షత, రెండు గ్లాసుల విధానం అక్కడక్కడ అంటరానితనం ఉందని, వీటిని రూపుమాపేందుకు, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్య ,మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల ,మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసి చదువుకునేలా ఒక్కొటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా స్థాపిస్తున్నదని, ఇందులో భాగంగానే నల్లగొండ జిల్లాలో 6 పాఠశాలలు మంజూరయ్యాయని, ఇందులో ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ అన్ని వర్గాల పిల్లలు ఉంటారన్నారు. మూడో విడత దేవరకొండకు కుడా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మంజూరయ్యిందని తెలిపారు. ప్రతి ఒక్కరు జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకొని బాగుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్, అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,విశ్రాంత ఐఎఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, అడిషనల్ ఎస్‌పి రమేష్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి ,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి ,డిఎస్‌పి శివరామిరెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారి సంజీవ, బిసి సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, చక్రధర్ పాల్గొన్నారు. అదేవిధంగా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు మహాత్మా జ్యోతిబాపూలే గొప్పతనాన్ని తమ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆహుతులకు తెలియజేశారు.

# దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వయో వృద్ధులు, దివ్యాంగుల కై ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, పెన్షన్లు మంజూరు చేయాలని దివ్యాంగులు దరఖాస్తులను సమర్పించగా, తమ పిల్లల నుండి పోషణ భత్యం ఇప్పించాలని, పిల్లలు తమను పోషించే విధంగా చూడాలని, అలాగే భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వయోవృద్ధులు దరఖాస్తులను సమర్పించారు.దరఖాస్తుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రజావాని ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కాగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ పట్టణానికి చెందిన నాగమ్మ అనే మహిళ మనస్థాపానికి గురై ఇంట్లో నుండి బయటకు వచ్చి నల్లగొండ రైల్వే స్టేషన్ లో ఉండగా సామాజిక కార్యకర్త భీమనపల్లి శ్రీకాంత్ గుర్తించి మహిళా శిశు సంక్షేమ శాఖకు సమాచారం అందించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగమ్మను వైద్య కళాశాలలో చేర్పించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం గత 3 రోజులుగా సఖి సెంటర్లో ఆశ్రయం కల్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, శుక్రవారం నాగమ్మ కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ సమక్షంలో నాగమ్మ ను కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పి సీఈఓ ప్రేమకరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి,ఆర్‌డిఓలు వై. అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సదరం సర్టిఫికెట్లకు సంబంధించి యుడిఐడిపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.



## రాజ్యాంగ విలువలను కాపాడటం కాంగీయుల లక్ష్యం : వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్):** రాజ్యాంగ విలువలను కాపాడటం కాంగ్రెస్ నాయకులు లక్ష్యం అనాదిగా వస్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గం కేంద్రంలో శుక్రవారం రోజున భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రంలో శాసనమండలి సభ్యులు శంకర్‌నాయక్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం, బిఆర్ అంబేద్కర్ అందించిన సమానత్వం, న్యాయం వంటి విలువలను గౌరవించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గాంధీజీ చూపిన శాంతి, అంబేద్కర్ సామాజిక న్యాయం ప్రజలకు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో కొన్ని శక్తులు మన రాజ్యాంగాన్ని స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితులలో మనందరం ఐక్యంగా నిలిచి పార్టీ చేపడుతున్న ఉద్యమంలో పాలు పంచుకోవాలని వీరేశం అన్నారు.

## ధరల పెంపుతో సామాన్యులపై భారం

**ప్రజాపక్షం/డిండి:** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50లను అధనంగా పెంచడం వల్ల సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్ధిక భారం పడుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల ధర పెంపుదలకు నిరసనగా శుక్రవారం డిండి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో శ్రీశైలంహైదరాబాద్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ చర్య మూలిగే నక్క పై తాటిపండు పడిన చందంగా ఉందని వారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికి రూ. 500లకే గ్యాస్ సిలిండర్లు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతుందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, కార్యవర్గ సభ్యులు కేశవులు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, హుస్సేన్, నాయకులు శాఖ కార్యదర్శులు చక్రి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, లక్ష్మారెడ్డి, వెంకటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలలో సిపిఐ పోటీ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం సలిగంజి కృష్ణ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సంస్థగతంగా అన్ని గ్రామాలలో సిపిఐ పార్టీ గ్రామ శాఖలలో మహాసభలు నిర్వహించుకోవలసి ఉన్నది పార్టీ బలోపేతానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయి. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వేములకొండలో గొప్ప బహిరంగ సభ నిర్వహించడం జరిగిందని అన్నారు. సంస్థగత పరంగా గ్రామ శాఖ మహాసభలు, ఏప్రిల్ చివరి వరకు గ్రామ శాఖ మహాసభలు నిర్వహించి మే నెలలో మండల మహాసభలు నర్సాపురం గ్రామంలో నిర్వహించాలని నిర్ణయించడం జరిగినది అని అన్నారు. వలిగొండలో మే చివరలో వలిగొండ మండల కేంద్రంలో వెయ్యి మందితోని శత జయంతి ఉత్సవాల బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని గ్రామ శాఖలలో సర్పంచ్, ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని పార్టీ నిర్ణయించినది అని అన్నారు. అనంతరం కౌన్సిల్ మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, కౌన్సిల్ సభ్యులు బాలగోని సత్యనారాయణ, ఎల్లంకి మహేష్, పులి పలుకులు మల్లేశం, సల్వాద్రి రవీందర్, కట్ల యాదగిరి, సుద్దాల సాయికుమార్, మచ్చ లక్ష్మీ నారాయణ, మేడి దేవేందర్, చేగురి పాపయ్య, అంబటి అంజయ్య, పోషబోయిన బొందయ్య, లింగయ్య పాల్గొన్నారు.

## కామ్రేడ్ వెంకటయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, గీతపనివారుల సంఘం నిర్మాణంలో ప్రముఖ నాయకులు కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్‌లు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఆయన రెండవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య సిపిఐలో కీలక పాత్ర పోషించారన్నారు. భూపోరాటాల్లో లాల్ బహుదూర్ శాస్త్రీనగర్, గిరినగర్ ఇండ్ల పట్టాలు పేదలకు ఇప్పించడంలో ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గీత పని వారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, ఐఎల్ జిల్లా కార్యదర్శి తోగటి మురళి, టైలరింగ్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, ఎల్ఐసి యూనియన్ నాయకులు వెంకట్ రెడ్డి, గీత కార్మిక సంఘం నాయకులు అనంతుల జానయ్య, ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు బూర సైదులు, మహిళా సంఘం అధ్యక్షురాలు దేశగాని హేమలత, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

### ఎమ్మెల్యే బాలు నాయక్

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** రైతుల పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దేవరకొండ శాసనసభ్యుడు నేనా వత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పీఏపల్లి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో పాటు అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేందర్ం వద్ద బోల్లు గోవిందు యాదవ్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి పి ఎస్ సి హెచ్ చైర్మన్ తేరా మణిపాల్ రెడ్డి ,మాజీ ఎంపీపీలు వంగల ప్రతాప్ రెడ్డి,తెర సత్యనారాయణరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి ,ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ తదితరులున్నారు.



# అకాల వర్షంతో అపారనష్టం

### చేతికొచ్చిన పంట నేల రాలడంతో అన్నదాతకు తీరని శోకం.... ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాత ఆవేదన

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా గురువారం రాత్రి ఉరుములు, మేరుపులు గాలితో కూడిన అకాల వర్షం భీభత్సాన్ని సృష్టించింది. మండల వ్యాప్తంగా వరి, మామిడి, సపోట ఇతర పంటలు నెలరాలిన దుస్థతి నెలకొంది. మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన రైతులు రహీం, శోభ, పురుషోత్తం రెడ్డి, అనంతారం గ్రామంలో హమీద్, అమృత రైతులకు చెందిన మామిడి తోటలు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తి స్థాయిలో కాయలు నెలరాలి అపార నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా చేతికొచ్చిన వరి పంట కూడా వర్షానికి పూర్తిగా నెలకు ఒరిగి పోయిందని, ఒక వైపు కల్లాలలోని వరి తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాయానికి రైతులు తీసుకువచ్చిన వరి పంటను అధికారులు కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీసుకువచ్చిన పంట మొత్తం వర్షానికి కొట్టుకుపోయి, తడిసి, రంగు మారాయని తక్షణమే రైతులు తీసుకువచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలలో త్వరితగతిన కొనుగోలు చేయాలని, రంగు మారిన, తడిసిన ధాన్యా న్ని కూడా కొనుగోలు చేసి మద్దతు ధరను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మామిడి, సపోట రైతులకు ప్రభుత్వం అండగా ఉండి అధికారులకు నష్టపోయిన రైతుల వద్దకు పంపి సర్వే నిర్వహించి నష్ట పరిహారాన్ని అంచనా వేయించి రైతులు నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.





## మద్దతు ధర రాక మండిపడ్డ రైతు

### మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యానికి మంటపెట్టిన వైనం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆరుకాలం ఎంతో కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర రాకపోవడంతో ఓ రైతు కడుపు మండి మార్కెట్‌కు తీసుకవచ్చిన తన వరి ధాన్యాన్ని తగులపెట్టిన సంఘటన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలంలోని రేపాల గ్రామానికి చెందిన బత్తుల లింగరాజు అనే రైతు ఇతరుల వద్ద ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిని సాగు చేశాడు. తాను పండించిన 70బస్తాల ధాన్యం( సన్న ధాన్యం చింట్లు) మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చాడు. మార్కెట్‌లో ఖరీదుదారులు తన ధాన్యానికి క్వింటాకు రూ.1600 ధర పెట్టడంతో ఇంత తక్కువకు ధాన్యం కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నించాడు. సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 2320లతో పాటు అదనంగా బోనస్ క్వింటాకు రూ. 500లు ఇస్తుంటే ఇంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఆవేదన చెందాడు. తాము ఈ ధరకే కొనుగోలు చేస్తామని ఇష్టం ఉంటేనే అమ్ముకొండే లేకుండే ఇంటికి మీ ధాన్యాన్ని తీసుకుపోండి అంటూ ఖరీదుదారులు చెప్పడంతో కడుపు మండి తమ ధాన్యానికి నిప్పు పెట్టాడు. అక్కడ ఉన్న తోటి రైతులు అప్రమత్తమై మంటను చల్లార్చి రైతును ఓదార్చారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ అధికారులు రైతుతో మాట్లాడి మద్దతు ధర వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో సదరు రైతు శాంతించారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ప్రజాపక్షం/వెల్గటూర్:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ఎంఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మీ చెక్కులను అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పంపిణీ చేశారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గత పాలకుల లాగ మేము లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడం లేదని గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు సన్నబియ్యాన్ని పంపిణీ మాట పక్కకు పెట్టి కనీసం రేషన్ కార్డులను అయిన జారీ చేశారా అని ప్రశ్నించారు. తామ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎక్కడ లేని విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు ఈ-ఆటో డ్రైవింగ్ శిక్షణ నేడు ప్రారంభం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** దుర్గాభాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం, ఎల్ఎండి కాలనీ ఆద్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కోసం ఈ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శిక్షణకు సంబంధించిన ప్రణాళికపై శుక్రవారం అధికారులతో కార్యాలయంలో చర్చించారు. ఎంఓ డబ్ల్యూఓ ఫౌండేషన్ ఆద్వర్యంలో 18 నుంచి 45 ఏళ్ల లోపు ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళలకు 60 రోజుల పాటు ఈ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఉంటుందని అన్నారు. అనుభవజ్ఞులైన మహిళా ఇన్‌స్ట్రక్టర్లతో శిక్షణ ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ అనంతరం వారికి డ్రైవింగ్ లైసెన్స్ అందజేయాలన్నారు. శిక్షణ పొందిన వారు స్వయం ఉపాది పొందేలా ఆటో కొనుగోలు చేసుకునేందుకు రుణం వచ్చే మార్గాలను, ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను గురించి సూచించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, అడిషనల్ డిఆర్‌డివో సునీత, మెప్మా పిడి వేణుమాధవ్, మహిళ ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన మహనీయుల విగ్రహాలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం / చందుర్తి :** భవిష్యత్తులో గ్రామగ్రామాన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకొని వారి సేవలు, త్యాగాలు స్మరించుకుంటూ వారి ఆదర్శలను ముందు తరాలకు తెలియజేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రం లోని జ్యోతిరావు పూలే , సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అగ్రవర్ణాల ఆదిపత్యం ఉన్న ఆనాటి సమాజం లో చదువు ప్రాముఖ్యతను వివరించి సమాజాన్ని మేలుకొల్పిన మహనీయులని కొనియాడారు. యువత వారి బాటలో నడుస్తూ, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి,ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు గొట్టె ప్రభాకర్,పులి సత్యం, దారం చంద్రం, ఇందూరి మధు, దర్మపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
వార్తకు ఫోటో ఉంది

## భావితరాలకు నిత్య స్ఫూర్తి జ్యోతిరావు పూలే :ఎమ్మెల్యే సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీన జన బాంధవుడు, సమసమాజ స్థాపనలో భావితరాలకు జ్యోతిరావు పూలే నిత్య స్ఫూర్తి అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మండలంలోని ఆర్నకొండ గ్రామంలో వారి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కుల వివక్ష, లింగ అసమానతల వంటి సామాజిక అన్యాయాలపై పోరాడటమే కాకుండా దేశంలో మొట్టమొదటి బాలికల పాఠశాల ప్రారంభించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య, అశోక్, కృష్ణహరి, చందు, డేవిడ్, రంగన్న, శంకర్, రమేష్, రాములు, శ్రీనివాస్ గౌడ్, కుమార్, అనిల్, గంగారం, స్వప్న, రమేష్, శ్రీనివాస్, సునీత, సంతోష్, శ్రీనివాస్, రాజేందర్, వేణు, గంగరాజు, శ్రీకాంత్, స్వామి, రవీందర్‌లున్నారు.

## నగరపాలికలో పూలే జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి పురస్కరించుకొని శుక్రవారం వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, సీనియర్ అసిస్టెంటు పబ్బాల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, సంపత్, సీనియర్ అకౌంటెంట్లు రాజ్‌కుమార్, రవితేజ, జూనియర్ అసిస్టెంటు విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

## గుడి చెరువులో గుర్తు తెలియని మహిళా మృతదేహం

**ప్రజాపక్షం /వేములవాడ టౌన్:** వేములవాడ గుడి చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నదని సమాచారం రాగానే వెంటనే స్పందించి మృతదేహాన్ని బయటకు తీసి చూడగా, ఆ మహిళ యొక్క వయస్సు సుమారు 3540 సంవత్సరాలు ఉంటుందని, దాదాపు నాలుగు నుండి ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చుని, ఆమె యొక్క వివరాలు ఎవరికైనా తెలిసినచో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ నందు సంప్రదించగలరని వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. వీర ప్రసాద్ ఒక ప్రకటనలో పెలిపారు.

## తల్లి చేతిలో తనయుడు హతం




**ప్రజాపక్షం/ముత్తారం :** మద్యం మత్తులో కన్నతల్లి ని వేధిస్తున్న కుమారుడిని తల్లే హతమార్చిన ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రలో శుక్రవారం చోటు చేసుకుంది. నరేష్ తండ్రి మహేష్ రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాల ఇలా ఉన్నాయి. ముత్తారం గ్రామానికి చెందిన మ హేష్ నరేష్(33) గత కొంతకాలంగా తాగుడుకు బానిస కావడంతో భార్య తో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అతిగా మద్యం సేవించే వాడని మద్యానికి డబ్బులు ఇవ్వకపోతే తల్లిదండ్రులను చేతులతో కొడుతూ, బూ తులు తిట్టేవాడని తెలిపారు. ఈనెల 10వ తేదీన రాత్రి 11 గంటల 30 నిమిషాల సమయంలో నరేష్ అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మరొక రూమ్లో ఉన్న తల్లి మహేష్ లక్ష్మి వద్దకు పోయి చేయి పట్టుకొని మానభం గం చేయడానికి ప్రయత్నించగా తల్లి వెంటనే పక్కనే ఉన్న రోకలి బండతో నరేష్ తలపై, నుదుటిపై, ఛాతిపై కొట్టదంతో తీవ్ర గాయాలైన వారిని పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి నరేష్ ను తరలించగా వైద్యులు వచ్చి నరేష్ కు వైద్య పరీక్షలు అందించే ప్రయత్నంలోనే అప్పటికే చనిపోయి ఉన్నాడని వైద్యులు తెలపడం జరిగిందన్నారు. నరేష్ తండ్రి మహేష్ రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకులక్ష్మి పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన రివన్ష్ శర్మ

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం ఎన్‌టిపిసి స్కేటింగ్ అకాడమీకి చెందిన విద్యార్థి రివన్ష్ శర్మ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించాడు. రివన్ష్ శర్మ ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం మొహాలీలో జరగనున్న జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణమూర్తి తెలిపారు. రివన్ష్ శర్మను తల్లిదండ్రులు, బంధుమిత్రులు, స్కేటింగ్ క్రీడాకారులు అభినందించారు.

# సత్య దూరమైన వార్తలను పరిశోధించాలి

సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ, సత్యదూరమైన వార్తలను పరిశోధించి ప్రజలకు అందించాలని ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, బిసి సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు అన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరై నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల జయంత్, ఆడెపు మహేందర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులచేత మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమా ణ స్వీకారం చేపించారు. నూతన పాలక వర్గానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ నూత న కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దేశంలో ప్రెస్ ఫోర్త్ ఎస్టేట్‌గా పని చేస్తుందని అన్నారు. ప్ర జాస్వామ్యాన్ని పటిష్టంగా పనిచేసేలా చూస్తుందని వారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి / మల్యాల :** జగిత్యాల జిల్లా కొండగట్టులో మూడు రోజులు జరుగుతున్న శ్రీఆంజనేయ స్వామి వారి చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. కొండగట్టులో జరుగుతున్న శ్రీఆంజనేయ స్వామి వారి చిన్న హనుమన్ జ యంతి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ అధికారులతో ఏర్పాట్ల గురించి అ డిగి తెలుసుకున్నారు. మాల విరమణ కోసం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఏ ర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ లను, భక్తులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని చెప్పారు.స్నానమాచారించే కోనేరుని పరిశీలించారు. కోనేరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా, అలాగే మంచినీరు అందించాలని సూచించారుఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, డిఎస్పి రఘు చందర్, కొండగట్టు ఆలయ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, మల్యాల సిఐ నీలం రవి, మల్యాల ఎస్సై నరేష్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గోవర్ధన్ మృతి బాధాకరం : సదానందం



**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ అల్లం గోవర్ధన్ మృతి బాధాకరమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లం గోవర్ధన్ అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి పార్థీవ దేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, సింగిల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చరవాణి ద్వారా మాట్లాడి ఓదార్చారు. కాగా ఈ పరామర్శ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినీత్, దాసరి చంద్రపల్లి గౌడ్ ఒబిసి సెల్ అధ్యక్షులు అల్లం కుమార స్వామి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బగ్గని మొగిలి,సింగిల్ విండో డైరెక్టర్స్ ఎలువక కొమురయ్య, గుజ్జ గోపాల్ రావు,అలుగం పాపారావు, కొనుకంటి మల్లయ్య, సీనియర్ నాయకులు జక్కుల సాయి, లక్కం ప్రభాకర్, ఆకోజు అశోక్‌చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువ వికాసం అమలుకు కట్టుదిట్టమైన చర్యలు

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** యువ వికాసం అమలు కు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అర్హులని, తెల్ల రేషన్ కార్డు లేని పక్షంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం లో వార్షిక ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలలో 1,50,000 రూపాయల లోపు, పట్టణ ప్రాంతాలలో 2లక్షల రూపాయలలోపు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు లెదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, రవాణా రంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాస్ పుస్తకం, దివ్యాంగులు సైతం సర్టిఫికెట్లు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఆన్ లైన్ పోర్టల్ లో లేదా ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేయాలని అన్నారు.ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఆఫ్ లైన్, ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ చేయాలని, ఆన్ లైన్ లో సమర్పించిన దరఖాస్తులను సైతం ప్రింట్ తీసుకొని పెట్టుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారి, బ్యాంకర్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి ఒకరు కలుపుకొని బృందంగా ఏర్పాటు కావాలని అన్నారు. మండల బృందం దరఖాస్తులను స్క్రూటినీ చేసి అర్హులను గుర్తించి జిల్లా బృందానికి పంపాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 32 వేల దరఖాస్తులు వచ్చాయని, ఏప్రిల్ 14 వరకు మరో 3 వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 30 లోపు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు ప్రతి మండలంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖలకు సంబంధించి మంజూరు చేసే యూనిట్ లక్ష్యాల వివరాలను ఏప్రిల్ 15 నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారికి తెలిపారు. ఏప్రిల్ 30 వరకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి అర్హుల ఎంపికకు ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు బ్యాంకర్లతో చర్చించి తుది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు పాటించే విధి విధానాలు, షెడ్యూల్ పై మీడియా ద్వారా దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలని అన్నారు. దరఖాస్తుల స్క్రుటిని తరువాత పథకానికి ఒక దరఖాస్తు ఎందుకు ఎంపిక చేస్తున్నాం, మరొకరి దరఖాస్తు ఎందుకు తిరస్కరిస్తున్నామో కారణాలు తెలియజేస్తూ జిల్లా కమిటీకి పంపాలని కలెక్టర్ తెలిపారు. ఒక గ్రామంలో ఒకే రకమైన యూనిట్లు స్థాపించకుండా జాగ్రత్తలు పాటించాలని, లాభదాయక యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ ,లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగా రెడ్డి, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదవారు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ ఎం. మను చౌదరి



**ప్రజాపక్షం/కొండపాక:** పేదవారు సంతోషంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. కొండపాక మండలం దర్గా గ్రామంలో శుక్రవారం రేషన్ కార్డు లబ్ధిదారుడు తలపాక శ్రీనివాస్ పుష్ప దంపతుల ఇంటిలో రేషన్ కార్డు ద్వారా తీసుకున్న సన్న బియ్యంతో వండిన అన్నంను లబ్ధిదారులు శ్రీనివాస్ దంపతులు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యంతో లబ్ధిదారులు సంతోషంగా కడుపునిండా తినగలుగుతున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డు ద్వారా అందజేస్తున్న సన్నం బియ్యంతో వండిన ఆహారం బాగుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 5775 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని జిల్లా వ్యాప్తంగా గల చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారందరికీ సన్న బియ్యం సరఫరా జరిగిందని తెలిపారు. జిల్లాలో సన్న బియ్యం తీసుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, ఈ పథకం ఎప్పటికీ ఇలానే కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలను దిగ్విజయం చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎంపి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంధర్బంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో తలపెట్టిన రజతోత్సవ మహాసభకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంసిద్ధమయ్యామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల మందికి తగ్గకుండా సభకు తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్ అంటేనే తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇష్టమైన జిల్లా అన్నారు. కరీంనగర్‌లో ప్రారంభించిన ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని వారు భావిస్తారని, 2001లో పార్టీని కరీంనగర్‌లోనే ప్రారంభించారని, తదనంతరం రైతుబంధు, దళితబంధులాంటి గొప్ప కార్యక్రమాలు ఇక్కడే వారు ప్రారంభించారని, ప్రజల సంక్షేమం కోసం వారు చేపట్టిన ప్రతి ఒక్క కార్యక్రమం విజయవంతమైందన్నారు. అదేవిధంగా సిల్వర్ జూబ్లీ వేడుకలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు తరలి వెళ్లేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా ప్రజలను సభకు తరలించడానికి రవాణాకు సంబంధించి ఆర్టీసీ నుంచి 400 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. వాటికి డబ్బులు సైతం చెల్లించడం జరిగిందన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో బిఆర్ఎస్ కుటుంబ సభ్యులతో సమావేశాలు నిర్వహించామని, సభకు తరలివచ్చేందుకు బిఆర్ఎస్ కార్యకర్తలతో పాటు ఇటు ప్రజల్లోనూ చాలా డిమాండ్ ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇంకా 200 బస్సులు కావాలని ఆర్టీసీని అడగనున్నట్లు వారు తెలిపారు. ఆర్టీసీ రవాణాతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులు, మహారాష్ట్ర నుంచి సైతం బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలంటే ప్రజల పండుగని, తెలంగాణ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని అన్నారు. కెసిఆర్ పుట్టి ఉండకపోయుంటే టిఆర్ఎస్ పార్టీ స్థాపించే వారు కాదని, టిఆర్ఎస్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని, తెలంగాణ రాష్ట్రం రాకుంటే ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రజలు దరిద్రం అనుభవించే వారని ఆవేదన వ్యక్తం చేశారు. సిల్వర్ జూబ్లీ వేడుకలకు సన్నద్ధం కావడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదివరకే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశం నిర్వహించారని, నేడు మరోసారి కరీంనగర్‌కు రానున్నారని, పార్టీ ముఖ్య నాయకులతో చింతకుంటలోని బిఆర్ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఏర్పాట్లు చేసుకున్నామో, ఏ విధంగా కార్యచరణ రూపొందించుకున్నామో ఆ నివేదికను సమావేశంలో వారికి అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్పకాలంలోనే అభాసుపాలయ్యిందని దుయ్యబట్టారు. ఎంతో ఆశతో గెలిపించిన ప్రజలకు తీవ్ర అసంతృప్తి మిగిల్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అది స్పష్టమవుతోందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లు తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. అందులో కరీంనగర్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సుమారు 750 కోట్ల రూపాయలతో కరీంనగర్‌లో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రారంభించి పనులను చేపట్టామని, అయితే ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్విచ్ ఆఫ్ చేసినట్లే పనులను ఆపేసారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మూసీ నదిని సబర్మతి రివర్ ఫ్రంట్ మాదిరిగా అభివృద్ధి చేస్తానని చెప్పడం శోచనీయమన్నారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్సీ సుంకె రవిశంకర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ అక్బర్, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ కార్పోరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజీవ్‌యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం నూతనంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ధరఖాస్తు తేదీని మరో వారం రోజులు పొడిగించి కుల ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు త్వరగా వచ్చేలా చూడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి కోరారు. అర్హులైన నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం ధరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం నిరుద్యోగులు తీవ్రంగా రోజుల తరబడి ఇబ్బంది పడుతూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ఇప్పటికే లక్షలాది మంది ధరఖాస్తు చేసుకోగా చేసుకోడానికి ప్రయత్నిస్తున్నవారు ఇంకా లక్షల్లో ఉన్నారని తెలిపారు. దీన్ని బట్టి చూస్తే నిరుద్యోగ సమస్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేని వారు ఎంత ఉన్నారో అర్థమవుతోందన్నారు. నిరుద్యోగులకు దాదాపు పది రోజులైనా గానీ ధ్రువీకరణ పత్రాలు రావడం లేదని, ఇదేమిటని తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే సాఫ్ట్‌వేర్ ఇబ్బంది ఉందని, సమయం పడుతుందని చెప్పడంతో ధరఖాస్తు చేసుకోవాలన్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బంది జరుగుతోందన్నారు. కొన్ని బ్యాంకులకే ఈ పథకం అనుసంధానం ఉన్న నేపథ్యంలో కొత్తగా బ్యాంకు అకౌంట్‌లు తీయడానికి సమయం పడుతుందని, ధరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 14 వరకు చివరి తేదీ ఉండడంతో నిరుద్యోగులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద, బ్యాంకుల వద్ద ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారని, తరచూ సర్వర్ డౌన్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వరుసగా నేటి నుంచి మూడు రోజుల పాటు బ్యాంకు సెలవుల దృష్ట్యా ప్రభుత్వం ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఇంకో వచ్చే వారం రోజుల పాటు ధరఖాస్తు తేదీని పొడిగించాలని కోరారు.

# సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సామాజిక రు గ్మతలను రూపుమాపి బహుజనుల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడు మ హాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో గల పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మా నకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మ న్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పో లీసు కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్ర ఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్ సహా పలువురు బిసి సంఘాల నేతలు, అధికారులు మహాత్మ జ్యోతిరా వు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సభ లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావుపూలే వంటి సంఘ సంస్కర్తల కృషి వల్లే నేటి సమాజం చైతన్యవంతంగా ఉందన్నారు. సమాజ రుగ్మతల ను మూఢచారాలను అస్పృశ్యతలను రూపుమాపిన జ్యోతిరావుపూలే ఆశయాలు కొనసాగించాలని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్ర భుత్వం బిసిల కులగణన చేపట్టిందని, బిసిల రిజర్వేషన్ కోసం చర్యలు తీసుకున్నదని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ బహుజనులకు చదువే అభివృద్ధి మార్గమని సూచించి ఆనాటి రోజుల్లో మహిళా చదువును ప్రోత్సహించిన గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. స మాజాభివృద్ధికి వారు పూలే త్యాగాలు మరువలేనివని, ఆయన మార్గాన్ని ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతి రావుపూలే రాసిన పు స్తకా న్ని, తెలుగు, ఇంగ్లీష్ అనువాద పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బిసి సంక్షేమాధికారి అనిల్ ప్రకాష్, పలువురు బిసి సంఘా ల నేతలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘన నివాళి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జ్యోతిరావు సేవలు ఎనలేనివి

**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సబ్ కలెక్టర్ కిరణ్మయి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజు, తహసీల్దార్ వరప్రసాద్, ఏవో సువర్ణ, ఆర్ఐ అశోక్, హన్మాండ్లు, జగన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతితో మరింత బాధ్యత



జిల్లా ఎస్పి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జీవితంలో పదోన్నతి ఎంతో ఉత్సాహాన్నిస్తుందని, దాంతో పాటు బాధ్యతను కూడా పెంచుతుందని జిల్లా ఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. రామగుండం కమీషనరేట్ పరిధిలోని కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వర్తిస్తు హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొంది కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయిన ఆరుగురు పోలీసులు శుక్రవారం జిల్లా ఎస్పిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందిన సిహెచ్ శ్రీనివాస్, బాలాజీ, సీహెచ్ సతీష్, సమ్మయ్య, రాజేందర్, సతీష్‌లకు జిల్లా ఎస్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతీ పోలీసు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

## యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి :ఎసిఎల్‌బి దీపక్ తివారి

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం సహాయ కేంద్రాన్ని జిల్లా అదనపు పాలనాధికారి (ఎసిఎల్‌బి) దీపక్ తివారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతీ ఈ స్కీమ్‌లో ఉన్న వివిధ యూనిట్‌లకు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులో వివరాలు సరిగ్గా పూరించాలని, దరఖాస్తులో ప్రతిని ఎంపిడిఒ కార్యాలయంలో సమర్పించాలని లబ్ధిదారులు తెలిపారు. ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తీరును, కులాల వారీగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు రాయాలని, ఆఫ్‌లైన్‌లో ఇచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ అయ్యే విధంగా చూడాలని ఎంపిడిఒ వి.ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. ఆదాయం సర్టిఫికెట్ అభ్యర్థులకు త్వరగా అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంఆర్ఒ రీయాల్ అలీకి సూచించారు. అనంతరం మండలంలో ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ ఇచ్చిన దరఖాస్తుల వివరాలను పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది ఎల్ఆర్ఎస్ చేసుకునేలా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (ఎసిఎల్‌బి)తో పాటు ఎంపిడిఒ, ఎంఆర్ఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


## అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నాకు సంఘీభావం



బాసర ట్రిబుల్ ఐటీ ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్

**ప్రజాపక్షం/భైంసా :** రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్తారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం బాసర ట్రిబుల్ ఐటీ ముందు తమను రెగ్యులరైజ్ చేయాలని ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడుతూ జీవో 21 వల్ల సంవత్సరాల తరబడి పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. తక్షణమే జీఒను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్రంలో 13 యూనివర్సిటీల్లో 900 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని, అందులో 200 మంది మహిళా ప్రొఫెసర్లు ఉన్నారన్నారు. న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వద్దకు వెళితే, వారందరినీ అరెస్ట్ చేసి 13 పోలీస్ స్టేషన్లో దినమంతా నిర్బంధించడం ఏంటని మండిపడ్డారు. ఎన్నికల్లో రెగ్యులరైజ్ చేస్తానని, ప్రొఫెసర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పడం సరికాదన్నారు. ఇచ్చిన వాగ్దానం మేరకు వారిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఆధ్యాత్మికతతో హనుమాన్ ర్యాలీ



**ప్రజాపక్షం/బోధన్ :** హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్ పట్టణంలో నిర్వహించే వీర హనుమాన్ విజయ శోభయాత్ర ర్యాలీని ఆధ్యాత్మికతతో నిర్వహించుకోవాలని నిజామాబాద్ జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య సూచించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్లో హనుమాన్ ర్యాలీ నిర్వహకులతో వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. ర్యాలీ సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ప్రతీ ఒక్కరూ ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుపుకోవాలని అదే సమయంలో ఇతరులకు, సామాన్యులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఉత్సవంలో డ్రోన్ల ను నిషేదించడం జరిగిందన్నారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ జరిగే రూట్‌ను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ టౌన్ సీఐ వెంకట్ నారాయణ, రూరల్ సిఐ విజయ్ బాబు, ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్, రుద్రూర్ సిఐ కృష్ణ, రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, ఎడపల్లి ఎస్సై వంశీ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, వర్ని ఎస్సై మహేష్, రుద్రూర్ ఎస్సై సాయన్న, కోటగిరి ఎస్సై సందీప్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

# సాంఘీక బహిష్కరణలపై కఠిన చర్యలు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పష్టీకరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో న్యూఅంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ముఖ్య అతిథిగా విచ్చేయగా, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను దురాచాలను పారద్రోలేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన మహానీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు.

**సాంఘీక బహిష్కరణలు విధిస్తే కఠిన చర్యలు :** జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట సాంఘీక బహిష్కరణలు విధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వీడీసీలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పూలే జయంతి వేదిక ద్వారా స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి వీడీసీలు కృషి కొనసాగిస్తే ఎవరికి ఎలాంటి అభ్యంతరం ఉండదని అందుకు భిన్నంగా వీడీసీ ముసుగులో చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పూనుకుంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు.

బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం విషయంలో నెలకొన్న న్యాయపరమైన అడ్డంకులు తొలిగేలా ప్రత్యేక చూపుతామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయన, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## మహిళా విద్యకు ఆధ్యుడు పూలే



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డిలో ఘనంగా మహాత్మా జ్యోతి బాపూలే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన మహానీయుడు మహాత్మా జ్యోతి బాపూలే అని కొనియాడారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి టీజీఐఐసి నిర్మల జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌లతో కలిసి పూలమాలలు వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాదురి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిదులు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పూలే కృషి



కలెక్టరేట్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిబా పూలే తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళల విద్యకు ఆజన్మాంతం కృషి చేశారని తెలిపారు. జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే భవనం, విగ్రహం ఏర్పాటు కోసం పలువురు సంఘ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేయగా, జ్యోతిబాపూలే భవన ఏర్పాటు దిశగా ప్రయత్నం చేస్తామని అదనపు కలెక్టర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్. ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, మైనారిటీ అధికారి మోహన్ సింగ్, సిపిఓ జీవరత్నం, ఎల్డిం రామ్ గపాల్, జిల్లా పరిశ్రమల మేనేజరు నరసింహారెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు నర్సాగౌడ్, భాస్కర్, ప్రభాకర్, మనోజ్, ముడుగు సత్యనారాయణ గౌడ్, ఇతర నాయకులు,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం

జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్



**ప్రజాపక్షం/జైపూర్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం జైపూర్, మందమర్రి, బీమారం మండలాలకు సంబంధించిన అధికారులకు వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు రబి సీజన్‌లో వరి కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై అవగామన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ రైతులు తమ తమ పంట పొలాలలో పూర్తి పరిపక్వత పొందిన ఆకులు, వరి గింజలు పూర్తిగా పసుపు రంగులోకి మారిన తర్వాతనే వరి కోతలు ప్రారంభించాలని అన్నారు. వరి కోతలు కోసే సమయంలో హార్వెస్టర్‌కు సంబంధించిన బ్లోయర్ 18 నుంచి 20 ఆర్‌పిఎం ఉండే విధంగా చూసుకోవాలని దీని ద్వారా తాలు తిప్పలు లేని నాణ్యమైన ధాన్యం వస్తుందని రైతులకు తెలిపారు. ఒపిఎంఎస్ సైట్‌లో రైతులందరూ తమ తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని, దళారులను నమ్మి తక్కువ ధరకు తమ ఉత్పత్తులను అమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి 2320, బి గ్రేడ్ వరి ధాన్యానికి 2300 ఇస్తుందని, సన్న రకాలకు అదనంగా 500 రూపాయల బోనస్ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, చెన్నూర్ ఎడిఎ ప్రసాద్ నాయక్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎఒలు, ఎఇఒలు, ఐకెపి సిబ్బంది, వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయం



సొంత నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయమని సొంత నిధులతో మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకొని పటాన్‌చెరువు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగాపాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. భవిష్యతు తరాలకు వారి ఆశయాలను అందించాలన్న సమున్నత లక్ష్యంతో సొంత నిధులచే పటాన్‌చెరు పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, స్థానిక కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సపనా దీవ్ కొమర గూడం వెంకటేష్, నరిసింహారెడ్డి, రుద్రారం శంకర్, వృథ్వీరాజ్, అశోక్, ప్రకాష్‌రావు, నర్రా బిక్షపతి, శంకర్, కుమార్, నివర్తి దేవ్, చంద్రశేఖర్, దళిత సంఘాల ప్రతినిదులు సీనియర్ నాయకులు పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# రానున్నది బిజెపి ప్రభుత్వమే

మెదక్ ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** భూములు తాకట్టు పెట్టి లోన్లు తీసుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిందని అప్పుడు మాట్లాడని కేటీఆర్, కెసిఆర్ ఇప్పుడెందుకు మాట్లాడుతున్నారని, కేటీఆర్‌కు బిజిపిని విమర్శించే హక్కులేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పని ఖాతమయిందన్నారు. బిజెపి పార్టీని, నాయకులను కార్యకర్తలను త్రిమూర్తుల్లా కాపాడుతామని రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆత్మీయ అభినందన సభను జిల్లా అధ్యక్షులు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సభకు కెంపి రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఎంఐఎంకు దీటుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని ఎంఐఎంతో బిఆర్ఎస్ లోపాయకారి ఒప్పందం కుదుర్చుకొని సూటుకేసులు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. ముందు టీచర్ ఎమ్మెల్సీ కొమురయ్య, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు మాట్లాడుతూ తమ గెలుపులో కీలక పాత్ర పోషించిన ఎంపి రఘునందన్ రావు, బిజెపి నాయకులు, అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. పట్టభద్రుల టీచర్ సమస్యలు పరిష్కరించినందుకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఎంఎల్ ఎన్ రెడ్డి, శ్రీనివాస్, నల్లాల విజయ్, నాయిని ప్రసాద్, గడ్డం కాశీనాథ్, ఆకుల రాము, బెండే వీణ, సంగీత తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## తునికాకు సేకరణకు వెళ్లి అడవిలో చిక్కుకున్న ఆదివాసీ మహిళలు

పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అడవిని జల్లెడ పట్టి రక్షించిన పోలీసులు



**ప్రజాపక్షం/మామడ :** నిర్మల్ జిల్లాలోని అడవిలో తునికాకు సేకరణకు వెళ్లి అక్కడే దారితప్పిన ఆదివాసి మహిళలను పోలీసులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ సంఘటన మామడ మండలంలోని కప్పనపల్లి గ్రామానికి చెందిన నాయకపోడ్ తెగకు చెందిన ఆదివాసీ మహిళలు రాజుల రాధ, కంబాల లింగవ్వ, గట్లమీది లక్ష్మి, బత్తుల సరోజ అనే నలుగురు తునికాకు సేకరణకు వెళ్లి అడవిలో చిక్కుకుపోయారు. అయితే రాత్రి ఇంటికి చేరకపోవడంతో ఆ గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయం నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల దృష్టికి వెళ్లింది. తక్షణమే ఆమె స్పందించి మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆ నలుగురు ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. మహిళలు తప్పి పోయిందిలా.. అడవులకు సమీపంలో ఉన్న మహిళలు సాయంత్రం వేళ తునికాకు సేకరణకు వెళుతుంటారు. పగలంతా రాలిన ఆకులను మహిళలు సేకరించి, వాటిని శుభ్రం చేసి కట్టలుగా కడుతుంటారు. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కప్పనపల్లి గ్రామానికి చెందిన రాజుల రాధ, కంబాల లింగవ్వ, గట్టమీది లక్ష్మి , బత్తుల సరోజ వెళ్లారు. రెండు, మూడు గంటల తర్వాత ఇంటికి చేరాల్సి ఉండగా, రాత్రి ఎనిమిది వరకు చేరలేదు. ఆయా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీ జానకీ షర్మిలతో పాటు ఎఎస్పీ రాజేష్ మీనా స్వయంగా పర్యవేక్షించారు. ఇలాంటి పరిస్థితుల్లో మేముంటాం ఎస్పీ అడవి సమీప గ్రామస్థులకు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని, తామంతా మీకు అండగా ఉంటామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. అడవిలోకి వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ఆపరేషన్‌లో సహకరించిన ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ఆర్ఐలు శేఖర్, రమేష్, ఎస్ఐలు, ఆర్‌పిసీలను అభినందించారు. టీంలో పాల్గొని ఉదయం నుండి వెతికి పట్టుకున్న స్పెషల్ పార్టీ,అన్ని ఉమెన్ స్పెషల్ పార్టీ శివంగి బృందాలను ఎస్పీ అభినందించారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని భక్తులు హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వీర హనుమాన్ ఆలయం నుండి హనుమాన్ దీక్ష స్వాములు, భజరంగ్ దళ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రను భాజపా సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ యాత్ర జిల్లా కేంద్రంలోని పలు వీధులలో జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో భక్తి గీతాలతో, యువకుల నృత్యాలతో జోరుగా కొనసాగింది. ఈ శోభాయాత్రలో ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవలక్ష్మి , భారాస నాయకురాలు మారసుకోల సరస్వతి, బిజెపి సీనియర్ నాయకులు భువనగిరి సతీష్ పాల్గొన్నారు. హనుమాన్ స్వాములకు, భక్తులకు అరిగెల నాగేశ్వర్‌రావుతో పాటు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పండ్లను, అల్పాహారాన్ని, చల్లటి త్రాగునీటిని ఏర్పాటు చేశారు. బజారు వాడి హనుమాన్ ఆలయం వద్ద భక్తులు, స్థానిక ప్రజలు అన్నదానం ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలోని నెలకొల్పిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంట వెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్‌తో ప్యాక్స్ కొనుగోలు కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** స్త్రీ, పురుష సమానత్వం కోసం అంకిత భావంతో కృషి చేసిన మహానీయుడు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబా పులే జయంతి వేడుకలకు ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవలక్ష్మి, డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాలీ కుల సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పూలే చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పూలే విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, మాజి జడ్‌పిటిసి అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ నాయక్, మాలీ కులా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సెండే వాసు, నగోషా శంకర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంగం అధ్యక్షులు రూప్ నార్ రమేష్, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు కేశవరావు, వివిధ కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఫోకస్

# సైన్స్

## ఈ ప్రశ్నకు బదులేదీ?

అనంత విశ్వంలో జీవరాశి ఉనికి ఉందా? ఈ ప్రశ్న శతాబ్దాలుగా మనిషి మెదడును తొలిచేస్తున్నది. కానీ, ఇంత వరకూ నిర్దిష్టమైన సమాధానం మాత్రం లభించలేదు. మనిషిని పోలిన జీవిని మాత్రమే ఊహిస్తున్నామేగానీ, అందుకు భిన్నంగా జీవులు ఉండే అవకాశాలు లేకపోలేదన్న కోణంలో ఆలోచనలు ముందుకు సాగడం లేదన్నది వాస్తవం. విశ్వంలో ఎక్కడైనా, మనకు తెలియని లేదా మనం ఊహించలేని వాతావరణం ఉంటే, అక్కడి జంతుజాలం మనకు పూర్తి భిన్నంగా లేదా మన ఊహకు అందని రీతిలో జీవనం సాగిస్తుండవచ్చు కదా? మనిషిని లేదా జంతువులను పోలిన జీవం ఉండకపోవచ్చు. భూమిపై జీవపరిణామం ఎలా జరిగి ఉంటుందో తెలుసుకోవడానికి ఆధునిక మానవులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. భూమి రూపొందిన తొలి 100 కోట్ల సంవత్సరాల కాలంలో ఆకాశంనుంచి వచ్చి పడే ఉల్కలూ, భూగోళం లోపల రగులుతున్న మేగ్మా, లావాల వేడిమీ వగైరాల ఉత్పాతాల కారణంగా జీవరాశి ఆవిర్భవించగలిగిన పరిస్థితులు ఏర్పడలేదు. ఆ తరవాత జరిగిన సంఘటనల గురించి శాస్త్రవేత్తలు ఊహించగలిగారు. నిర్జీవ పదార్థానికీ, సేంద్రియ (ఆర్గానిక్) పదార్థానికీ తేడా ఉంటుందనీ, తొలి జీవకణాలనేవి పునరుత్పత్తి సాధించగలిగిన జీవరసాయనిక కణాల కలయిక వల్లనే ఏర్పడ్డాయనీ, ఆ విధంగా మొదటగా తయారైన జీవకణాల సూప్ ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కుంటూ గత 300 కోట్ల సంవత్సరాలకు పైగా కొనసాగుతూ వస్తోందనీ అర్థం చేసుకున్నారు. ఇటువంటి కణాలు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో భూమిమీద రూపొంది ఉంటాయని శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తారు. అలా కాకుండా ఇవి ఆకాశం నుంచి ఉల్కలూ, తోకచుక్కల రూపంలో వచ్చి పడ్డాయనే సిద్ధాంతం కూడా ఉంది. దీన్ని ఫ్రెడ్ హోయ్‌ల్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్తా, విక్రమసింఘ అనే సింహళ పరిశోధకుడూ ప్రతిపాదించారు. విశ్వాంతరాళంలో కొన్ని రకాల జీవరసాయనిక కణాలు తేలుతూ ఉంటాయనీ, అవి గడిచిపోయిన యుగాల్లో తక్కిన గ్రహాలమీద రాలినట్టే మన వాతావరణంలోకి ప్రవేశించగా అనుకూల పరిస్థితులవల్ల ఇక్కడ నిలదొక్కుకో గలిగాయనీ వీరి ఉద్దేశం. వాదనలు, సిద్ధాంతాలు ఎలా వున్నా, ప్రస్తుత మన సౌర కుటుంబంలో మాత్రం మనం ఏకాకులమే. అందులో సందేహం లేదు. ఇతర గ్రహాలు లేదా వాటి చంద్రులపై జీవాన్వేషణ కొనసాగుతున్నప్పటికీ, ఆశాజనకమైన ఫలితాలు వెలువడలేదు. గ్రహాంతర జీవుల ఉనికి ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నగానేభావించాలి.



## అంగారకుడిపై వింత వస్తువులు?



మన సౌర మండలంలోని గ్రహమైన అంగారకుడు (మార్స్)పై వింత వస్తువులను పరిశోధకులు కనిపెట్టారు. 'లైవ్ సైన్స్' ప్రకారం అక్కడ అసాధారణంగా కనిపించే కొన్ని వస్తువులు ఉన్నాయి. భూమికి అత్యంత దగ్గర పోలికలున్న గ్రహాల్లో మార్స్ ఒకటి. కాబట్టి, అక్కడ జీవజాలం ఉండవచ్చన్న అభిప్రాయం శాస్త్రవేత్తల్లో ఉంది. దశాబ్దాలుగా ప్రయోగాలు, అధ్యయనాలు కూడా జరుగుతున్నాయి. అయితే ఇప్పటి వరకూ అలాంటి సూచనలేవీ కనిపించలేదు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా', ఇతర అంతరిక్ష సంస్థలు రోబొటిక్ టెక్నాలజీని ఉపయోగించి, 'రెడ్ ప్లానెట్' ఉపరితల వాతావరణాన్ని అధ్యయనం చేస్తున్నాయి. అదే విధంగా మార్స్ ఉపరితల నిర్మాణం, ఆకృతులను కూడా విశ్లేషిస్తున్న క్రమంలో ఈ వింత వస్తువులను గుర్తించారు. ఇవి ఏమిటనే ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నం జరుగుతున్నది. ఈ వస్తువులు ధూళి గ్రహానికి చెందినవి కావని, వీటిలో చాలా వరకు పరేడోలియా ఫలితంగా ఏర్పడినవేనని అభిప్రాయపడుతున్నారు. అంగారకుడిపై నీటి ఆనవాళ్ల కోసం జరిగిన దశాబ్దాల అన్వేషణ ఫలితాన్ని ఇవ్వలేదు. కాగా, అక్కడ కనిపిస్తున్న వస్తువుల్లో పుస్తకాన్ని పోలిన ఆకారం ఉంది.దీనిని రాయిగా భావిస్తున్నారు. ధూళి లేదా వాయువులతో నిండిన గ్రహంపై రాయిలాంటి వస్తువు ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదు. అరిజోనా విశ్వవిద్యాలయం (UA) జనవరి 2023లోవిడుదల చేసిన ఒక చిత్రంలో, మార్టిన్ టెడ్డీ బేర్ ముఖాన్ని పోలిన ఆకారం కనిపించింది. రెండు పూసల కళ్ళు, ఒక బటన్ ముక్కు . పైకి తిరిగిన నోటితో నవ్వుతున్నట్టు కనిపిస్తున్న ఈ ఆకార్యం విస్తుగొలుపుతున్నది. ఘనీభవించిన ఖనిజ పుష్పాల మాదిరి కనిపిస్తున్న వస్తువు కూడా వింతగా ఉంది. ఇటువంటి ఖనిజ నిక్షేపాలు అంగారక గ్రహం అంతటా ఉన్నాయనే వాదనను బలోపేతం చేస్తున్నది. అదే నిజమైతే, ఈ వాతావరణం నీరు, పచ్చదనానికి కేంద్రకం కావచ్చు. రెడ్ ప్లానెట్‌పై తెలివైన గ్రహాంతర వాసుల జీవితానికి ఉనికిగా పేర్కొంటున్న 'ద్వారం' ఈ వింత వస్తువుల్లో ఉంది. రహస్య మార్స్ బంకర్‌లలో క్యాంప్ చేసిన మానవ వ్యోమగాముల రహస్య సమాజానికి సంకేతంగా కొంతమంది దీనిని పేర్కొంటున్నారు. గ్రహాంతర జీవులు ఒకప్పుడు అంగారక గ్రహ ఉపరితలం మీదుగా స్కిటర్ చేసి, శిలాజ ట్రాక్‌లను రాళ్లలో పొందుపరినట్టు శిలాజ జంతు జాడలు అనుమానం కలిగిస్తున్నాయి. కర్రల మాదిరి కనిపించే బియ్యం గింజ పరిమాణంలో ఉన్న పదార్థం లవణం కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ అంచనా నిజమైతే, మార్స్‌పై ఒకప్పుడు నీరు ఉండేదన్న వాదన నిజమవుతుంది. నాసా ప్రయోగించిన ఆపర్చునిటీ రోవర్ గుర్తించిన ఇనుముతో కూడిన గోళాలు బిలియన్ సంవత్సరాల క్రితం సమృద్ధిగా ఉన్న నీటి ఒత్తిడి కారణంగా నునువు తేలినట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇక మార్టిన్ దక్షిణ ధ్రువం దగ్గర నిద్రాణ స్థితి నుండి వేలకొద్దీ 'స్విర్లీ బ్లాక్ స్పైడర్స్' ఆకారాలు కనిపించాయి. అయితే, ఇవి సజీవమైనవి కావు. కాలానుగుణంగా వాతావరణం వేడెక్కినప్పుడు, కార్బన్ డయాక్సైడ్ మంచు సబ్లిమేటింగ్ లేదా వాయువుగా మారడం వల్ల ఏర్పడిన ఆకారాలుగా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ) ప్రకటించింది. మార్టిన్ దక్షిణ ధ్రువం సమీపంలో విశాలమైన, పురాతన నగరం యొక్క శిథిలాల మాదిరి కనిపించే ఆసక్తికరమైన నిర్మాణాలు ఉన్నాయి. 53 మైళ్ళు (86 కిమీ) వ్యాసం కలిగిన ఒక పెద్ద వృత్తంలో భాగంగా ఉన్న ఈ నిర్మాణాలు యుగాల క్రితం జరిగిన ఉల్కాపాతం నుండి చాలా పెద్ద ప్రభావ బిల భాగమని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. ఇలాంటి పలు రకాల వస్తువుల ఉనికిపై ఉదయిస్తున్న ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానం ఇవ్వడం ఖాయం. అప్పటి వరకూ కొంత సస్పెన్స్ తప్పదు.





## రంగులు వెదజల్లుతున్న 'రోసెట్టే'



వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా కనిపించే రోసెట్టే నెబ్యులాను కాల్డల్ 49 అని కూడా పిలుస్తారు. పాలపుంతలోని మోనోసెరోస్ ప్రాంతంలో ఉన్న అతిపెద్ద పరమాణు మేఘం చివరిగా ఉన్న హెచ్ II ప్రాంతమే ఈ రోసెట్టే నెబ్యులా. న్యూ జనరల్ కేటలాగ్ (ఎన్‌జిసి) జాబితాలో, ఓపెన్ క్లస్టర్ ఎన్‌జిసి 2244 (కాల్డల్ 50) నెబ్యులోసిటీతో రోసెట్టేకి దగ్గరి సంబంధాలున్నాయి. ఈ క్లస్టర్‌లోని నక్షత్రాలు నెబ్యులా పదార్థం నుండి ఏర్పడ్డాయి. మానవ పుర్రెను గుర్తుకు తెచ్చే ఆకారం ఉన్న కారణంగా దీనిని 'స్కల్ నెబ్యులా' అని పిలుస్తారు. ఎన్‌జిసికి సంబంధించిన ప్రాంతాలకు నంబర్లను జతకలిపి ప్రస్తావిస్తారు. వీటిలో ఎన్‌జిసి 2237 – నెబ్యులస్ ప్రాంతంలో భాగం (మొత్తం నెబ్యులాను సూచించడానికి కూడా ఉపయోగిస్తారు). ఎన్‌జిసి 2238 – నెబ్యులస్ ప్రాంతంలో ఒక భాగం, ఎన్‌జిసి 2239 – నెబ్యులస్ ప్రాంతంలో ఒక భాగం. దీనిని జాన్ హెర్షెల్ కనుగొన్నాడు. ఎన్‌జిసి 2244 – నెబ్యులా లోపల ఉన్న ఓపెన్ క్లస్టర్ 1690లో జాన్ ఫ్లామ్‌స్టీడ్ దీనిని తొలుత గుర్తించాడు. ఎన్‌జిసి 2246 – నెబ్యులస్ ప్రాంతంలో ఒక భాగం. క్లస్టర్, నెబ్యులాలు భూమి నుంచి సుమారు 5000 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. వీటి వ్యాసం 130 కాంతి సంవత్సరాలు. యువ నక్షత్రాల నుండి వచ్చే రేడియేషన్ నెబ్యులాలోని అణువులను ఉత్తేజపరుస్తుంది. దీనివల్ల అవి స్వయంగా రేడియేషన్‌ను విడుదల చేస్తాయి. మనం చూసే ఉద్గార నిహారికను ఉత్పత్తి చేస్తాయి. నెబ్యులా ద్రవ్యరాశి సుమారు 10,000 సౌర ద్రవ్యరాశి ఉంటుందని అంచనా. మూన్ ఎక్స్‌రే అబ్జర్వేటరీతో నెబ్యులాపై జరిపిన సర్వేలో ఆప్టికల్ రోసెట్ నెబ్యులా లోపల దట్టమైన పరమాణు మేఘంలో నిండిన అనేక నవజాత నక్షత్రాలు ఉన్నాయని వెల్లడైంది. మొత్తంగా, సుమారు 2500 యువ నక్షత్రాలు ఈ నక్షత్రఏర్పడే సముదాయంలో ఉన్నాయి. నిరంతరంగా కొనసాగుతున్న నక్షత్రనిర్మాణ కార్యకలాపాలలో ఎక్కువ భాగం ఈ బుడగలోని ఆగ్నేయం ప్రాంతంలోని దట్టమైన పరమాణు మేఘంలో జరుగుతోంది. బుడగలోని నక్షత్రాల మధ్య విస్తరించిన ఎక్స్‌రే గ్లో కూడా కనిపిస్తుంది. ఈ పరిణామాలే రోసెట్టే నెబ్యులాకు ఆకర్షణీయమైన కాంతులను సంతరించిపెట్టాయి.



## ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

### బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జాడి పోశం




**ప్రజాపక్షం/మంచిర్యాల :** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని టిఎస్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జాడి పోశం అన్నారు. జిల్లా మూడవ మహాసభల విజయవంతం కోసం శుక్రవారం మంచిర్యాల పట్టణంలో లేబర్ అడ్డా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాడి పోశం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో వేలాది మంది సభ్యులుగా ఉన్నారని, హక్కులను కాపాడేందుకు కార్మికుల ఐక్యత అవసరమని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల జీవనానికి అవసరమైన ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బోర్డులో ఉన్న నిధులను ఇతర అవసరాలకు కాకుండా కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు శాతం సుమన్, పట్టణ కార్యదర్శి పొనగంటి ఏసేపు, చీకటి సత్యనారాయణ, కోశాధికారి గోశిక స్వామి, కొంకల రాజేష్, మామిడి గోపి , బండారి సత్తయ్య, దుర్గం సుధాకర్ పాల్గొన్నారు.

## వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధర పెంపుతో సామాన్యులపై భారం



**ప్రజాపక్షం/ఇల్లందు :** వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై ఆర్థికభారం పడుతుందని, కేంద్రప్రభుత్వం పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో గ్యాస్‌బండను వీపున మోస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50లు పెంచి పేద, మధ్య తరగతి, సామాన్య పెనుభారం వేసిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గించినప్పటికీ భాజపా ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని, పదకొండేళ్ల పాలనలో వంటగ్యాస్ ధరలు అనేకమార్లు పెంచుతూ మహిళలను మళ్లీ కట్టెలపొయ్యివైపు మళ్లించేలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శి ఉడత ఐలయ్య, మాజీ వైస్ ఛైర్మన్ బాస శ్రీనివాస్, మాజీ కౌన్సిలరర్ కుమ్మరి రవిందర్, బొప్పిశెట్టి సత్యనారాయణ, తాండ్ర లక్ష్మీనారాయణ, మంచాల వెంకటేశ్వర్లు, కె.నగేశ్, బొల్లి కొమరయ్య, బొల్లి కొమరయ్య, సాంబమూర్తి, రాందాస్, ఎస్.కె.వలీ, నెల్లి కొమరయ్య, యాదగిరి, సుశీల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిభాపూలే ఆశయసాధనకు పోరాడుదాం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

### ఘనంగా జ్యోతిభా పూలే జయంతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిభాపూలే ఆశయసాధనకు పోరాడదామని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిబాపూలే కొనియాడారు. సమానత్వం లేని కాలంలో సత్యశోధక సమాజాన్ని ఏర్పాటు చేసి సమానత్వానికి కృషి చేశారన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా, సంఘసంస్కర్తగా సేవలందించారని తెలిపారు. స్వాతంత్ర్యం సాధించి 79 సంవత్సరాలైనప్పటికీ ఇంకా సమాజంలో కుల వివక్షత, రెండు గ్లాసుల విధానం అక్కడక్కడ అంటరానితనం ఉందని, వీటిని రూపుమాపేందుకు, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్య, మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమన్నారు. సామాజిక ఉద్యమకారునిగా, కుల వివక్షతకు వ్యతిరేకంగా, అన్ని వర్గాల సమానత్వానికి కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, నాయకులు గాదె లక్ష్మినారాయణ, నూనె శశిధర్, తాటి నిర్మల, జ్వాలా నర్సింహారావు, మేకల రవికుమార్, పోటు పూర్ణచందర్‌రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.




**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మహాత్మా జ్యోతిభాపూలే జయంతిని శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ్మ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు చదువు చెప్పించాలని, ముఖ్యంగా మహిళలకు చదువునేర్పించాలనే తపనతో తనభార్య సావిత్రిబాయిపూలేతో కలిసి మొట్టమొదటి బాలికల పాఠశాల ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి గోపిచారి, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మిపతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధుగౌడ్, జిల్లాసహాయ కార్యదర్శి శివకృష్ణ, బాలపీరు, శ్రీను, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.


**మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహాత్మా జ్యోతిభాపూలే భారత ఆత్మగౌరవ శిఖరంగా వెలుగొందారని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా సురవరం వెంకటరామిరెడ్డి భవన్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, రాజశేఖర్, గణేష్, బాలరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ ప్రతినిధి :** బహుజన వర్గాలకు విద్యను అందించి సామాజిక చైతన్యంతో అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం చేసిన బడుగుల విప్లవ జ్యోతి మహాత్మాజ్యోతిబా పూలే అని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ కొనియాడారు. శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని బికెఎంయు ఆద్వర్యంలో కోతిరాంపూర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ జ్యోతిబా పూలేకుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానుభావుడని, మహిళలు చదువుకోవాల్సిందేనని పట్టుబట్టి వారి కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కూన రవీందర్, నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.









## 'వర్కర్ టూ ఓనర్' ప్రారంభించాలి

### ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడారి రాములు, అజ్జ వేణు డిమాండ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేతన ఒప్పందం ప్రకారం కూలీ ఇస్తూ, బోనస్ చట్టం అమలు చేసి, వర్కర్ టూ ఓనర్ పథకం అమలు చేయాలని, విద్యుత్ సమస్య పరిష్కరించి పవర్లూమ్స్ త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుభాష్ నగర్ ఎఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. యారన్ సబ్సిడీ 10 శాతం వెంటనే చెల్లించాలన్నారు. అన్నిరకాల పవర్ లూం సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస సౌకర్యాలైన మంచినీటి సౌకర్యం, టాయిలెట్‌ల సౌకర్యం కార్మికులకు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కెవి అనసూయ, మీసం లక్ష్మణ్, గాజుల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.




## దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు ఆపాలి

### ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగసభ కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న బహిరంగ సభ కరపత్రాన్ని శుక్రవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. సంధర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ అడవులలో కోట్లాది అటవీ, ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడానికి 1990 నుంచి 2025 వరకు ఆపరేషన్ జన జాగరన్ అభియాన్, సల్వాజుడుం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ ఆనకొండ, చివరకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే ఆరు నెలల పసిగుడ్డు మంగ్లీ సోడి మొదలు రేణుక మిడ్కో వరకు దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. దీన్ని అడ్డుకోడానికి ఆదివాసీలకు అన్నివర్గాల ప్రజలు, దళితులు, మేధావులు, హక్కుల కార్యకర్తలు అండగా ఉండాలని కోరారు. భూమి, భుక్తి, విముక్తి , ఆత్మగౌరవం కోసం జరిగిన ఇంద్రవెల్లి పోరాటంలో ఆదివాసులపై జరిగిన హత్యకాండను నిరసిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆద్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తుందని తెలిపారు. ఈసభకు వక్తలుగా వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి. సిఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు, సిపిఐ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కట్ట విశ్వనాథ్, సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, రైతులు, రైతు కూలీలు, కార్మిక కర్షక, మహిళా యువజన, విద్యార్థి నాయకులు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కొయ్యడ సృజన్ కుమార్, విరసం బాలసాని రాజన్న, సిఎల్‌సి బొడ్డుపల్లి రవి, డిహెచ్‌పిఎస్ తాళ్లపల్లి లక్ష్మణ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రైతులు ఆర్థిక ప్రగతి సాధించేందుకు సహకార సంఘాలు కృషి

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** నిరుపేదలు, రైతులు ఆర్థిక ప్రగతి సాధించేందుకు సహకార సంఘాలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో సహకార సంఘాల కార్యకలాపాల పని తీరును అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వివిధ వృత్తి కుటుంబాలను బలోపేతం చేసేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా సహకార సంఘాలు, పాల ఉత్పత్తి దారుల సంఘాలు, మత్స్యసహకార సంఘాలు, కల్లుగీత కార్మిక సంఘాల ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సరిత, జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/గణపురం:** భూపాలపల్లి జిల్లా కేంద్రం లో పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని గణపురం ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. శుక్రవారం గణపురం మండలంలోని గాంధీనగర్, మైలారం గ్రామాలలోని నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 15 లోపు గూగుల్ ఫామ్, క్యూఆర్ కోడ్ ద్వారా పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఈ జాబ్ మేళాకు 18 నుండి 35 సంవత్సరాల వయసుగల చదువుకున్న చదువు లేని నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని ఎస్సై రేఖ అశోక్ తెలిపారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి జిల్లా అభివృద్ధికి కృషి




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశ కమిటీ చైర్పర్సన్ కడియం కావ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, డీఆర్డీఏ వసంతలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరిలతో కలిసి ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా సంఘసంస్కర్త జ్యోతిబా పూలే 199వ జయంతిని పురస్కరించుకుని వారందరు కలిసి జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుని జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నాలాల మరమ్మత్తులపై చర్యలు చేపట్టాలని, అప్పుడే రైతుకు మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో గోపిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు కాంగ్రెస్ రైతు ప్రభుత్వమే



**ప్రజాపక్షం/మరిపెడ:** నాడు నేడు ఎప్పటికీ కాంగ్రెస్ రైతు ప్రభుత్వమేనని, రైతు సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి ధాన్యం కొనుగోలు కేంద్రం, రాంపురంలో జీవనజ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా, రైతు రుణమాఫీ సన్నాలకు బోనస్ రూపేణ సుమారు రూ.4కోట్లు వరకు లబ్ధి చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నటికీ రైతు పక్షపాతి అని గత ప్రభుత్వంలో మాదిరి దళారులంతా కొన్నాక కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, కాంగ్రెస్ నిజం అధికారాన, రైతు పరిశీలకులు మొదలు పెట్టిన నాటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివర గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు పది రోజుల్లోపు వారి ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పెండ్లి శ్రీనివాస్‌రెడ్డి, రామసహాయం జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కొట వెంకటరెడ్డి, గండి వీరభద్రం, గండి రమేష్, ఎల్లంపేట, రామాపురం సిపిలు గండి రజిత శ్యాం, రాంపల్లి వెంకన్న, సంఘ సభ్యులు ధనమ్మ, స్వప్న, కవిత, స్వర్ణాల, గండి మంజుల, సైదులు ఎపి వీరసింగ్, ఎపిఎం రాములు, ఏఈఓ సాయిశృతి, తదితరులు పాల్గొన్నారు.


## అంగన్ వాడికి తాళం.. స్కూలుకు రాని టీచర్...



**ప్రజాపక్షం/రేగొండ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రాయపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ కు తాళం వేసి ఉండగా పిల్లలు ప్రైమరీ స్కూలు వరండాలో ఉండడం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాయపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ కొడగాని శ్రీలత తమ ఉద్యోగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఏనాడు టైముకు రాదు అని పిల్లలను అసలు పట్టించుకోదని నిమిషం గంటలకు స్కూలు ప్రారంభం అయితే 10 గంటలకు స్కూలుకు వస్తుందని టీచరు అలసు దొబ్బిన ఆయమ్మ రాఘవ భద్రమ్మ అదే తంతుగా వ్యవహరిస్తుందంటూ పిల్లల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నామని ఆరోపిస్తున్నారు. ఉదయాన్నే పిల్లలను స్కూల్లో వదిలిపెట్టి పనులకు వెళ్లే రైతులు టీచరు, ఆయాలు ఉంటారని భరోసాతో వదిలి వెళ్తున్నామని పిల్లోడ తండ్రి బత్తిని కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రోజు నేను వచ్చేటప్పటికి టీచరు స్కూల్లో ఉండదు అని ఆమె వచ్చేటప్పుడే వస్తుందని అదే విధంగా వారం రోజుల నుంచి పిల్లలకు గుడ్డు పెట్టడం లేదని టైం కు అన్నం కూడా పెట్టడం లేదని ఆరోపించారు. పిల్లల ఆలన పాలన చూసుకునే ఆయా,టీచర్ అమ్మలు సమయానికి రాకుంటే పిల్లల పరిస్థితి ఏంటి అని కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాల్సిన టీచర్ ఆయమ్మలు సమయం తప్పి 10 గంటల దాకా రాకపోవడం అంగన్వాడి సెంటర్ కు తాళం వేసి ఉండడంతో పిల్లలు ప్రైమరీ స్కూలు వరండాలో నిద్రిస్తున్నారని కనీసం గ్రాగురుకు ఇచ్చే పరిస్థితి కూడా లేదు అని అసలే ఎండాకాలం పూట మా పిల్లల పరిస్థితి ఏంటి అని కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా టీచర్,ఆయమ్మలు మా పిల్లలు పట్ల శ్రద్ధ వహించి చూసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన

**రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్ల నిధులు కేటాయింపు : ఎంపి,ఎమ్మెల్యేలు**



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్ల నిధులు కేటాయించిందని, 70 ఏళ్ల క్రితం నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో స్థాపితమైన ఈ చారిత్రక కళాశాలకి నూతన భవన నిర్మాణం జరగడం తన ఎమ్మెల్యే పదవిలో జరుగుతుండటం గర్వకారణమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. త్వరలోనే ఆధునిక సదుపాయాలతో కూడిన అద్భుతమైన కళాశాల భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, కుడా ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఐఏఎస్, స్థానిక 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి ,కళాశాలపూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈ వి శ్రీనివాస్ రావు, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ నరేందర్ రెడ్డి, డీఈ రవీందర్ రెడ్డి, ఏఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్యను అందించేందుకు తన జీవితాన్ని అర్పించిన మహనీయుడు పూలే జయంతి రోజున ఈ నూతన భవనానికి భూమి పూజ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, కోశాధికారి ఆనంద్ కుమార్, పూర్వ విద్యార్థులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ధర్మ శ్రీనివాస్ రెడ్డి, ఈ. శ్రీనివాస్ రావు, మహేందర్ రెడ్డి,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత రైతు యాలంకు పరామర్శ



**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా మంగపేట మండలంలో మల్లూరు గ్రామపంచాయతీ మొట్లగూడెంలో అకాల వర్షంతో వడగండ్ల వానతో వరి పంటతో అపార నష్టం చవిచూసిన రైతు యాలం నర్సింహారావు ఆవేదనకు లోనై చేసేది ఏమిలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు అతన్ని హన్మకొండలో మాక్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా శుక్రవారం రాష్ట్ర మంత్రి సీతక్క ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ లను కలసి పలు సూచనలు ఇచ్చి నర్సింహారావు వద్దకు వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని తక్షణ సహాయంగా 20 వేల రూపాయలు అందజేసి తొందరగా ఆరోగ్యం కుదుట పడి ఇంటికి చేరుకోవాలని అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. ఎవ్వరైనా తొందరపడి ఆగహిత్యలకు పాల్పడవద్దని మంత్రి సీతక్క రైతులను వేడుకున్నారు.

**రైతులకు నష్టపరిహారం చెల్లించాలి**

మంగపేట మండలంలో అకాల వడగండ్ల వానతో వరి పంట వేసిన రైతులు అకాల వర్షం అపార నష్టంతో దుఃఖంలో ఉండి చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డ యాలం నర్సింహారావు ను మాక్స్ కేర్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు భారీ వర్షంతో వరి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.

## గొప్ప సంఘసంస్కర్త ...




**ప్రజాపక్షం/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి పట్టణంలోని స్థానిక భగత్ సింగ్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు నిర్వహించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిబాపూలే మహిళల కోసం దేశంలోనే మొట్ట మొదటగా పాఠశాలలు ప్రారంభించిన గొప్ప సంఘసంస్కర్త అని ప్రవీణ్ కొనియాడారు. మను ధర్మానికి వ్యతిరేకంగా మనుషులంతా సమానమని అనేక పోరాటాలు నిర్వహించిన మహాత్ముడు అని అన్నారు. సావిత్రి బాయి పూలె ను పెళ్లి చేసుకుని అనేక సంఘసంస్కర్త కార్యక్రమాలను నిర్వహించారు.మహాత్మ పూలే రచించిన మహత్తర గ్రంథం గులాంగిరి సమాజంలో వెనుకబడినవర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతికోసం చేసిన కృషికి ఆయనకు మహాత్మ బిరుదు ఇచ్చారు తెలిపారు. ప్రతి ఒక్కరూ జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకొని సమసమాజన స్థాపన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నేరెళ్ల జోసెఫ్, యాకూబ్ పాషా, ఆనందపు రవి, ధరావత్,ఇటుకల శ్రీలత, పల్లెల రజిత, పెద్దమాముల సంధ్య,పోతుగంటి స్వప్న, వాసం రజిత, చిట్యాల పద్మ, ఎండీ నాజీయా తదితరులు పాల్గొన్నారు.

## సమాజం కోసం పోరాడిన మహనీయుడు...

**మంత్రి సురేఖ, ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు కలెక్టర్లు**



**ప్రజాపక్షం/హనుమకొండ:** సమాజంలో అన్ని వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయులలో మహాత్మా జ్యోతిబా పూలే ఒకరని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు జంక్షన్ లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి కే ఆర్ నాగరాజు,కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి ఉద్యమిస్తూ భవిష్యత్ తరాలకు మార్గం చూపిన మహనీయుల్లో జ్యోతిబాపూలే ఒకరని పేర్కొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు, విద్యా విషయంలో పూలే దంపతులు చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. సమానత్వం కోసం వారు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని చెప్పిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వెంకటాపూర్ మండంలోని పాపయ్య పల్లి గ్రామంలో గత సోమవారం కురిసిన వడగండ్ల వాన బీభత్సంలో నేల కొరిగిన మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి శైలజ క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందేవిధంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి తగు న్యాయం చేస్తామని అన్నారు. ఏఈఓతో నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మేకల రవి, సూత్రపు కర్ణాకర్, మూడేళ్ల ఓదెలు, గాజుల రవి, మల్యాల కొమురయ్య, వాసాల భద్రయ్య, గాజుల సదయ్య, మల్యాల సాయిరాం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలో రేషన్ కార్డుదారుడు సిరబోయిన క్రాంతి కుమార్ కుటుంబ సభ్యులు పద్మ, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ శాఖ అధికారి విశాల్, తదితరులతో కలిసి మంత్రి సీతక్క సన్నబియ్యం భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి పేద ప్రజలకు మహిళలకు అన్ని రవర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటోందన్నారు. గుంజేడు ముసలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేక కార్యచరణతో పనులు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని, చుట్టుప్రక్కల అడవిని పెంపొందించాలని మంత్రి సూచించారు. కొత్తగూడ మండలం గాంధీనగర్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించి మంత్రి సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలతో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ అధికారి విశాల్, ఆర్‌డిఓ కృష్ణవేణి,డిడబ్ల్యుఓ ధనమ్మ, డిఆర్‌డిఓ పిడి మదుసూధన్‌రాజు, స్థానిక తహసీల్దారు రమాదేవి, ఎంపిడిఓ రవీంద్రప్రసాద్, డిఎస్ఓ ప్రేమ్‌కుమార్,డిఎం సివిల్ సప్లయి కృష్ణవేణి, మండల ప్రత్యేక అధికారి వేముల సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తి


**కలెక్టర్ ప్రావీణ్య**



**ప్రజాపక్షం/హనుమకొండ:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మాణ దశలో ఉన్న సెమినార్ హాలు పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ సందర్శించారు. గ్రంథాలయానికి సంబంధించి సెమినార్ హాల్ నిర్మాణ దశలో ఉండగా పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి వివరాలను అధికారులు కలెక్టర్ వివరించారు. అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రంథాలయంలోని అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయ సెమినార్ హాల్ నిర్మాణ పనులలో జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులు నాణ్యతగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, ఈఈ నరేందర్ రెడ్డి, డిఈ జలీల్ ఖాన్, జిడబ్ల్యుఎంసి డిఈ రవికుమార్, పాల్గొన్నారు.

## బిజెపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నది

**రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఛైర్మన్ అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, పిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి..**



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం కు రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఛైర్మన్ అనిమిరెడ్డి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిమిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆదరణ చాలా ఉందని చిన్న పెద్ద తేడా లేకుండా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నారని అన్నారు. గత పది ఏళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ఆ ప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, దామెర గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు ఠాగూర్ రామ్ సింగ్ , హనుమకొండ ఎస్సీ సెల్ ఛైర్మన్ గొర్రె మహేందర్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు భీమ్ రాజ్, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ గొర్రె మహేందర్, మాజీ మండల అధ్యక్షులు సంతాజి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ గోలి రాజేశ్వరరావు, గోడిశాల యాదగిరి గౌడ్, పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్,మహిళా అధ్యక్షురాలు సుష్మ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్తూరి రత్నాకర్, సిద్దిపేట మాజీ యూత్ ప్రధాన కార్యదర్శి మంద సుమన్, చల్లూరి వేణు, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు గోడిశాల అర్జున్ గౌడ్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు గోడిశాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోషక లోపాలను తగ్గించడానికి కృషి

**కలెక్టర్ రాహుల్ శర్మ**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి:** నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పోషణ పక్వాడ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధులు మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలు పోషణ పక్వాడ కార్యక్రమాల షెడ్యూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా అంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న చిన్నారుల పెరుగుదలను నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. నిర్దేశిత మాడ్యూల్ ప్రకారం పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించడానికి కృషి చేయాలని తెలిపారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని తెలిపారు. గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చేవరకు ప్రతి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. తీవ్ర, అతితీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డిపిఓ నారాయణ రావు, డిఆర్డీఓ నరేష్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, బిసి, ఎస్సి సంక్షేమ అధికారులు శైలజ, సునీత, డీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఎంపి కార్యాలయంలో చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఖమ్మం ఎంపి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా 28 మంది లబ్ధిదారులకు రూ. 10.70 లక్షల చెక్కులను కార్యాలయ ఇం చార్జి కొప్పుల చంద్రశేఖర్ బాధితులకు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థిక వెసులుబాటు కోసం ఎంపి రఘురాంరెడ్డి సిఫారసు



మేరకు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు షేక్ ఇమామ్‌బాయ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సిపిఐ ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపులో భాగంగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 12న అన్ని మండల, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. బిజెపి లౌకిక వాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని సురేష్ ఆరోపించారు. మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన ఎన్నికల్లో లబ్ధి పొందెందుకు మాత్రమే ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట క్రమంలో ఈ ఆందోళనను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకత్వం అన్ని మండలాల్లో ఆందోళనలు జరిగేవిధంగా చూడాలని ఆయన కోరారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజల కోసం ఉచిత వైద్య శిబి రం ఏర్పాటు చేయడం అభిన ందనీయం అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మ ండలంలోని కాచిరాజుగూడెంలో ది ఆంధ్ర బ్యాంక్ కర్షక సేవా సహకారం సంఘం లిమిటెడ్‌ఖమ్మం వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకర సంవత్సరం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసన సభలో ఆయన మాట్లాడారు... ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో దోహదపడతాయని, సంఘం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను విస్తతంగా నిర్వహించాలన్నారు. ఈ శిబిరంలో రైతులు, ప్రజలు కలిపి మొత్తం 169మంది పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ బిరెడ్డి నాగచంద్రారెడ్డి, ఖమ్మం జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ కళావతి భాయ్, ప్రవీణ్ ఇఎన్‌టి హాస్పిటల్, ఐహాస్పిటల్, తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లందు:** ఇల్లందు సబ్‌డివిజినల్ పోలీసు అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబాలకు మాక్స్‌విజన్ ఖమ్మం వైద్యులు శరత్, నరేందర్‌లు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక అయితాఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేకంగా పోలీసు సిబ్బందికి, కుటుంబాలు 80మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, కంటికి సంబంధించిన ప్రథమచికిత్సలు నిర్వహించామని, ఎక్కువ సమస్యలు ఉన్న వారిని ఖమ్మంలోని శరత్ మాక్స్ విజన్ వైద్యుల ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోడిఎస్‌పిచంద్రభాను,ఇల్లందు,సిఐలు,ఎస్‌ఐలు,సిబ్బందిపాల్గొన్నారు.

## 5లోగా అగ్నివీర్‌కు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అగ్నివీర్ ఎంపిక పరీక్ష కోసం జిల్లాలోని నిరుద్యోగ అవివాహిత యువకులు ఏప్రిల్ 25లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరిల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ (క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్ ), అగ్నివీర్ ట్రేడ్‌మెన్‌కు పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏమైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చునని అదేవిధంగా ఐటిఐ, డిప్లొమా, ఎన్‌సిసి అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఉంటాయన్నారు. 13 భాషలలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో చేపట్టడం జరుగుతుందని అభ్యర్థులు www.joinindianarmy. nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ పేర్లను ఏప్రిల్ 25లోగా నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ తదుపరి జూన్ 2025లో సంబంధిత వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులు పొందవచ్చునని ఆమె తెలిపారు. అప్‌డేట్స్ కోసం వెబ్‌సైట్, అభ్యర్థులు వారి ఈమెయిల్ ఐడిని పరిశీలించాలని, మెరిట్ ప్రకారం ఎంపిక ఉంటుందని ఆమె తెలిపారు.వివరాలకు సికింద్రాబాద్‌లోని రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఫోన్‌నెం. 04027740205ను సంప్రదించాలని కోరారు.


## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:**మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో రైతులకు విద్యుత్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు ఏర్పాటు చేసిన నూతన 25కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వైరా డిఇ బండి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా ఉండేందుకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం మీనవోలు గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేక విద్యుత్ అందని వారికి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయగా వాటిని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు చేతుల మీదుగా ప్రారంభించటం జరిగిందవి ఈ క్యాక్రమంలోమధిర ఎడిఇ ఎం.అనురాధ, ఎఇజి అనూష, విద్యుత్‌శాఖ సిబ్బంది పుల్లయ్య, మాజీసర్పంచ్ , తదితరులు పాల్గొ న్నారు.

## అంగన్వాడీ కేంద్రాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ కవిత సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి అంగన్వాడీ కేంద్రాలలో క్రవారం పోషణ పక్షంకార్యక్రమంను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసనా కార్యక్రమంను నిర్వహించారు.అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారంను తీసుకోవాలని సూచించారు. ఆ రోగ్యకరమైన వంటలను తినాలని అన్నారు.కార్యక్రమంలో సూపర్వైజర్ పి. నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లులు తది తరులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దంపతులు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్దిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ దపంతులు శుక్రవారం దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సిబ్బంది, అర్చ కులు దేవాలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఎన్వి రమణ మాట్లాడుతూ ఆలయానికి వస్తే ఎంతో ప్రశాంత వాతావరణం ఉండేలా ఆలయ అధికారులు ఆలయ ప్రాంతంలో గ్రినరీ ఏర్పాటు చేస్తే భక్తులకుఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ,ధర్మకర్త,ప్రధానఅర్చకులు,అర్చకులు,ఇతరఆలయసిబ్బందిపాల్గొన్నారు.

# గత పాలకులు చేయని అభివృద్ధిని చేసి చూపించాం..

*ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతీ పేదవాడికి న్యాయం

*రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/మణుగూరు:**గత పది సంవత్సరాలలో చేయని అభివృద్ధి మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 15 నెలల్లో ఆర్థిక పరిస్థితి సహకరించక పోయిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడ తగ్గనీయకుండా అభివృద్ధితోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలను సంక్షేమ కార్యక్రమాలను ప్రతి పేదవాడికి అందే విధంగా ఇస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మా ఇందిరమ్మ హయాంలో చేసి చూపెడుతున్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు లోని పినపాక శాసనసభ్యులు క్యాంప్ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇందిరమ్మ ప్రభుత్వ సహాయం లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని, పేద వాళ్లే కావచ్చు ధనికులు కావచ్చు పది లక్షల రూపాయల వరకు పేదవాడికి జబ్బు చేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య కార్డు ద్వారా ఉచితంగా వైద్య సదుపాయం కల్పిస్తున్నామని,500 రూపాయలకే ఉచిత గ్యాస్ పథకం, వాటితో



పాటు రాజీవ్ యువ వికాస కార్యక్రమం ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నిరుద్యోగ యువకులకు 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు అందించే కార్యక్రమాన్ని ఈనెల 14 తేదీ అంబేద్కర్ జయంతి రోజు ప్రారంభిస్తున్నామని, ప్రతి పేద కుటుంబాలు తృప్తిగా సన్న బియ్యం తోటే భోజనాలు చేయాలని ఉగాది పండుగ రోజున ఈ బహుత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని, మా ప్రభుత్వము వస్తే రైతులను రాజుని చేస్తామని వాగ్దానం చేశామని, అన్నమాట ప్రకారం 2 లక్షల రూపాయల వరకు రైతన్నలకు రుణమాఫీ చేశామని 25 లక్షల 65 వేల మందికి 687 కోట్ల రూపాయలని రైతు రుణమాఫీ చేసి సన్న వడ్లు పండించే రైతన్నలకు ఎకరానికి 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. త్వరలో పినపాక నియోజకవర్గానికి 3500 ఇండ్లు అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతమైన ఈ ప్రాంతంలో ఎప్పటినుండో పరిష్కరించకుండా ఉన్న పులుసు బొంత ప్రాజెక్టును రాబోయే కొద్ది నెలల లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ నెల 14 నాడు అంబేద్కర్ జయంతి రోజు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిల్పారామంలో సాయంత్రం ఐదు గంటలకి భూభారత చట్టాన్ని ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఏదైతే ఒక మైలురాయిగా పేదవాడికి కష్టంతో సంపాదించుకున్న భూములను భద్రత కల్పించే ఒక అద్భుతమైన భూభారతి చట్టం 2025 ని అన్ని జిల్లా కలెక్టర్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఈ సభకి ఆహ్వానించి, రాష్ట్రంలోనీ మారుమూల ప్రాంతంలో ఉండే భూములను ఆసాములకు ద్వారా మనస్ఫూర్తిగా ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ఎంతమంది, ఎన్ని శక్తులు, కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజల దీవెనలు ఉన్నంతకాలం ఈ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దారి మళ్ళుతున్న సన్నబియ్యం





**ప్రజాపక్షం/సత్తుపల్లి:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం దారి మళ్ళుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతలపూడి మండలానికి చెందిన ఓ అక్రమ బియ్యం వ్యాపారి, సత్తుపల్లి మండలంలో నాలుగు నుండి ఆరుగురు వ్యక్తులను అనుచరులుగా నియమించుకుని సన్నబియ్యాన్ని దారి మళ్ళిస్తున్నాడు. గతంలో కేజీ 19 రూపాయలు చెల్లించిన దత్తాత్రేయుడు, సన్నబియ్యానికి రూ. 25 నుండి రూ.30 చెల్లిస్తుండటంతో అక్రమ వ్యాపారులు సన్న బియ్యాన్ని తెలంగాణ సరిహద్దు ప్రాంతం గురుభట్లగూడెం గ్రామానికి తరలించి, డంప్ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అక్రమ వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై సుమారు 4 క్వింటాళ్ళ బియ్యాన్ని దాటిస్తూ కనిపించారు. ఎవరికి తరలిస్తున్నారు. ఎక్కడి తరలిస్తున్నారని ప్రశ్నిచగా జంకూ,బొంకు లేకుండా దత్తాత్రేయుడుకి తరలిస్తున్నామని చెప్పటం విశేషం. ప్రతి రోజు ఆరుగురు వ్యక్తులు ఉదయం, మద్యాహ్నం, సాయంత్రం ఒక్కో ద్వి చక్ర వాహనంపై 2 క్వింటాళ్ళ చొప్పు న్న సుమారు 12 క్వింటాళ్ళ లెక్కన రోజుకు 4 టన్నుల బియ్యాన్ని తరలిస్తున్నారంటే అక్రమ దందా ఏ రకంగా జరుగుతుందో ఇట్టే అర్ధం చేసుకోవచ్చు. సన్నబియ్యాన్ని సైతం అక్రమ వ్యాపారులు దారి మళ్ళించి భారీగానే సొ మ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వం పే దలకు సన్నబియ్యం పంపిణీ చేసి పే దల రాతలు మార్చాలని చూస్తుంటే, అక్రమ వ్యాపారులు అధిక ధరల ఆశ చూపి పేదల కడుపుకొడుతూ, వారి కడుపులు నింపుకుంటున్నారు. అక్రమ వ్యా పారుల ఆట కట్టించి పేదలకు అందుతున్న సన్న బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## ఈసబ్ రిజిస్ట్రార్ మాకొద్దు మంత్రి గారూ...

సబ్ రిజిస్టర్‌పై మంత్రికి ఫిర్యాదు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**బూర్గంపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి తరచూ మద్యం సేవించి విధులకు హాజరవుతూ, కార్యాలయంకు వచ్చే ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ మాకొద్దు అంటూ పలువురు స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసి, వినతి పత్రం అందించారు. శుక్రవారం బూర్గంపాడు మండలంలో పర్యటించిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసినస్థానికులు తమ గోడును మంత్రికి వెళ్లబుచ్చుకున్నారు. ఐదు మండలాలకు సేవలు అందించవలసిన బూర్గంపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్‌గా నియమితులైన సీనియర్ అసిస్టెంట్, ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ తరచు మద్యం సేవించి కార్యాలయానికి హాజరవుతున్నారని స్థానికులు మంత్రికి తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద లేకుండా మాట్లాడుతూ, అకారణంగా గొడవలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్టిఫికెట్స్ కోసం వచ్చే ప్రజలను లంచాలు అభ్యర్థిస్తూ, ఇవ్వకపోతే కాలయాపన చేస్తూ నానా ఇబ్బందులు పెడుతున్నారనిమంత్రికి తెలిపారు. బూర్గంపాడు సబ్ రిజిస్టర్‌పై చర్యలు తీసుకుని, వేరే రిజిస్ట్రార్‌ను బూర్గంపాడు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో నియమించి మండలంలోని ప్రజలకు న్యాయము చేయాలని స్థానిక ప్రజలు మంత్రిని కోరి, వినతి పత్రం అందించారు.

## సన్నబియ్యంతో పేదల కుటుంబాల్లో సంతోషం

ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పేదల కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతుందన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. శుక్రవారం పట్టణంలోని గుడిపాడులోని ఆదివాసీ గంటా విష్ణు కుటుంబంతో కలిసి ఎం.ఎల్.ఏ రాగమయి, దయానంద్ దంపతులు సన్న బియ్యంతో వండిన ఆహారంతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి, తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే డా.మట్టా దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మాజీ కౌన్సిలర్స్ పద్మ జ్యోతి, సీనియర్ నాయకులు , ఎన్‌ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర శ్రమతో లక్ష్యాలు సాధన: కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిరంతర శ్రమతో జీవితంలో మనం నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం బొమ్మ విద్యా సంస్థల్లో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు తమ లక్ష్యంపై స్పష్టత అవసరమన్నారు. చిన్నతనం నుంచి ఇతరుల గైడెన్స్‌తో మనం ఈ స్థాయికి వచ్చామని ప్రస్తుతం మనకు ఏమి కావాలి, మనం ఏమి సాధించాలి అనే ప్రశ్న వేసుకుని ఆ దిశగా ప్రయాణం ప్రారంభించాలని సూచించారు. యవ్వనంలో మనకు సంపూర్ణ శక్తి ఉంటుందని దానిని సంపూర్ణంగా వినియోగించుకుని గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. శ్రమ లేకుండా మనకు ఏది రాదని, ధైర్యం, ధృఢ సంకల్పంతో పాటు శ్రమ కలిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. యువత కాంపౌండింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మనం చేసే పని శాశ్వతంగా ఉండిపోతుందని అదే మనకు గుర్తింపు తీసుకువస్తుందన్నారు. మనం గొప్ప స్థాయికి చేరుకున్నాక మరో పది మందికి సాయం చేయాలని మన గ్రామాలు, ఊర్లను అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందించాలన్నారు. ఈ సందర్భంగా ఇస్రో మాజీ సీనియర్ శాస్త్రవేత్త డా॥ గంజి వెంకటనారాయణను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సైకాలజిస్టు డా॥ అశోక్ పరికిపండ్ల, ప్రిన్సిపాళ్లు భిక్షం, విజయ్‌భాస్కర్, రంజిత్, అకాడమిక్ డీన్ కిరణ్, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కళావతిబాయి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అ ందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా క్టర్ కళావతిబాయి తెలిపారు. డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప నిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు, డే టా ఎంట్రీ ఆపరేటర్లకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, నిధుల (ఫండ్స్) ఉపయోగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళావతిబాయి మా ట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్ల పని తీరు మెరుగుపడాలన్నారు. మందుల వివరాలన్ని ఈ ఔషధిలో ప్రతి రోజు నమోదు చేయాలని, పిహెచ్‌సిలో ఉన్న మందుల వివరాలు డిస్‌ప్లే బోర్డు మీద అందరికీ అర్థమయ్యేవిధంగా రాసి పెట్టాలన్నారు. క్రొత్తగా వ చ్చిన ఎంఎల్‌హెచ్‌పిలకు, డిఇఒలకు హెచ్‌ఐఎంఎ స్, ఎన్‌సిహెచ్ కిట్స్, ఎఫ్‌పిఎల్, ఎంఐఎస్, ఆరో గ్య మహిళ, అమ్మ కోసం, పిఎంఎస్‌ఎం, ఎ విన్, ఈ విన్, యు విన్, ఈ ఔషధి, ఈ సంజీవని, ఐఎ ంఐ, ఎన్‌సిడి, టెలిమాసెస్, వయో వృద్ధుల ఆరో గ్య రక్షణ, ఐడిఎస్‌పి, ఎన్‌ఎల్‌ఈపిటి హబ్ మొదలైన జాతీయ ఆరోగ్య మిషన్ పోర్టల్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డా క్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్ట ర్,డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## వంట గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:**కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ పెట్రోల్ డీ జిల్ ధరలను తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారాటి రమేష్‌లు అన్నారు. శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలో సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేం ద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వంట గ్యాస్ ధరలను బండకు 50 రూపాయల చొప్పున పెట్రోల్ గ్యాస్ ధరలను పెంచడం వలన పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల ప్రజలకు మోయలేని భారమని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల రాబోయే రోజులలో మరిన్ని పోరాటాలు చేస్తారని ప్రభుత్వామన్ని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు , రైతు సంఘం నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## బజాజ్'గోగో' ఎలక్ట్రిక్ ఆటో విడుదల



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్యాసింజర్ ఆటో రంగంలో దిగ్గజ సంస్థయైన బజాజ్ ఆటో ఆధ్వర్యంలో రూపొందించిన బజాజ్ గో గో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ ఆటోను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం వెంకటరమణ ఆటో మొబైల్స్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన ఎలక్ట్రిక్ ఆటోను విడుదల చేశారు. ఈ సందర్భంగా బజాజ్ కంపెనీ ప్రతినిధులు ఆర్‌ఎం బాబ్జీ మాట్లాడుతూ బజాజ్ అంటే ఒక నమ్మకం, భరోసా అని తెలిపారు. బజాజ్ కంపెనీని ఇంతలా ఆదరిస్తున్న కస్టమర్ల కొరకు అతి తక్కువ మెయింటినెన్స్‌తో సుమారు 250 కిలో మీటర్ల మైలేజీతో కొత్త బజాజ్ గో గో ఎలక్ట్రిక్ ఆటోను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఈ సందర్భంగా వివిసి గ్రూప్స్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలో బజాజ్ ఆటోను ఇంతలా ఆదరిస్తున్న కస్టమర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బజాజ్ గో గో పవర్‌ఫుల్ 12కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో ఒక్కసారి చార్జ్ చేస్తే సుమారు 250 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. ఆకర్షణీయమైన డిజైన్‌తో పూర్తి మెటల్ బాడీ కలిగి రెండు స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్ మిషన్‌తో, ఆటో డెంజర్, యాంటీ రోల్ డిటెక్టివ్, ఎల్‌ఈడి లైట్స్‌తో లభ్యమవుతుందన్నారు. బజాజ్ గో గో ఈవి రెండు వెరియంట్లలో ఎక్స్ షోరూం ధర రూ. 3,26,798 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. కస్టమర్ల అభిప్రాయం మేరకు మాచే నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన డబుల్ స్టేర్ షోరూం నందు క్విక్ సర్వీస్ క్యాంపు ఉందని దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జజాజ్ కంపెనీ ప్రతినిధులు, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తోలకాలలకు అడ్డుకట్ట ఎప్పుడూ..?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:**సత్తుపల్లి మండలంలో అక్రమ మైనింగ్ తో చెరువులు గుట్టలు, కాలువలను త్వవ్వేస్తుంది మట్టి మాఫియా, మాఫియా దెబ్బకు గుట్టలు కరిగిపోతుండగా, భారీ వృక్షాలు మాయమవుతున్నాయి. భూగర్భ జలాలు ఆవిరై పోతున్నాయి. భూసారం దెబ్బతింటుంది. పశువులు మేతకు స్థలం లేకుండా పోతుంది. ఓ పక్క సింగరేణి బొగ్గు కోసం భూమిని తవ్వుతుండగా, మరోపక్క ఈ మట్టి మాఫియా పంట భూములకు భారీ గుంటలు పెడుతుండటంతో మూగ జీవాలకు పశుగ్రాసం దొరికే పరిస్థితి కనిపించటం లేదు. ప్రధానంగా ముగ్గురు వ్యక్తుల చేతుల్లోనే మట్టి మాఫియా నడుస్తుంది. ప్రశ్నిస్తున్న ప్రజలకు, ప్రజా సంఘాల నాయకులకు మట్టి మాఫియా జంకు, బొంకు లేకుండా అందరికి అందించే పనులు చేస్తున్నామని, తమను ఎవరు



అడ్డగించరని, అధికారులకు లేని నొప్పి మీకెందుకని ఎదురు దాడి చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియా దెబ్బకు పల్లపు భూములు, లోతట్టుగా మారుతున్నాయని, రానున్న వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని మూగజీవాలు మేతకు వెళ్ళినప్పుడు మట్టి మాఫియా తీసిన గోతులలో పడి మృతి చెందుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఫియా దెబ్బకు ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండి పడుతుందని ఇదే సందర్భంలో కింది స్థాయి అధికారుల ఆదాయానికి అంతేలేకుండా పోతుందని మట్టి తోలకాలు ఎక్కడ జరుగుతున్నాయి. ఎన్ని వాహనాలు ఉపయోగిస్తున్నారు. ఎటువంటి అనుమతులున్నాయి తదితర విషయాలను తెలుసుకోవాలని సిబ్బందిని అధికారులు పంపినా, వారు మాఫియా ఇస్తున్న పైసలు తీసుకుని తప్పుడు సమాచారాని అధికారులకు అందించి చేతులు దులుపుకుంటున్నట్లు గుస, గుసలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి మండలంలో ఎన్నాళ్ళుగానే సాగుతున్న మట్టి మాఫియా దందా ఆటకట్టించేదెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే అక్రమ మట్టి తోలకాలను అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# క్రీడ

## వెస్టిండీస్ వరల్డ్ కప్ ఆశలు సజీవం




ఐసిసి మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2025లో మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ అదరగొట్టింది. స్కాట్లాండ్ చేతిలో ఓటమి నుంచి తేరుకున్న విండీస్ ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో ఐర్లాండ్‌ను ఓడించింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (424) అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో వరల్డ్ కప్ అవకాశాల్ని సజీవంగా ఉంచుకుంది. శుక్రవారం జరిగిన పోరులో 182 లక్ష్యాన్ని నిర్దేశించిన విండీస్.. 6 పరుగుల తేడాతో గెలుపొందింది ఆఖరి ఓవర్లో 7 పరుగులు అవసరం కాగా.. అల్లెయె కెల్లీ(18) ని బౌల్డ్ చేసిన మాథ్యూస్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 33 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌కు ఆదిలోనే షాక్. కెప్టెన్ హేలీ మాథ్యూస్(23), ఓపెనర్ క్వియానా జోసెఫ్ 4 పరుగులకే ఔటయ్యారు. 29వ ద్దే రెండు వికెట్ల పడినా సరే.. జైదా జేమ్స్(36)తో కలిసి స్టెఫానీ ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఆ తర్వాత వచ్చిన చినెల్లె హెన్రీ(46 నాటౌట్) కడదాకా నిలబడి జట్టుకు భారీ స్కోర్ అందించింది.

అనంతరం ఛేదనలో ఐర్లాండ్ ఓపెనర్లు అమీ హంటర్(48), గాబీ లెవిస్(17) దంచికొట్టారు. తొలి వికెట్‌కు 52 రన్స్ జోడించి విజయానికి గట్టి పునాది వేశారు. అయితే.. మాథ్యూస్ విజృంభణతో ఐరిష్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. మిడిల్ ఓవర్లలో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన లారా డెలానీ(32), కౌల్టర్ కెల్లీ(26)లను అలియాహ్ అల్లెయ్నే వెనక్కి పంపి ఐర్లాండ్‌ను కష్టాల్లోకి నెట్టింది. చివర్లో ధాటిగా ఆడిన అల్లెయె కెల్లీని() ఔట్ చేసిన మాథ్యూస్ విండీస్‌ను గెలిపించింది.

## అదొక్కటే నన్ను బాధిస్తోంది

### ప్రియాన్ష్ ఆర్య



ఐపిఎల్ 2025లో భాగంగా ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్ల ఉత్కంఠభరితమైన మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు ప్రియాన్ష్ ఆర్య వేగంగా సెంచరీ బాదేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఏప్రిల్ 8న జరిగిన ఈ మ్యాచ్ లో పంజాబ్ యువ బౌలర్ చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. 8 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయినా.. కేవలం 39 బంతుల్లో సెంచరీ సాధించి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్ అనంతరం ప్రియాన్ష్ ఆర్య మాట్లాడుతూ.. ధోనితో మాట్లాడాలని అనుకున్నప్పటికీ తనకు ఆ ఛాన్స్ దొరకలేదని.. అదొక్కటే తనను బాధిస్తోందని చెప్పాడు. ధోని లాంటి ఆటగాళ్లతో ఆడే గొప్ప అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుందని ప్రియాన్ష్ పేర్కొన్నాడు. ధోనితో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాడు. వికెట్ల వెనుక ధోని ఉన్నప్పుడు ఒత్తిడే సహజమేనని.. అశ్విన్ లాంటి లెజండరీ బౌలర్లను ఎదుర్కొన్నప్పుడు కూడా ఒత్తిడి ఉంటుందన్నాడు. అలాంటి సమయంలో శతకం సాధించడం చాలా ఆనందంగా ఉందన్నాడు. మ్యాచ్ తర్వాత ధోనితో మాట్లాడలనుకున్నానని.. కానీ ఇంటర్వ్యూ ముగించుకునేసరికి ఆయన వెళ్లిపోయారని.. ధోనితో మాట్లాడలేకపోయానని ప్రియాన్ష్ ఆర్య చెప్పుకొచ్చాడు. పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గురించి కూడా ప్రియాన్ష్ ఆర్య మాట్లాడాడు. సీఎస్కేతో మ్యాచ్ కంటే ముందు రాజస్థాన్ తో తొలి బంతికే ఔటయ్యానని .. దానికి చాలా బాధపడ్డానంటూ ప్రియాన్ష్ ఆర్య చెప్పుకొచ్చాడు. కానీ కోచ్ రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒక్కసారి కూడా విమర్శించలేదన్నాడు. బ్యాటింగ్ ఎలా మెరుగుపరచుకోవాలో చెప్పి తనలో స్ఫూర్తినింపారని ప్రియాన్ష్ ఆర్య స్పష్టం చేశాడు.

## తిప్పేసిన కోల్‌కతా స్పిన్నర్లు..



ఐపిఎల్ 18వ సీజన్‌లో కీలక మ్యాచ్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు సమిష్టిగా విఫలమయ్యారు. తమ సొంత మైదానమైన చెపాక్‌లో దంచలేక చేతులెత్తేశారు. టర్నింగ్ పిచ్ మీద కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్ అస్త్రం సునీల్ నరైన్(313) విజృంభణతో సీఎస్కే ఆటగాళ్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. విజయ్ శంకర్(29), రాహుల్ త్రిపాఠి(16).. సిక్సర్ల శివం దూబే(31 నాటౌట్) తనదైన శైలిలో సైతం బౌండరీలు కొట్టలేకపోయాడు. డెత్ ఓవర్లలో మూడు బౌండరీలతో 100 దాటించి.. జట్టుకు గౌరవ ప్రదమైన స్కోర్ అందించాడు. ఈ ఎడిషన్‌లో ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం. పద్దెనిమిదో సీజన్‌లో వరుసగా నాలుగు పరాజయాలు. అది చాలదన్నట్టు కెప్టెన్ అనూహ్యంగా గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మళ్లీ సారథిగా ఎంఎస్ ధోనీ పగ్గాలు అందుకున్నా సరే చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ మాత్రం మెరుగవ్వలేదు. ఛేదనలో విఫలమయ్యే సీఎస్కే స్టార్లు. ఈసారి మొదట బ్యాటింగ్ అవకాశం వచ్చినా భారీ లక్ష్యాన్ని నిర్దేశించలేకపోయారు. మరోసారి చెపాక్ స్టేడియంలో ఓపెనర్లు డెవాన్ కాన్వే(12), రచిన్ రవీంద్ర(4)లు విఫలం అయ్యారు. మోయిన్ అలీ బౌలింగ్‌లో డెవాన్ కాన్వే స్వీప్ షాట్ ఆడబోయి ఎల్బీగా వెనుదిరిగడంతో మొదలు చెన్నై వికెట్ల పతనం మొదలైంది. కాసేపటికే హర్షిత్ రానా వేసిన షార్ట్ పిచ్ బంతికి రచిన్ రవీంద్ర(0) బోల్తా పడ్డాడు. 16 పరుగులకే 2 కీలక వికెట్లు పడిన దశలో విజయ్ శంకర్ (29), రాహుల్ త్రిపాఠి(16)లు కాసేపు ధాటిగా ఆడుతున్నారు. దాంతో, సీఎస్కే ఆరు ఓవర్లకు 31 రన్స్ కొట్టింది. కానీ, ఆ తర్వాత సునీల్ నరైన్(313) తిప్పేశాడు. శంకర్, దీపక్ హుడా(0)లను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. అశ్విన్(1)ను హర్షిత్ రానా పెవిలియన్ పంపాడు. జడేజా(0)ను , ఎంఎస్ ధోనీ(1)ని ఎల్బీగా ఔట్ చేసి సీఎస్కే భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు నరైన్. ప్రధాన ఆటగాళ్లంతా డగౌట్ చేరడంతో శివం దూబే(31 నాటౌట్)కు సహరించేవాళ్లు కరువయ్యారు. వైభవ్ అరోరా బౌలింగ్‌లో నూర్ అహ్మద్(1) కొట్టిన బంతిని వెంకటేశ్ అయ్యర్ డైవ్ చేస్తూ అందుకున్నాడు. అంతే. 79 వద్ద 8వ వికెట్ పడింది. ఆ తర్వాత దూబే 19వ ఓవర్లో బౌండరీతో కొట్టాడు. 20వ ఓవర్లో ఫైన్ లెగ్ దిశగా ఫోర్.. ఆఖరి బంతికి బౌండరీ సంధించి స్కోర్ 100 దాటించాడు. దాంతో, సీఎస్కే 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేయగలిగింది.

# రీల్



## అక్కకి ప్రియ తమ్ముడిని

### విజయశాంతి కాళ్లకు నమస్కరించిన పృథ్వీ

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. సయీ మంజ్రేకర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా 'ముచ్చటగా బంధాలే' అంటూ సాగే లిరికల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయశాంతి చిత్ర బృందాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా బబ్లూ పృథ్వీరాజ్‌ని పిలవగా ఆయన వచ్చి విజయశాంతి కాళ్లకు నమస్కారం చేశారు. 'మీరు నా చిన్న తమ్ముడు' అని అనగా.. 'నేను అక్కకు ప్రియమైన తమ్ముడిని' అంటూ పృథ్వీ వేదికపై చెప్పిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. దీంతో వీరిద్దరూ కలిసి ఎప్పుడు సినిమాల్లో నటించారా?అని నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. 1997లో వచ్చిన 'పెళ్లి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన పృథ్వీ దాదాపు 200లకు పైగా తమిళ, మలయాళ చిత్రాల్లో నటించారు.

## భర్త బ్లేజర్ ధరించి..



అలనాటి నటి భానుప్రియ సోదరి, నటి శాంతి ప్రియ తన లేటెస్ట్ లుక్‌తో అందరినీ షాక్‌కు గురి చేశారు. చనిపోయిన తన భర్త సిద్ధార్థ్ రాయ్ బ్లేజర్ ధరించి.. గుండుతో ఫొటోలకు పోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. అందానికి తనదైన శైలిలో నిర్వచనం ఇచ్చేందుకే తాను ఈవిధంగా చేసినట్లు చెప్పారు. మనోధైర్యంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.''ఇటీవల నేను గుండు చేయించుకున్నా. విభిన్నమైన అనుభూతిని పొందుతున్నా. మహిళగా మనం జీవితంలో కొన్ని పరిమితులు పెట్టుకుంటాం. సమాజం పెట్టిన కట్టుబాట్లు, నియమ నిబంధనలు పాటిస్తూ మనల్ని మనమే కట్టడి చేసుకుంటాం. ఈవిధమైన మార్పుతో అన్నింటినుంచి నేను విముక్తి పొందాను. ప్రపంచం మనపై విధించిన అందం ప్రమాణాలను విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశంతో ఇలా చేశాను. మనసు నిండా ధైర్యం, నమ్మకంతో ఇలా చేశా. నా భర్తకు సంబంధించిన బ్లేజర్ ధరించి.. ఆయన ఇంకా నా వద్దనే ఉన్నారనే అనుభూతిని పొందాను'' అని శాంతిప్రియ రాసుకొచ్చారు. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. కొంతమంది ఆమె నిర్ణయాన్ని విమర్శిస్తున్నారు. ఇది ఏమాత్రం బాలేదంటున్నారు.

## ఇంట్రో సీన్స్‌తో స్టార్ట్




ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమా షూట్ ఈ నెల 22 నుంచి కొత్త షెడ్యూల్ స్టార్ట్ కానుంది. ఐతే, తాజాగా ఈ షెడ్యూల్ గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో ఎన్టీఆర్ ఎంట్రీ సీన్స్‌ను షూట్ చేస్తారని టాక్. ఇక ఈ మూవీ టైటిల్ 'డ్రాగన్' అని ప్రచారంలో ఉంది. ఐతే, 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి.

## మిమ్మల్ని చూస్తుంటే భయంగా ఉంది

### - త్రిష



సోషల్‌మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. 'విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్‌మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని? మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. మీతోపాటు జీవించే వారి విషయంలో బాధగా అనిపిస్తుంది. నిజం చెప్పాలంటే మీది పిరికితనం. ఆ దేవుడు ఆశీస్సులు మీకు ఉండాలని కోరుకుంటున్నా' అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ఆమె రోల్‌ను కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంత మంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు ఆమె గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు.

## 'కంచగచ్చిబౌలి భూమి' ప్రభుత్వానిదే...

### 'ఎంపవర్ కమిటీ' వివరాలను వెల్లడించిన ఎంపిలు కిరణ్ కుమార్ రెడ్డి, రఘురాంరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని శేరిలింగంపల్లి మండలంలోని సర్వే నెం 25లోని భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి అని కాంగ్రెస్ ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురాంరెడ్డి సుప్రీం కోర్ట్ ఏర్పాటు చేసిన ఎంపవర్ కమిటీకి వివరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంపవర్ కమిటీ సభ్యులను కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురాంరెడ్డి శుక్రవారం కలిసి వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచ గచ్చిబౌలి సర్వే నం.25లోని భూమి 'కంచ అస్తబల్ పోరంబోకే సర్కారీ' అంటే ప్రభుత్వ భూమిగా నమోదైందని వివరించారు. 1975లో యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25,ఇతర సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమిని స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ఈ భూమి అన్యాక్రాంతమైందన్నారు. రెవెన్యూ రికార్డులు, అటవీ శాఖ ప్రకారం సర్వే నంబర్ 25లోని భూమిని 'అటవీ'గా వర్గీకరించలేదని, తెలిపారు.



## ఔటర్ పరిధిలో హద్దుల నిర్ణయానికి ఎన్‌ఆర్‌ఎస్‌సితో ఒప్పందం




- ఇక భూమి వివరాలు ఎంతో సులభం
- ఎంఓయుపై ఇరు సంస్థల సంతకం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ స్థలాలు, చెరువుల సంరక్షణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో హద్దులు నిర్ణయించేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో (ఎన్‌ఆర్‌ఎస్‌సి)తో శుక్రవారం ఎంఓయు కుదుర్చుకుంది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌ఆర్‌ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరు శాఖలకు చెందిన పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు. ఎన్‌ఆర్‌ఎస్‌సి సహకారంతో శాటిలైట్ చిత్రాల ద్వారా సరిహద్దులు నిర్ణయించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ తెలిపారు. ఎక్కడ చెరువు ఉంది, ఆ చెరువు విస్తీర్ణం ఎంత, కాలువలు, నాలాల పరిస్థితి ఏంటనే వివరాలను రూపొందించడంలో ఎన్‌ఆర్‌ఎస్‌సి సాంకేతికత తమకు ఉపయోగపడుతుందన్నారు. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా లక్ష్యమని తెలిపారు. ఔటర్ పరిధిలో ప్రభుత్వ స్థలాల సరిహద్దులను నిర్ణయించడంలో ఇక నుంచి తేలిక అవుతుందన్నారు. ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల వివరాలతో పాటు చెరువుల హద్దులు అందుబాటులో ఉంటే ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన నిపుణులతో 100 శాతం నమ్మకమైన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకు రావడంలో ఎన్‌ఆర్‌ఎస్‌సి శాటిలైట్ చిత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల సమాచారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎన్‌ఆర్‌ఎస్‌సితో నేడు కుదుర్చుకున్న ఒప్పందం మైలురాయి లాంటిదన్నారు. 1970వ సంవత్సరంలో సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసిన టోపో షీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచారంతో పాటు ఎన్‌ఆర్‌ఎస్‌సి శాటిలైట్ ఇమేజీలతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకురావడమే హైడ్రా లక్ష్యమన్నారు. చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పర్యావరణ హితమైన నగరాన్ని రూపొందించడానికి ఇంత పెద్దయెత్తున చర్యలు తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలబడుతుందని ఎన్‌ఆర్‌ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే, దేశంలోనే గొప్ప నగరంగా హైదరాబాద్‌కు పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. హైడ్రా చర్యలతో ఇది సాధ్యమౌతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

## గోండియా–బల్హార్షా డబ్లింగ్ ప్రాజెక్ట్‌కు ఆమోదం




### తెలంగాణకు జరిగే ప్రయోజనాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

ప్రజాపక్షం/హైదరాబాద్: గోండియా–బల్హార్షా డబ్లింగ్ ప్రాజెక్ట్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపిందని, ఈ ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ, ఛతీస్‌ఘడ్ రాష్ట్రాలకు ప్రయోజనాలు చేకూరుతాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలను ముంబై నుంచి అశ్వినివైష్ణవ్ అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ నుండి సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర డివిజన్ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన గోండియా–బల్హార్షా డబ్లింగ్ ప్రాజెక్టు ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య ప్రయాణీకులకు అలాగే సరుకు రవాణాకు ఎంతగానో సహాయపడుతుందని అన్నారు. గోండియా–బల్హార్షా మధ్య 240 రూట్ కిలోమీటర్ల మేర డబ్లింగ్ ప్రాజెక్టును రూ.4,819 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నామని తెలిపారు. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడ ప్రాంతాలలో ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని అనేక జిల్లాల్లో ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని రైల్వే మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మహారాష్ట్రలోని గోండియా, భండారా, గడ్చిరోలి, చంద్రాపూర్ జిల్లాలు, తెలంగాణలోని కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలు ఎంతో ప్రయోజనం పొందుతాయని తెలియజేశారు. గోండియా బల్హార్షా మధ్య ఉన్న సెక్షన్‌లో 29 స్టేషన్లు, 36 వంతెనలు, 338 చిన్న వంతెనలు, 67 ఆర్‌యుబిలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పర్యాటక రంగానికి ఊతం ఇవ్వడమే కాకుండా, కాజీపేట బల్హార్షా గ్రాండ్ ట్రంక్ మార్గం ద్వారా మరిన్ని సరుకు రవాణా, ప్రయాణీకుల రైళ్లను నడపడంలో సహాయపడుతుందని తెలిపారు.

## నిరుద్యోగం అంతం

(మొదటి పేజీ తరువాయి)

కలగకుండా అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్ మేళా విజయవంతమైందన్నారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 23,238 మంది నిరుద్యోగ యువత హాజరు కదా 5,631 మందికి ఉద్యోగాలు లభించాయని, 9046 మంది ఉద్యోగ అభ్యర్థికి ఫైనల్ రౌండ్ కి షార్ట్ లిస్టు అయ్యారని, వీరికి మరొక పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని ఆయా కంపెనీల నిర్వాహకులు తెలిపారు. అయితే ఇంత సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు అయి... సంపూర్ణంగా వినియోగించుకోవడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంకి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు చెప్పారు.

**జాబ్ మేళాలో తొక్కిసలాట**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాలో తొక్కిసలాట కలకలం రేపింది. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎం. కె. నాయుడు హోటల్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో అంచనాకు మించి నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో నిర్వాహకులు అదుపు చేయాలేకపోయారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. దాంతో హోటల్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన భారీ అద్దాలు పగిలిపోవడంతో ముగ్గురు యువతులకు గాయాల్యాయి, వెంటనే స్పందించిన పోలీసులు క్షతగాత్రులను ఎంజిఎం హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు.

## చైనా ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

చైనా. అమెరికా టారిఫ్‌లను విపరీతంగా పెంచడం ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఒక పరిహాసంగా మిగిలిపోతుందని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత సుంకాల రేటుతో అమెరికా వస్తువులను దిగుమతి చేసుకోవడానికి అమెరికా మార్కెట్ సిద్ధంగా ఉండదని వ్యాఖ్యానించింది. ఒకవేళ అమెరికా సుంకాలు ఇంకా పెంచితే, ఆ దేశ వస్తువులను చైనా పూర్తిగా దూరం పెడుతుందని పేర్కొంది. అమెరికా నుంచి చేసుకుంటున్న దిగుమతులపై పెంచిన టారిఫ్ శనివారం నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే, ఈ సమస్యను చర్చించడానికి చైనా ఎప్పుడూ సిద్ధంగానే ఉందని స్పష్టం చేసింది.

## పిడుగుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

గయ, పాట్నా, షేక్‌పురాలో నలుగురు చొప్పున, జమైలో ముగ్గురు, జెహానాబాద్‌లో ఇద్దరు, గోపాల్‌గంజ్, ముజఫర్‌నగర్, అర్వాల్, దర్భాంగ, బెగుసరాయ్, సహ్రస, కటిహార్, లఖిసరాయ్, నవాడ, భగల్‌పూర్ జిల్లాల్లో ఒకరు చొప్పున మృతి చెందారు. అదే విధంగా పిడుగులు, వడగళ్ల వర్షాలకు అనేక మంది ధ్వంసమయ్యాయి. పశువులు మృత్యువాత పడ్డాయి. వ్యవసాయ పంటలు దెబ్బ తిన్నాయి. ప్రభావిత ప్రాంతాల్లో ఉపశమన, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. మృతుదేహాలను పోస్టు మార్టం తరువాత వారి బంధువులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. అనేక ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలిపోగా వాటిని తొలగిస్తూ వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తున్నారు. ఈ చర్యల్లో పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో మోహరించి యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. కాగా, పిడుగులు, వర్షం సంబంధిత ఘటనల్లో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 4 లక్షల పరిహారం ప్రకటిస్తునట్లు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజల ఎవరూ అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం, బీహార్‌లోని నాలుగు జిల్లాల్లో పిడుగుపాటుకు 13 మంది మరణించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టబడిన తాజా బీహార్ ఆర్థిక సర్వే (2024–25) నివేదిక ప్రకారం... 2023లో రాష్ట్రంలో 275 పిడుగులు/ఉరుములతో కూడిన మరణాలు సంభవించాయి. రోహ్తాస్ (25), గయ (21), ఔరంగాబాద్ (19), జముయ్ (17), మాధేపురా, భాగల్పూర్ (16 చొప్పున)లలో నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, జార్ఖండ్ హజారిబాగ్ జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి చెందారు. పద్మ, చుర్చు బ్లాక్‌లలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటనలు జరిగాయి. పద్మలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వారు పశువులను మేపేందుకు వెళ్లగా వర్షం కారణంగా ఓ గుడిసెలకి వెళ్లారు. దీంతో గుడిసెపై పిడిగుపడడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా చుర్చులో వంటక చెరకుకోసం అడవికి వెళ్లగా పిడుగుపడి ఓ వ్యక్తి మరణించాడు. మృతదేహాన్నింటినీ పోస్టుమార్టం నిమిత్తం షేక్ భిఖారీ మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి గురువారం సాయంత్రం తరలించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com